

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 1-6-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 63 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి రా.8.00 తదుపరి సప్తమి; నక్షత్రం: ఆశ్లేష రా.9.36 తదుపరి మఖ; వర్జ్యం: ఉ.10.10-11.48; దుర్ముహూర్తం: సా.4.58-5.50; అమృతఘడియలు: రా.7.58-9.36; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.42 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మన యుద్ధ విమానాలు కూలటం నిజమే



- ఆరింటిని కూల్చామన్న పాక్ ప్రకటన తప్పు
- వ్యూహపరమైన తప్పిదం జరిగింది.. వెంటనే సరిదిద్దాం
- 2 రోజుల్లోనే అన్ని విమానాలు ఎగిరి పాక్‌ను దెబ్బకొట్టాయి
- ఆ దేశానికి చైనా ఇచ్చిన గగనతల వ్యవస్థలు పనిచేయలేదు
- చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ వెల్లడి
- ఫైటర్లు కూలాయని తొలిసారి అధికారికంగా అంగీకారం

2

లోకేశ్‌కు పట్టం

కొత్త పలుకు!



టీడీపీలో ఇప్పుడు మూడో తరం ప్రవేశించింది. కడపలో నిర్వహించిన మహానాడు బాధ్యతను మూడో తరానికి చెందిన లోకేశ్ చేపట్టారు. పార్టీ బాధ్యతలు మోయగల శక్తియుక్తులు తనకు ఉన్నాయని నమ్మకం కలిగించగలిగారు. లోకేశ్‌కు ఎదురైనన్ని అవమానాలు మరే ఇతర నాయకుడికీ ఎదురవలేదు. జగన్ అండ్ కో ఒక పథకం ప్రకారం లోకేశ్‌ను కించపరిచే విధంగా ప్రచారం చేశారు. పప్పు అని అవమానించారు. ఆయన భాషను హేళన చేశారు. చివరికి ఆయన పుట్టుకపై కూడా జుగుప్సాకరంగా మాట్లాడారు. మామూలుగా అయితే ఇన్ని అవమానాలు ఎదురైనపుడు మానసికంగా కుంగిపోతాం. అయితే లోకేశ్ వాటిని పట్టించుకోకుండా లక్ష్యం వైపు కదిలారు. తానేమిటో రుజువు చేసుకోవడానికి అహరహం కృషి చేశారు.

చంద్రబాబు పర్యవేక్షణలో లోకేశ్ పార్టీ బాధ్యతలను చేపడితే ఇటు కార్యకర్తలు, అటు ప్రజలకు కూడా భరోసా ఏర్పడే అవకాశం ఉంది.

తెలుగుదేశం పార్టీని లోకేశ్ నడిపించడానికి నిజానికి ఇదే సరైన తరుణం. ఇప్పుడు పార్టీ బలంగా ఉంది. ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై ప్రజల్లో కోపం ఇంకా పోలేదు. నాయకత్వ మార్పిడికి ఇంతకంటే మంచి తరుణం ఏముంటుంది?

తెలంగాణలో కేసీఆర్ కూడా పార్టీ నాయకత్వాన్ని కుమారుడు కేటీఆర్‌కు బదలాయించాలని అనుకున్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్‌ను నియమించారు. కార్యకర్తలతో సంబంధాలను పటిష్ఠం చేసుకోవడంలో కేటీఆర్ విఫలమయ్యారు. ఇప్పుడు పార్టీ అధికారంలో లేదు కనుక కేటీఆర్ నాయకత్వాన్ని ఆయన సోదరి కవిత వ్యతిరేకిస్తున్నారు. కేటీఆర్ నాయకత్వంలో తాను పనిచేయనని ఆమె ప్రకటించారు.

కాలూ చేయీ సరిగ్గా ఉన్నప్పుడే అన్నీ చక్కదిద్దుకోవాలని అంటారు. చంద్రబాబుకు 75 ఏళ్ల వయసు వచ్చినప్పటికీ మానసికంగా, శారీరకంగా ఆయన దృఢంగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో శషభిషలకు స్వస్తి చెప్పి లోకేశ్‌ను పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నియమించే విషయంలో ఆయన ఒక నిర్ణయం తీసుకోవాలి.

4

చంద్రబాబులో మొహమాటం ఎక్కువ. లోకేశ్ అలా కాదని, కరాఖండీగా వ్యవహరిస్తారని అంటున్నారు. తండ్రిని మించిన తనయుడు అని రుజువు చేసుకోవాలన్న పట్టుదల కూడా ఆయనలో కనిపిస్తోంది. అన్నీ మంచి శకునములే అన్నట్టుగా పార్టీ నియమావళికి అనుగుణంగా నాయకత్వ మార్పిడికి చంద్రబాబు శ్రీకారం చుడతారా? లేదా? అంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే.

ప్రపంచ సుందరి థాయ్ సిరి

మన వెంబడి ఒకరున్నారన్న ధైర్యమే.. నిజమైన విజయం. బాల్యంలో తల్లిదండ్రులు మన వెన్నంటి ఉన్నట్టుగానే.. సమస్యల్లో ఉన్నవారికి అండగా నిలబడటం నా బాధ్యతగా భావిస్తా. మన చుట్టుపక్కల ఉన్నవారితో దయాగుణంతో వ్యవహరించడమే ఈ ప్రపంచంలో అత్యుత్తమైన పనిగా విశ్వసిస్తా.

- సుచాత షుంగ్‌సిరి



షుంగ్‌సిరికి మిస్ వరల్డ్ కిరీటం అలంకరిస్తున్న గత ఏడాది ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా

సుచాత షుంగ్‌సిరిని వరించిన కిరీటం

- దయాగుణమే అత్యుత్తమం అన్న జవాబుతో విజయం
- 16 ఏళ్లకే రొమ్ము క్యాన్సర్ బారిన.. చికిత్సతో విముక్తి
- అప్పటినుంచి ఆ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు
- థాయ్‌లాండ్‌కు తొలిసారిగా ప్రపంచ సుందరి కిరీటం
- రన్నరప్‌లుగా ఇథియోపియా, పోలాండ్, మార్టెనిక్ సుందరీమణులు.. టాప్-20లో నందినీ గుప్తా

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి వేదికపై థాయ్ అందం విరబూసింది. అందానికి ఆత్మవిశ్వాసం తోడుగా ఎదిగిన థాయిలాండ్ సుందరి 'ఓపల్ సుచాత షుంగ్‌సిరి'ని మిస్ వరల్డ్ కిరీటం వరించింది. 16 ఏళ్లకే రొమ్ము క్యాన్సర్ బారినపడి కోలుకున్న ఆమె చేపట్టిన 'ఓపల్ ఫర్ హర్' ప్రాజెక్టు.. 'బ్యూటీ విత్ పర్పస్'కు నిదర్శనంగా నిలిచి ఆమెను ప్రపంచ సుందరిని చేసింది.థాయిలాండ్‌కు మిస్ వరల్డ్ కిరీటం దక్కడం ఇదే మొదటిసారి. సుచాత తలపై గత మిస్‌వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా కిరీటాన్ని అలంకరించారు. విస్ వరల్డ్ తొలి రన్నరప్‌గా ఇథియోపియా సుందరి హస్సెట్ దెరెజ్, రెండో రన్నరప్‌గా పోలాండ్ భామ మజా క్లాజ్డా, మూడో రన్నరప్‌గా మార్టెనిక్ సుందరి ఆర్లీ జోకిమ్ నిలిచారు. మిస్ వరల్డ్ పోటీల చివరి అంకమైన గ్రాండ్ ఫినాలేలో ప్రముఖ నటుడు సోనూసూద్ అడిగిన ప్రశ్నకు సుచాత ఇచ్చిన

మిగతా 13వ పేజీలో...

మోడల్ కాకుంటే రాజకీయాల్లోకి..

- రొమ్ము క్యాన్సర్ రావడంతో భయపడ్డా
- ఆ భయమే ధైర్యాన్నిచ్చి ముందుకు నడిపింది
- 'ఆంధ్రజ్యోతి'తో మిస్ వరల్డ్-2025 సుచాత

14

ఫైనల్స్.. అదుర్స్

- ఘనంగా ప్రపంచ సుందరి ముగింపు వేడుకలు
- సీఎం రేవంత్, మంత్రులు, చిరంజీవి హాజరు

13

రైజింగ్ తెలంగాణ సత్తా చాటాం

- మిస్ వరల్డ్ విజేత, రన్నరప్, పోటీదార్లకు సీఎం రేవంత్ అభినందన



కేసీఆర్‌కు నోటీసులంటే.. తెలంగాణకు ఇచ్చినట్లే



- ఆయనపై ఈగ వాలినా ఊరుకోం
- కాళేశ్వరం కమిషన్ నోటీసులకు వ్యతిరేకంగా 4న ఇందిరాపార్క్ వద్ద ధర్నా
- కేసీఆర్‌కు బీఆర్ఎస్, జాగృతి రెండు కళ్లు
- తెలంగాణ జాగృతిలో ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ విభాగాలు ఏర్పాటు చేస్తాం
- బీసీ బిల్లుపై కేంద్రం తాత్సారం.. బీజేపీకి సెగ తగిలేలా ఉద్యమిస్తాం: కవిత
- జాగృతి నూతన కార్యాలయం ప్రారంభం

7

బీజేపీతో పొత్తు ఉంటుందని ఏమార్చారు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లోకి వచ్చినప్పుడల్లా కేసీఆర్ ఇదే చెప్పి ఆపారు
- రేవంత్ వ్యాఖ్యలు దేశ ద్రోహమే: బండి

కొందరు బీజేపీ సీనియర్లతో కేసీఆర్‌కు సంబంధాలు

- ఆ కారణంగానే పార్టీ అధ్యక్ష పదవి నుంచి బండిని తప్పించారు
- గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పినట్టే బీజేపీ అభ్యర్థుల ఎంపిక: మహేశ్‌గౌడ్


తమ కుమారుడు అఖిల్ వివాహానికి సీఎం రేవంత్‌ను ఆహ్వానిస్తున్న సినీ నటుడు నాగార్జున, అమల

అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలు

- ఒక్కొక్కటి 50 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు
- ప్రణాళిక రూపకల్పనకు ప్రత్యేక కమిటీ
- ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్నీ పరిశీలించాలి: సీఎం రేవంత్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గోవులను స్థలాల్లో బంధించినట్లుగా కాకుండా... మేత మేసేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా గోశాలలు ఉండాలని సూచించారు. గోశాలల ఏర్పాటుకు

మిగతా 12వ పేజీలో...





ఆపరేషన్ సిందూర్ అతిపెద్ద ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్: ప్రధాని మోదీ



భోపాల్, మే 31: పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ స్పందనతో 'సిందూరం' ఇప్పుడు శౌర్యానికి చిహ్నంగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఉగ్రవాదుల పరోక్ష యుద్ధాలు ఇకపై చెల్లవని, వారి బుల్లెట్లకు ఫిరంగి గుండ్లతో సమాధానం ఇస్తామని పాకిస్థాన్‌ను హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌ను దేశ చరిత్రలోనే అతిపెద్ద, అత్యంత విజయవంతమైన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌గా ఆయన అభివర్ణించారు. రాణి అహిల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా శనివారం భోపాల్‌లో నిర్వహించిన 'లోకమాత దేవీ అహిల్యాబాయి మహిళా స్వశక్తికరణ్ మహా సమ్మేళన్'లో ఆయన పాల్గొని ప్రసంగించారు. 'సిందూరం నారీ శక్తికి చిహ్నం. పహల్గాంలో ఉగ్రవాదులు మన నారీశక్తిని సవాలు చేశారు. అదే వారి ఉగ్రవాదులతో పాటు వారిని పోషిస్తున్న వారికి మృత్యు ఘంటికలు మోగించింది' అని ప్రధాని పేర్కొన్నారు.

10న దేశవ్యాప్త బంద్‌కు నక్సల్స్ పిలుపు

హైదరాబాద్/ఏటూరునాగారం/చర్ల/అమరావతి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ సహా.. 27 మంది నక్సల్స్ మృతికి నిరసనగా ఈనెల 10న దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తున్నట్లు సీపీఐ(మావోయిస్టు) పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో మీడియాకు శనివారం ఓ సుదీర్ఘ లేఖ విడుదలైంది. "మే 21 భారత విప్లవోద్యమ చరిత్రలో చీకటి రోజు. ఈ నెల 10న దేశవ్యాప్త బంద్ నిర్వహిస్తాం. 11 నుంచి ఆగస్టు 3 వరకు దేశవ్యాప్తంగా నంబాల సహా.. 27 మంది అమరుల స్మారక సభలు ఏర్పాటు చేయాలి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

3,395కు పెరిగిన కొవిడ్ కేసులు.. నలుగురి మృతి

న్యూఢిల్లీ, మే 31: దేశంలో యాక్టివ్ కొవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతూ 3వేల మార్కును దాటేసింది. కేరళ రాష్ట్రంలో కొవిడ్ వ్యాప్తి ఎక్కువగా ఉంది. తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, ఢిల్లీ ఉన్నట్టు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం విడుదల చేసిన గణాంకాల ద్వారా వెల్లడైంది. గత 24 గంటల్లో ఢిల్లీ, కేరళ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లో ఒక్కొక్కరి చొప్పున మరణించారు. గత 24 గంటల్లోనే 685 కొత్త కేసులు నమోదయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇక కేసుల విషయానికి వస్తే.. కేరళలో అత్యధికంగా 1,336 యాక్టివ్ కేసులున్నాయి.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.24 తగ్గింపు

న్యూఢిల్లీ, మే 31: వాణిజ్య అవసరాలకు కోసం ఉపయోగించే గ్యాస్ సిలిండర్ ధరను రూ.24 మేర తగ్గిస్తూ శనివారం ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. 19 కిలోల బరువు ఉండే ఈ సిలిండర్ ప్రస్తుతం రూ.1,730.50 పలకనుంది. రవాణా ఖర్చులు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ప్రాంతాల వారీగా ఈ ధరల్లో కాస్త తేడాలు ఉంటాయి. ఈ నిర్ణయం ఆదివారం నుంచి అమల్లోకి రానుంది. ఏప్రిల్ ఒకటో తేదీన కూడా ఈ సిలిండర్ ధరను రూ.41 మేర తగ్గించడం గమనార్హం.

భారతీయ అమెరికన్ విద్యార్థినిపై ఎంఐటీ నిషేధం

న్యూయార్క్, మే 31: భారతీయ మూలాలున్న విద్యార్థిని మేఘా వేమూరిపై మాసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొనకుండా నిషేధం విధించింది. ఈనెల 29న జరిగిన ఓ కార్యక్రమంలో మేఘా పాలస్తీనాకు మద్దతుగా ప్రసంగించడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఎంఐటీ క్లాస్ ప్రెసిడెంట్‌గా ఉన్న మేఘా.. గ్రాడ్యుయేషన్ వేడుకలో మార్షల్‌గా కూడా వ్యవహరించాల్సి ఉంది. అయితే వేడుక రోజు క్యాంపస్ నుంచి మేఘాతో పాటు ఆమె కుటుంబాన్ని కూడా బహిష్కరిస్తున్నట్లు యూనివర్సిటీ చాన్స్‌లర్ మెలిస్సా నోబెల్స్ ప్రకటించారు. 29న జరిగిన కార్యక్రమంలో ముస్లిం సంప్రదాయ వస్త్రధారణతో వచ్చి కార్యక్రమంలో ప్రసంగించిన మేఘా.. గాజాపై దాడుల విషయంలో ఇజ్రాయెల్‌ను తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తోందని యూనివర్సిటీని కూడా తప్పుబట్టారు. కాగా, మేఘా జార్జియాలోని ఆల్ఫరెట్టాలో జన్మించారు.2021లో ఎంఐటీలో చేరారు.

హార్వర్డ్‌కు వెళ్లే వారికి 'మరింత పరీక్ష'

వాషింగ్టన్, మే 31: హార్వర్డ్ యూనివర్సిటీపై ట్రంప్ సర్కార్ డేగ కన్నేసింది. 'ఏదైనా అవసరం నిమిత్తం' హార్వర్డ్‌కు వెళ్లాలి అనుకుని వీసాకు దరఖాస్తు చేసే వాళ్లు ఇకపై మరింత కఠిన పరీక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తులను మరింత క్షుణ్ణంగా స్క్రీనింగ్ చేయాలంటూ యూఎస్ ఎంబసీలకు, కాన్సులేట్లకు స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆదేశాలిచ్చింది. ఇది వెంటనే అమలు చేయాలని స్పష్టం చేసింది. స్టూడెంట్లు, గెస్ట్ లెక్చరర్లు, కాంట్రాక్టర్లు, టూరిస్టులు ఎవరికైనా సరే మినహాయింపులేదని ప్రభుత్వం తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. వీసా దరఖాస్తుదారులకు యూదులను వేధించిన, వారికి వ్యతిరేకంగా హింసా కార్యక్రమాల్లో పాల్గొన్న చరిత్ర ఏమైనా ఉందా అనేది తేల్చేందుకు మరింత విస్తృతంగా స్క్రీనింగ్ ప్రక్రియ చేపట్టాలని స్టేట్ డిపార్ట్‌మెంట్ నిర్ణయించింది. ఈ పరీక్షల్లో సోషల్ మీడియా ఖాతాలపై కూడా లోతుగా దృష్టిపెట్టనున్నారు.

మన యుద్ధ విమానాలు కూలటం నిజమే

ఆరు ఫైటర్లను కూల్చామన్న పాక్ ప్రకటన మాత్రం తప్పు

- ఎన్ని ఫైటర్లు కూలాయన్నది కాదు, ఎందుకు కూలాయన్నదే ముఖ్యం
- వ్యూహాత్మక తప్పిదం జరిగింది
- దాన్ని గుర్తించి వెంటనే సరిదిద్దాం
- సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ వెల్లడి



షాంగ్రీ లా డైలాగ్ సెక్యూరిటీ ఫోరం' సదస్సులో అనిల్ చౌహాన్

సింగపూర్, మే 31: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ యుద్ధ విమానాలను కోల్పోయిందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అంగీకరించారు. ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయినదీ వెల్లడించలేదు. నాలుగు రాఫెల్‌లు సహా ఆరు ఫైటర్లను కూల్చామని పాకిస్థాన్ చెబుతున్నది మాత్రం తప్పు అని స్పష్టం చేశారు. ఎన్ని ఫైటర్లు కూలాయన్నది ముఖ్యం కాదని, ఎందుకు కూలిపోయాయన్నది కీలకమని పేర్కొన్నారు. తప్పు ఎక్కడ జరిగిందో వెంటనే గుర్తించి సరిదిద్దుకున్నామని.. తర్వాత రెండు రోజుల్లోనే అన్ని రకాల విమానాలు, ఆయుధాలతో కచ్చితమైన దాడులు చేసి పాక్‌ను దెబ్బకొట్టామని తెలిపారు. పాక్‌తో నెలకొన్న ఉద్రిక్తతల్లో భారత్ యుద్ధ విమానాలను కోల్పోయిందన్న అంశాన్ని అధికారికంగా అంగీకరించడం ఇదే తొలిసారి. శనివారం సింగపూర్‌లో జరిగిన 'షాంగ్రీ లా డైలాగ్ సెక్యూరిటీ ఫోరం' సదస్సుకు హాజరైన సీడీఎస్ అనిల్ చౌహాన్.. అక్కడ బ్లూమ్‌బర్గ్ టీవీకి, రాయిటర్స్‌కు విడిగా ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆరు భారత యుద్ధ విమానాలను కూల్చామని పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ చేసిన ప్రకటనను ప్రస్తావించగా.. "ఎన్ని విమానాలు కూలాయన్నది ముఖ్యం కాదు.. ఎందుకు కూలిపోయాయి, తప్పు ఎక్కడ జరిగిందన్నది ముఖ్యం. యుద్ధం జరిగినప్పుడు నష్టాలు ఉండక మానవు. మే 7న ఆపరేషన్ సిందూర్ మొదలైన సమయంలో భారత్‌కు కొంత నష్టం జరిగింది. ఆ నష్టాలకు కారణమేంటి, ఆ తర్వాత చేయాల్సినది ఏమిటి అనే దానిపై దృష్టిపెట్టాం. మేం చేసిన వ్యూహాత్మక తప్పిదం ఏమిటో వెంటనే గుర్తించి విశ్లేషించాం. దానిని వెంటనే సరిదిద్దుకున్నాం. రెండు రోజుల్లోనే అన్ని రకాల యుద్ధ విమానాలను ఆయుధాలతో రంగంలోకి తెచ్చాం" అని అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. అయితే ఇరు దేశాల మధ్య అణు యుద్ధం జరిగేటువంటి పరిస్థితి ఏదీ తలెత్తలేదని అనిల్ చౌహాన్ చెప్పారు. భారత్-పాక్ మధ్య అణు యుద్ధాన్ని ఆపానని, కాల్పుల విరమణకు ఒప్పించానని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చారు.

చైనా రక్షణ వ్యవస్థలు పనిచేయలేదు!

పాక్‌లోని కీలక ఎయిర్‌బేస్‌లు, సైనిక స్థావరాల వద్ద గగనతల రక్షణ వ్యవస్థలు ఉన్నా.. వాటిని తప్పుదారి పట్టించి మరీ భారత్ దాడులు చేయగలిగిందని సీడీఎస్ అనిల్ చౌహాన్ చెప్పారు. పాకిస్థాన్ భూభాగంలో 300 కిలోమీటర్ల లోపలివరకు కూడా కేవలం ఒక మీటర్ తేడాతో కూడిన కచ్చితత్వంతో లక్ష్యాలను ధ్వంసం చేశామని వెల్లడించారు. పాక్‌కు చైనా అందించిన గగనతల రక్షణ వ్యవస్థలు పనిచేయలేదని పేర్కొన్నారు.

యుద్ధం ముదిరి.. కాల్పుల విరమణ జరిగి..

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్.. మే 7న అర్ధరాత్రి పాకిస్థాన్‌లోని 9 ఉగ్ర స్థావరాలపై దాడి చేసిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా పాక్ పెద్ద సంఖ్యలో ఆయుధ డ్రోన్లు, స్వల్ప శ్రేణి క్షిపణులతో భారత్‌పై దాడికి ప్రయత్నించింది. వాటిని చాలా వరకు ఎదుర్కొన్న భారత్ మే 9వ తేదీన అర్ధరాత్రి 11 పాక్ ఎయిర్‌బేస్‌లు, రాడార్, కమాండ్ కంట్రోల్ కేంద్రాలను ధ్వంసం చేసింది. దీనితో ఉద్రిక్తత మరింత పెరిగింది. ఇది పూర్తిస్థాయి యుద్ధంగా మారుతుందేమోనన్న సమయంలో.. ఒక్కసారిగా ఇరుపక్షాలు కాల్పుల విరమణ పాటించాలని నిర్ణయించాయి. మరోవైపు కాల్పుల విరమణ పాటించకపోతే భారీగా వాణిజ్య సుంకాలు విధిస్తామని తాను బెదిరించడంతోనే.. భారత్, పాక్ దిగొచ్చాయని ట్రంప్ పేర్కొన్నారు.



ఫలించిన భారత్ దౌత్యం

- పాకిస్థాన్ ఉగ్రవాదుల మృతిపై సంతాపాన్ని ఉపసంహరించుకున్న కొలంబియా
- పహల్గాం దాడి, సిందూర్‌పై వాస్తవాలు తెలియజేసిన శశిథరూర్ బృందం

న్యూఢిల్లీ, మే 31: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై భారత్ దాడుల తర్వాత అక్కడ మరణించిన వారికి సంతాపం వ్యక్తం చేస్తూ ఇచ్చిన ప్రకటనను కొలంబియా ఉపసంహరించుకుంది. వాస్తవాలు తెలుసుకొన్న ఆ దేశం ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న వైఖరికి బలమైన మద్దతు ఇస్తూ త్వరలో ప్రకటన విడుదల చేయనుంది. ఈ మేరకు ఉగ్రవాదంపై పాక్ వైఖరిని, ఆ దేశ కుతంత్రాలను వివరించేందుకు కొలంబియాకు వెళ్లిన ఎంపీ శశిథరూర్ నేతృత్వంలోని భారత బృందం దౌత్యం ఫలించింది. పర్యటనలో భాగంగా ఆ దేశ విదేశాంగ శాఖ ఉపమంత్రి రోసా విల్లావిసెన్సియోతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొలంబియా వైఖరిపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. అసంతృప్తి తెలియజేశారు. పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తెలిపారు. విల్లావిసెన్సియో మాట్లాడుతూ 'భారత బృందం తెలియజేసిన అన్ని వివరాల పట్ల విశ్వాసంగా ఉన్నాం. ఉద్రిక్తతలు, వాస్తవ పరిస్థితి గురించి వివరణాత్మక సమాచారం తెలిసింది. కశ్మీర్‌లో ఏం జరిగిందో తెలుసుకున్నాం' అని పేర్కొన్నారు. శశిథరూర్ మీడియాతో మాట్లాడుతూ మనల్ని అసంతృప్తికి గురిచేసిన ప్రకటనను కొలంబియా ఉపసంహరించుకుందని తెలిపారు. భారత్ వైఖరిని సమర్థిస్తూ ఒక ప్రకటన విడుదల చేయనుందని పేర్కొన్నారు. పహల్గాం దాడి వెనుక పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదం ఉందనే దానికి భారత్ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. తాము స్వీయ రక్షణ హక్కును మాత్రమే ఉపయోగించుకున్నామని స్పష్టం చేశారు. కొలంబియా అనేక ఉగ్రదాడులను ఎదుర్కొన్న విధంగానే.. భారత్ కూడా 4 దశాబ్దాలుగా చాలా ఉగ్రదాడులను భరించిందని తెలిపారు.

భారత్-పాక్ యుద్ధాన్ని ఆపినందుకు గర్విస్తున్నా

- బుల్లెట్లతో కాదు బిజినెస్‌తో ఆపా..
- అయినా ఎవరూ చెప్పుకోవడం లేదు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, మే 31: భారత్-పాక్‌ల మధ్య తలెత్తిన ఘర్షణ అణ్వాయుధ యుద్ధంగా మారకుండా 'డీల్' కుదిర్చినందుకు గర్వపడుతున్నానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. బుల్లెట్లను కాకుండా వాణిజ్యాన్ని ఉపయోగించడం ద్వారా యుద్ధాన్ని ఆపినట్టు చెప్పారు. శుక్రవారం రెండు సందర్భాల్లో ఆయన ఈ విషయాన్ని ప్రముఖంగా చెప్పడం గమనార్హం. జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ "భారత్-పాక్‌ల మధ్య కుదిర్చిన డీల్‌కు గర్వపడుతున్నా. దీనిపై ఎవరూ మాట్లాడుకోవడం లేదు గానీ, పాకిస్థాన్- భారత్‌ల మధ్య చాలా అసహ్యకరమైన యుద్ధం నడుస్తోంది. ప్రస్తుతం అంతా బాగుందిగానీ, రెండూ అణ్వాయుధ దేశాలు. పరిస్థితి దారుణంగా ఉండేది" అని వ్యాఖ్యానించారు. భారత్‌తో త్వరలో వాణిజ్య ఒప్పందం కుదురుతుందని ట్రంప్ వెల్లడించారు. "ఇండియాతో త్వరలో డీల్ కుదుర్చుకుంటాం. వచ్చే వారం పాక్ ప్రతినిధులు వాషింగ్టన్ రానున్నారు. రెండు దేశాలు యుద్ధాన్ని కొనసాగించి ఉంటే డీల్ కుదర్చాలన్న ఆసక్తి నాకు ఏమాత్రం ఉండేది కాదు" అని చెప్పారు. అంతకుముందు శ్వేత సౌధంలోని ఓవల్ ఆఫీసులో కూడా ట్రంప్ ఇదే విషయం చెప్పారు.

20 రోజుల్లో 9సార్లు చెప్పారు..

- మోదీ మౌనమెందుకో?: కాంగ్రెస్

భారత్-పాక్‌ల మధ్య యుద్ధం ఆపానంటూ ట్రంప్ పదేపదే చెబుతున్నా ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉంటున్నారని కాంగ్రెస్ ప్రశ్నించింది. 'మిత్రుడు డొనాల్డ్ భాయ్' చెబుతున్న మాటలపై మోదీ ఎందుకు పెదవి విప్పడం లేదని అడిగింది. "20 రోజుల్లో ఇది తొమ్మిదోసారి. మూడు దేశాల్లోని మూడు నగరాల్లో డొనాల్డ్ భాయ్ చెప్పిందే చెబుతున్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన నాలుగు రోజుల యుద్ధాన్ని అమెరికా ఎలా ఆపిందో వివరించుకుంటూ వెళ్తున్నారు. భారత్-పాక్‌లను సమానంగా పరిగణిస్తున్నట్టు పునరుద్ఘాటిస్తున్నారు. దీనిపై మోదీ మాట్లాడడం లేదు" అని జైరాం రమేశ్ అన్నారు.

రాజ్యాంగంతోనే భారత్ సమైక్యం, సుదృఢం



ప్రయాగ్‌రాజ్, మే 31: ఎటువంటి సంక్షోభం తలెత్తినా భారతదేశం సమైక్యంగా, సుదృఢంగా ఉండేలా రాజ్యాంగం తగిన జాగ్రత్తలను పొందుపరిచిందని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. శనివారం అలహాబాద్ హైకోర్టు న్యాయవాదుల చాంబర్లతోపాటు బహుళ అంతస్తుల పార్కింగ్ సదుపాయాన్ని జస్టిస్ గవాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తర్వాత భారత్ అభివృద్ధిపథంలో కొనసాగిందంటే అది రాజ్యాంగం వల్లనేనన్నారు. మన పొరుగుదేశాల పరిస్థితి ఎలా ఉందో కనిపిస్తూనే ఉందన్నారు. రాజ్యాంగం అమలైన ఏడున్నర దశాబ్దాల కాలంలో దేశంలో సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని తీసుకురావటానికి శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు ఎంతగానో తోడ్పడ్డాయని తెలిపారు. ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య వైరుధ్యం తలెత్తితే ప్రాథమిక హక్కులకే ప్రాధాన్యం ఇవ్వాలని 1973 ముందు వరకూ సుప్రీంకోర్టు భావించేదని జస్టిస్ గవాయ్ తెలిపారు. 1973లో 13 మంది సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం.. రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉంటుందని పేర్కొంటూనే.. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రాజ్యాంగానికి ఆత్మవంటివని ఆ తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. రాజ్యాంగం అనే బంగారు రథానికి ఇవి రెండు చక్రాల వంటివని, ఏ చక్రాన్ని ఆపినా రథం ఆగిపోతుందని జస్టిస్ గవాయ్ హెచ్చరించారు.

ముడి వంటనూనెలపై సుంకం తగ్గింపు

- రిఫైండ్ ఆయిల్‌పై యథాతథం: కేంద్రం

న్యూఢిల్లీ, మే 31: విదేశాల నుంచి దిగుమతి చేసుకునే మూడు రకాల ముడి వంటనూనెలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని సగానికి సగం తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ముడి పామాయిల్, ముడి సోయాబీన్ నూనె, ముడి సన్‌ఫ్లవర్ నూనెలపై 20 శాతం మేర ఉన్న 'బేసిక్ కస్టమ్ డ్యూటీ'ని 10 శాతానికి తగ్గిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇతరత్రా పన్నులను కలుపుకొంటే దిగుమతి చేసుకునే ముడి నూనెపై ప్రస్తుతం ఉన్న 27.5శాతం సుంకం 16.5 శాతానికి తగ్గనుంది. వంట నూనెల రిటెయిల్ ధరలను తగ్గించడం, దేశీయ తయారీదార్లకు రక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకొంది. దిగుమతి చేసుకునే రిఫైండ్ ఆయిల్‌పై విధించే సుంకాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. రిఫైండ్ ఆయిల్‌పై 27.5శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ ఉండగా, ఇతరత్రా కలుపుకొంటే దిగుమతిదార్లు మొత్తంగా 35.75 శాతం చెల్లించాల్సి ఉంటుంది. దీంట్లో ఎలాంటి మార్పులు లేవు. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుంది. దేశ అవసరాల్లో 50 శాతం వంట నూనెలను విదేశాల నుంచే దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. 2023-24 మార్కెట్ సంవత్సరం (నవంబరు-అక్టోబరు నెలల మధ్యకాలం)లో రూ.1.32 లక్షల కోట్లు విలువచేసే 159.6 లక్షల టన్నుల వంట నూనెలను దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. మలేసియా, ఇండోనేసియా నుంచి పామాయిల్; అర్జెంటీనా, బ్రెజిల్ నుంచి సోయాబీన్ ఆయిల్ దిగుమతి అవుతోంది. ముడి వంటనూనెలు, రిఫైండ్ వంట నూనెలపై విధించే సుంకాల మధ్య తేడాను 8.25% నుంచి 19.25%నికి పెంచడం సాహసోపేత నిర్ణయమని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సంజీవ్ ఆస్థానా అభిప్రాయపడ్డారు.

డిజైన్ ఆధారంగా నిర్మాణం జరగలేదు!

- తగినంత బంకమట్టిని వాడనందువల్లే కట్టంతా సీపేజీ
- రేలంపాడు రిజర్వాయర్‌పై సీడబ్ల్యూపీఆర్ఎస్ నివేదిక

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలోని రేలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను డిజైన్లు/డ్రాయింగ్‌ల ప్రకారం నిర్మించలేదని కేంద్ర జల, విద్యుత్ పరిశోధన కేంద్రం(సీడబ్ల్యూపీఆర్ఎస్) నిగ్గుతేల్చింది. మట్టికట్ట నిర్మాణంలో మట్టే అత్యంత కీలకమైనప్పటికీ.. రిజర్వాయర్ నిర్మాణంలో ఒకే రకమైన మట్టిని వినియోగించారని, కట్టకు గుండెకాయలాంటి హార్టింగ్‌జోన్ మధ్యభాగంలో సీపేజీని(లీకేజీని) అడ్డుకునే బంకమట్టిని తక్కువ మోతాదులో వాడారని తెలిపింది. అందువల్లే కట్ట నుంచి సీపేజీ జరుగుతోందని పేర్కొంది. ఏప్రిల్ 10వ తేదీన రేలంపాడుతోపాటు ముచ్చునోనిపల్లి రిజర్వాయర్లను పరిశీలించిన సీడబ్ల్యూపీఆర్ఎస్.. సీపేజీ తగ్గించటానికి పలు సిఫారసులు చేసింది. జియోమెంబ్రైన్ చేయాలన్నా, కర్టెన్ గ్రౌటింగ్ చేయాలన్నా తగిన పరీక్షలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. హార్టింగ్‌జోన్ పైనుంచి ఉన్న శాండ్ ఇంక్లైన్ ఫిల్టర్ కూడా సరిగా లేదని, శాండ్ ఫిల్టర్ నుంచి నీళ్లు పోవడం లేదని తెలిపింది. ఆ నీరంతా కట్ట మధ్య భాగం నుంచి సీపేజీ రూపంలో వెళ్తుందని గుర్తించింది. కట్టకు వెనకభాగంలో రక్షణగా రెండు బర్మ్‌లు మాత్రమే ఉన్నాయని, మూడో బర్మ్ లేకపోవడంతో కట్టను నిలబెట్టే వ్యవస్థ సరిగ్గా లేకుండా పోయిందని తేల్చింది. కట్టలో ఎప్పటికప్పుడు జరిగే మార్పుల వివరాలను పరిశీలించే ఇన్‌స్ట్రుమెంట్ వ్యవస్థ కచ్చితంగా ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. సీడబ్ల్యూపీఆర్ఎస్ ఇతర సిఫారసులు ఇలా ఉన్నాయి.

- కట్టలో భూసాంకేతిక సీపేజీ అధ్యయనాలు జరగాలి. న్యూమరికల్ మోడలింగ్ విధానంలో వీటిని నిర్వహించాలి.
- కట్ట లోపలి భాగంలో ఏమైనా ఖాళీ ప్రదేశాలు ఉన్నాయా అన్నది పరిశీలించటానికి 2డీ ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ ఇమేజింగ్ పరీక్షలు జరపాలి.
- కట్ట నుంచి నీరు ఏయే మార్గాల్లో బయటికి వస్తుందో గుర్తించడానికి ట్రేసర్ స్టడీస్ చేయాలి.
- డ్యామ్ బ్రేక్ ఎనాలిసిస్ పరీక్షలు జరపాలి. బ్యారేజీ దిగువ ప్రాంతంలో వరద మ్యాపింగ్ కోసం అత్యవసర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడానికి ఈ పరీక్షలు అవసరం. సిఫారసు చేసిన ఈ పరీక్షలన్నింటినీ ముచ్చునోనిపల్లి రిజర్వాయర్‌లో చేయాల్సిఉంటుంది.

ఫారం-6
(ప్రాథమిక ప్రకటన)
(తెలంగాణ సవరణ చట్టం 2016 లోని చాప్టర్ III ఎ లోని 10 ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ

గెజిట్ నెం.28/2025 తేది: 24.05.2025
జిల్లా కలెక్టర్ యదాద్రి భువనగిరి తేది: 24.05.2025
ఫైల్ నెం. G/2413/2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (LA) యదాద్రి భువనగిరి తేది: .05.2025
ఫైల్ నెం. A/17/2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తుక్కాపూర్ గ్రామములో విస్తీర్ణం ఎ.10.26 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.
ప్రభుత్వము ఉత్తర్వుల నెం.108 I&CAD (LA.R&R/A2) Department, Dt:31.10.2017 ద్వారా బునాదిగాని కాలువ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాధి కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం-2013లోని చాప్టర్-II (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్-III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.
ఇట్టి ప్రాజెక్టు పునరావాసం మరియు పునరుపాధి కల్పనకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యాదాద్రి భువనగిరి గారిని కార్యనిర్వాహకునిగా (అడ్మినిస్ట్రేటర్) గా నియమించనైనది.
కావున, పైన తెలిపిన బునాదిగాని కాలువ నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలం తుక్కాపూర్ గ్రామములో విస్తీర్ణం ఎ.10.26 గుంటల భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

జిల్లా : యదాద్రి భువనగిరి మండలం : భువనగిరి గ్రామం : తుక్కాపూర్

సర్వే సెం/భూమి స్వభావం వీస్తీర్ణం (ఎ.గుం)	పట్టాదారు పేరు మరియు తండ్రి /భర్త పేరు	అనుభవదారు పేరు మరియు తండ్రి/ భర్తపేరు	విస్తీర్ణం (ఎ. గుంటలు)	చెట్లు/ కట్టడము లు
220 పట్టా ఖుష్కీ/ 0.23½	రాసాల దత్తు యాదవ్ తండ్రి కొండయ్య	రాసాల దత్తు యాదవ్ తండ్రి కొండయ్య	0.05¼	
	ముంత లింగస్వామి తండ్రి ముత్యాలు	ముంత లింగస్వామి తండ్రి ముత్యాలు	0.08	
	కంజాల పాండు తండ్రి యాదయ్య	కంజాల పాండు& జంగయ్య తండ్రి యాదయ్య	0.10¼	
219 పట్టా/ఖుష్కీ 0.10½	మాకోలు లింగరాజు తండ్రి కొమురయ్య	మాకోలు లింగరాజు తండ్రి కొమురయ్య	0.10½	
221 పట్టా /ఖుష్కీ 0.08½	కంజాల జంగయ్య తండ్రి యాదయ్య	కంజాల జంగయ్య తండ్రి యాదయ్య	0.02	
	కంజాల పాండు తండ్రి యాదయ్య	కంజాల పాండు తండ్రి యాదయ్య	0.04¾	
	ముంత లింగస్వామి & నర్సింహా తండ్రి ముత్యాలు	ముంత లింగస్వామి & నర్సింహా తండ్రి ముత్యాలు	0.00¾	
	కె.యాదయ్య తండ్రి రామయ్య	కె.యాదయ్య తండ్రి రామయ్య	0.01	
223 పట్టా/ ఖుష్కీ 0.13¼	రాసాల మల్లయ్య తండ్రి కొండయ్య	రాసాల మల్లయ్య తండ్రి కొండయ్య	0.13¼	
224 తరి/పట్టా 0.02½	రాసాల వీరయ్య తండ్రి కొండయ్య	రాసాల రామయ్య తండ్రి కొండయ్య	0.00½	
	రాసాల వీరయ్య తండ్రి కొండయ్య	రాసాల వీరయ్య తండ్రి కొండయ్య	0.00½	
	రాసాల వీరయ్య తండ్రి కొండయ్య	రాసాల చంద్రయ్య తండ్రి కొండయ్య	0.00½	
	రాసాల వీరయ్య తండ్రి కొండయ్య	రాసాల దత్తు తండ్రి కొండయ్య	0.00½	
	రాసాల మల్లయ్య తండ్రి కొండయ్య	రాసాల మల్లయ్య తండ్రి కొండయ్య	0.00½	
230 తరి/పట్టా 0.00½	రాసాల సత్తయ్య తండ్రి మల్లయ్య	రాసాల సత్తయ్య తండ్రి మల్లయ్య	0.00½	
231 ఖుష్కీ/పట్టా 0.01¼	రాసాల వీరయ్య తండ్రి కొండయ్య	రాసాల వీరయ్య తండ్రి కొండయ్య	0.01¼	
232 తరి/పట్టా 0.07¼	జంగం స్వామి తండ్రి లక్ష్మయ్య	జంగం స్వామి తండ్రి లక్ష్మయ్య	0.00½	
	జంగం సుధాకర్ తండ్రి భిక్షపతి	జంగం సుధాకర్ తండ్రి భిక్షపతి	0.01	
	రాసాల సత్తయ్య తండ్రి రాజయ్య	రాసాల మల్లయ్య తండ్రి కొండయ్య	0.05¾	
229 తరి/పట్టా 0.02	ముంత లింగస్వామి & నర్సింహా తండ్రి ముత్యాలు	ముంత లింగస్వామి & నర్సింహా తండ్రి ముత్యాలు	0.02	
227 ఖుష్కీ/పట్టా 0.04	రాసాల కవిత భర్త పుల్లయ్య	రాసాల కవిత భర్త పుల్లయ్య	0.02	
	రాసాల మల్లయ్య తండ్రి కొండయ్య	రాసాల మల్లయ్య తండ్రి కొండయ్య	0.02	
233 ఖుష్కీ/పట్టా 0.30½	జంగం నందయ్య తండ్రి నర్సయ్య	జంగం నందయ్య తండ్రి నర్సయ్య	0.06.25	
	జంగం యాదయ్య తండ్రి నర్సయ్య	జంగం యాదయ్య తండ్రి నర్సయ్య	0.01	
	జంగం నర్సయ్య తండ్రి యెల్లయ్య	జంగం నర్సయ్య తండ్రి యెల్లయ్య	0.01¼	
	జంగం సత్తయ్య తండ్రి నర్సయ్య	జంగం సత్తయ్య తండ్రి నర్సయ్య	0.01¼	
	జంగం ముత్యాలు తండ్రి పోచయ్య	జంగం ముత్యాలు తండ్రి పోచయ్య	0.01¼	
	జంగం యాదగిరి తండ్రి పోచయ్య	జంగం యాదగిరి తండ్రి పోచయ్య	0.01	
	జంగం మల్లేష్ తండ్రి యెల్లయ్య	జంగం మల్లేష్ తండ్రి యెల్లయ్య	0.01	
	జంగం వెంకటేష్ తండ్రి నర్సయ్య	జంగం వెంకటేష్ తండ్రి నర్సయ్య	0.01	
	జంగం వెంకమ్మ భర్త నర్సయ్య	జంగం రవి తండ్రి నర్సయ్య	0.01	
	జంగం కిష్టయ్య తండ్రి రాజయ్య	జంగం కిష్టయ్య తండ్రి రాజయ్య	0.01	
	జంగం మల్లయ్య తండ్రి రాజయ్య	జంగం మల్లయ్య తండ్రి రాజయ్య	0.0¾	
	జంగం మల్లేష్ తండ్రి కిష్టయ్య	జంగం మల్లేష్ తండ్రి కిష్టయ్య	0.01	
	జంగం అశోక్ తండ్రి కిష్టయ్య	జంగం అశోక్ తండ్రి కిష్టయ్య	0.01	
	జంగం ఆయిలమ్మ భర్త రాజలింగం	జంగం ఆయిలమ్మ భర్త రాజలింగం	0.00¾	
	రొండ్ల బాలయ్య తండ్రి ముత్తయ్య	రొండ్ల బాలయ్య తండ్రి ముత్తయ్య	0.02½	
	రొండ్ల పాండు తండ్రి ఎట్టయ్య	రొండ్ల పాండు తండ్రి ఎట్టయ్య	0.02½	
	రొండ్ల సుదర్శన్ తండ్రి ఎట్టయ్య	రొండ్ల సుదర్శన్ తండ్రి ఎట్టయ్య	0.02½	
	జంగం జంగయ్య తండ్రి భిక్షపతి	జంగం జంగయ్య తండ్రి భిక్షపతి	0.01	
	జంగం సుధాకర్ తండ్రి భిక్షపతి	జంగం సుధాకర్ తండ్రి భిక్షపతి	0.01¼	
	జంగం స్వామి తండ్రి లక్ష్మయ్య	జంగం స్వామి తండ్రి లక్ష్మయ్య	00.01	
238 ఖుష్కీ/ పట్టా 0.13	పిట్టల వెంకటేశ్వర్లు తండ్రి ఆగయ్య	పిట్టల వెంకటేశ్వర్లు తండ్రి ఆగయ్య	0.02½	
	పిట్టల రాజు తండ్రి ఆగయ్య	పిట్టల రాజు తండ్రి ఆగయ్య	0.02¼	
	పిట్టల నర్సింహా తండ్రి వీరయ్య	పిట్టల బాలరాజు తండ్రి యాదయ్య	0.02½	
	కమతం వెంకట నారాయణ తండ్రి బాలయ్య	పిట్టల బాలరాజు తండ్రి యాదయ్య	0.02¾	
	పిట్టల రాజు తండ్రి ఆగయ్య	ముంత మైసయ్య	0.03	
149 ఖుష్కీ/ లావణి పట్టా 0.04¾	ముంత రామయ్య తండ్రి రాజయ్య	ముంత రామయ్య తండ్రి రాజయ్య	0.02¾	
	ముంత మల్లేశ్ తండ్రి రాజయ్య	ముంత మల్లేశ్ తండ్రి రాజయ్య	0.02	
160 ఖుష్కీ/పట్టా 0.21¾	రామిడి సాయివాణి భర్త రామకృష్ణా రెడ్డి	రామిడి సాయివాణి భర్త రామకృష్ణా రెడ్డి	0.09¾	
	ఎల్లకొండ బాలకృష్ణా రెడ్డి తండ్రి అంజిరెడ్డి	ఎల్లకొండ బాలకృష్ణా రెడ్డి తండ్రి అంజిరెడ్డి	0.01	
	తురాయి సంధ్యా రాణి భర్త నాగేశ్వర్ రావు	రాము గౌడ్	0.07	
	అల్లకొండ బాలకృష్ణారెడ్డి తండ్రి అంజిరెడ్డి	అల్లకొండ బాలకృష్ణా రెడ్డి తండ్రి అంజిరెడ్డి	0.03½	
161 ఖుష్కీ/పట్టా 0.02¼	ఎలిమినేటి శివా రెడ్డి తండ్రి యాది రెడ్డి	అల్లకొండ బాలకృష్ణా రెడ్డి తండ్రి అంజి రెడ్డి	0.01	
	ఎలిమినేటి శివా రెడ్డి తండ్రి యాది రెడ్డి	ఎలిమినేటి శివా రెడ్డి తండ్రి యాది రెడ్డి	0.01¼	
158 తరి/పట్టా 0.02	ఎలిమినేటి శివా రెడ్డి తండ్రి యాది రెడ్డి	ఎలిమినేటి శివా రెడ్డి తండ్రి యాది రెడ్డి	0.02	
129 ఖుష్కీ/పట్టా 0.14½	పడమటి బలవంత్ రెడ్డి తండ్రి నర్సిరెడ్డి	పడమటి బలవంత్ రెడ్డి తండ్రి నర్సిరెడ్డి	0.07	
	అల్లకొండ కిష్టా రెడ్డి తండ్రి నర్సిరెడ్డి	అల్లకొండ కిష్టా రెడ్డి తండ్రి నర్సిరెడ్డి	0.07½	
130 ఖుష్కీ /పట్టా 0.11	కాసాని వెంకటేష్ తండ్రి మల్లయ్య	కాసాని వెంకటేష్ తండ్రి మల్లయ్య	0.06¾	
	కాసాని మల్లేశ్ తండ్రి మల్లయ్య	కాసాని మల్లేశ్ తండ్రి మల్లయ్య	0.04½	
128 ఖుష్కీ/పట్టా 0.30¾	కె.చంద్రకళ భర్త రామారావు	కె. చంద్రకళ భర్త రామారావు	0.30¾	
132 ఖుష్కీ/పట్టా 1.16¾	కె.చంద్రకళ భర్త రామారావు	కె.చంద్రకళ భర్త రామారావు	0.13	
	అల్లకొండ వెంకట్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి	అల్లకొండ వెంకట్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి	0.03¾	
	దొమటి రాందాస్ తండ్రి ముత్తయ్య	దొమటి రాందాస్ తండ్రి ముత్తయ్య	0.02	
	అల్లకొండ భాస్కర్ రెడ్డి తండ్రి బాల్ రెడ్డి	అల్లకొండ భాస్కర్ రెడ్డి తండ్రి బాల్ రెడ్డి	0.03¾	
	అల్లకొండ వెంకట్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి	అల్లకొండ వెంకట్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి	0.11¾	
	అల్లకొండ మధుసూధన్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి	అల్లకొండ మధుసూధన్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి	0.11¾	
	అల్లకొండ పావని భర్త పద్మ రెడ్డి	అల్లకొండ పావని భర్త పద్మ రెడ్డి	0.10¾	
145 ఖుష్కీ/పట్టా 1.04¾	అల్లకొండ మాధవరెడ్డి తండ్రి బుచ్చి రెడ్డి	అల్లకొండ మాధవరెడ్డి తండ్రి బుచ్చి రెడ్డి	0.05½	
	జంగం భారతమ్మ భర్త భిక్షపతి	జంగం భారతమ్మ భర్త భిక్షపతి	0.08¼	
	జంగం భారతమ్మ భర్త భిక్షపతి	జంగం భారతమ్మ భర్త భిక్షపతి	0.05	
	అల్లకొండ పావని భర్త పద్మ రెడ్డి	అల్లకొండ పావని భర్త పద్మ రెడ్డి	0.01	
	కదారి మల్లమ్మ భర్త ఆయిలయ్య	కదారి మల్లమ్మ భర్త ఆయిలయ్య	0.25	
144 ఖుష్కీ/పట్టా 0.38½	కోల రాములు తండ్రి ఎల్లయ్య	పొట్ట పెంటయ్య తండ్రి	0.05½	
	కోల రాములు తండ్రి ఎల్లయ్య	బొజ్జ ధర్మయ్య	0.17¾	
	అల్లకొండ వెంకట్‌రెడ్డి తండ్రి పద్మ రెడ్డి	అల్లకొండ వెంకట్‌రెడ్డి తండ్రి పద్మ రెడ్డి	0.02¾	
	కదారి ఆయిలయ్య తండ్రి నర్సింహ్మా	కదారి ఆయిలయ్య తండ్రి నర్సింహ్మా	0.09½	
	కొన్న నర్సమ్మ భర్త వీరయ్య	కొన్న నర్సమ్మ భర్త వీరయ్య	0.03	
143 ఖుష్కీ/పట్టా 0.12¼	అల్లకొండ వెంకట్‌రెడ్డి తండ్రి పద్మరెడ్డి	అల్లకొండ వెంకట్‌రెడ్డి తండ్రి పద్మరెడ్డి	0.02¼	
	అల్లకొండ కార్తీక్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి	అల్లకొండ కార్తీక్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి	0.02½	
	అల్లకొండ కార్తీక్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి	అల్లకొండ కార్తీక్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి	0.07½	
135 ఖుష్కీ/పట్టా 0.05	అల్లకొండ పద్మరెడ్డి తండ్రి నర్సి రెడ్డి	అల్లకొండ పద్మరెడ్డి తండ్రి నర్సి రెడ్డి	0.01½	
	అల్లకొండ పద్మరెడ్డి తండ్రి నర్సిరెడ్డి	అల్లకొండ పద్మరెడ్డి తండ్రి నర్సిరెడ్డి	0.03½	
136 ఖుష్కీ/పట్టా 0.12¾	వాకిటి అండమ్మ భర్త మల్లారెడ్డి	వాకిటి అండమ్మ భర్త మల్లారెడ్డి	0.04	
	గట్ల సుధాకర్ రెడ్డి తండ్రి రామ్‌రెడ్డి	గట్ల సుధాకర్ రెడ్డి తండ్రి రామ్‌రెడ్డి	0.08¼	8 సపోట చెట్లు
142 ఖుష్కీ/పట్టా 0.20½	జక్కిడి పోషిరెడ్డి తండ్రి వీరరెడ్డి	జక్కిడి పోషిరెడ్డి తండ్రి వీరరెడ్డి	0.13¼	
	జక్కిడి పోషి రెడ్డి తండ్రి వీర రెడ్డి	జక్కిడి పోషి రెడ్డి తండ్రి వీర రెడ్డి	0.02½	
	నోముల అంజిరెడ్డి తండ్రి రామ్ రెడ్డి	నోముల అంజిరెడ్డి తండ్రి రామ్ రెడ్డి	0.04¾	
141 ఖుష్కీ/పట్టా 0.24¾	మాకోలు మల్లయ్య తండ్రి యెట్టయ్యా	మాకోలు మల్లయ్య తండ్రి యెట్టయ్యా	0.08	
	మాకోలు శ్రీశైలం తండ్రి యెట్టయ్యా	మాకోలు శ్రీశైలం తండ్రి యెట్టయ్యా	0.08	
	పిన్నాటి అజయ్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి	పిన్నాటి అజయ్‌రెడ్డి తండ్రి మల్లారెడ్డి	0.08¼	
235 ఖుష్కీ/పట్టా 0.02¼	పిట్టల వెంకటేశ్వర్లు తండ్రి ఆగయ్య	పిట్టల వెంకటేశ్వర్లు తండ్రి ఆగయ్య	0.01¼	
	పిట్టల రాజు తండ్రి ఆగయ్య	పిట్టల రాజు తండ్రి ఆగయ్య	0.01	
193 తరి/పట్టా 0.01½	ముంత మల్లేష్ తండ్రి మైసయ్య	జంగం పెంటమ్మ భర్త యాదగిరి	0.01½	
194 తరి/పట్టా 0.01½	రాచకొండ పాండు తండ్రి గండయ్య	ముంత మైసయ్య	0.01½	
152 ఖుష్కీ/పట్టా 0.03¾	వాకిటి మల్లారెడ్డి తండ్రి వెంకట నర్సింహారెడ్డి	వాకిటి మల్లారెడ్డి తండ్రి వెంకట నర్సింహారెడ్డి	0.03¾	
	మొత్తం విస్తీర్ణం		10.26	

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనలను అనుసరించి సంబంధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.
భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.
సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు/ తాకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.
సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి 60 (అరవై) దినములలోపు జిల్లా కలెక్టరు/అధీకృత అధికారి గారికి వారి అభ్యంత రములు వ్రాత పూర్వకంగా తెలియజే యవచ్చును.

ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్అండ్ఆర్, విభాగము-2 ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాద్రాద్రి భువనగిరి జిల్లా
అదనపు కలెక్టర్, యాద్రాద్రి భువనగిరి
జిల్లా కలెక్టర్, యాద్రాద్రి భువనగిరి

DIPR RO No.175/LA-PP/ADVT/Publication/2025-26

మినీ శిల్పారామంలో ఆకర్షణీయంగా ఫౌంటెయిన్లు



ఆహ్లాదగిరి

యాదగిరి క్షేత్రంలో రూపుదిద్దుకున్న మినీ శిల్పారామం

- రేపటి నుంచే పర్యాటకులకు అందుబాటులోకి
- ప్రారంభించనున్న మంత్రులు జూపల్లి, కోమటిరెడ్డి
- ఇప్పటికే రెండు అర్బన్ పార్కులతో పర్యాటక శోభ

భక్తులు సేదదీరేందుకు ఏర్పాటు చేసిన అందమైన హట్‌లు



యాదాద్రి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక వైభవం చెంతనే ఆహ్లాద సోయగం! యాదగిరిగుట్ట క్షేత్రం అతి సమీపంలోని రాయగిరి చెరువు వద్ద రెండెకరాల్లో పిల్లలు, పెద్దలను ఆకట్టుకునేలా మినీ శిల్పారామం రూపుదిద్దుకుంది. ఇది సోమవారం నుంచి భక్తులకు అందుబాటులోకి రానుంది. ఆ రోజు సాయంత్రం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి, మరో మంత్రి కోమటిరెడ్డితో కలిసి ఈ మినీ శిల్పారామాన్ని ప్రారంభిస్తారు. ఇప్పటికే రాయగిరి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చే దిశగా పనులు సాగుతున్నాయి. యాదగిరిగుట్ట నుంచి రాయగిరి వరకు వెళ్లే ఆరు కిలోమీటర్ల రహదారిని రూ.100కోట్లతో అభివృద్ధి పరిచారు. రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం భక్తులను ఆకట్టుకుంటోంది. ఇక.. మినీ శిల్పారామం కోసం ప్రభుత్వం రూ.2కోట్లు వెచ్చించింది. శిల్పారామంలోకి ప్రవేశించే స్వాగత తోరణాన్ని అందంగా తీర్చిదిదారు. లోపల పల్లె వాతావరణం ప్రతిబింబించేలా పచ్చదనం, చిన్న చిన్న కుటీరాల మధ్య పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు సేదతీరేందుకు మైదానాన్ని సిద్ధం చేశారు. చెరువులో బోటింగ్ సదుపాయం కల్పించారు. రాత్రి పూట వెలుగులు విరజిమ్మేలా ప్రత్యేక లైటింగ్ కూడా ఏర్పాటుచేశారు. ఇప్పటికే రాయగిరి చెరువు దగ్గర యాదగిరిగుట్టకు వెళ్లే రహదారి పక్కన 2015-17 మధ్య రూ.8 కోట్లు వెచ్చించి నిర్మించిన రెండు అర్బన్ పార్కులు పర్యాటక ప్రియులను కట్టిపడేస్తున్నాయి. ఈ పార్కులకు నరసింహ, ఆంజనేయ అరణ్యాలుగా నామకరణం చేశారు. రాయగిరి-1 రిజర్వ్ ఫారెస్టు పరిధిలోని 140 ఎకరాల్లో ఏర్పాటుచేసిన అంజనేయ అరణ్యంలో దాదాపుగా 60వేల మొక్కలను నాటారు. రాయగిరి-2 రిజర్వ్ పార్కు పరిధిలో 240ఎకరాల్లో ఏర్పాటు చేసిన అరణ్యంలో దాదాపుగా 30 వేలకు పైగా మొక్కలు నాటారు. సెల్ఫీ పాయింట్లు, ఎంట్రీ ప్లాజాలు, రకరకాల చెట్లు, నీటితో కళకళలాడే చెక్‌డ్యాంలు, వాకింగ్ ట్రాక్‌లను నిర్మించారు.

జవహర్ ఎత్తిపోతల టెండర్లకు సీవోటీ ఆమోదం

- 4.85% అదనంగా టెండర్ వేసిన పీవీఆర్ ప్రాజెక్ట్స్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుంచి 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు వీలుగా ఖమ్మం జిల్లా మధిర మండలం వంగవీడులో నిర్మించతలపెట్టిన జవహర్ ఎత్తిపోతల పథకం టెండర్లకు కమిషనర్ ఆఫ్ టెండర్స్ (సీవోటీ) ఆమోదం తెలిపింది. ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ అధ్యక్షతన శనివారం జరిగిన సీవోటీ సమావేశంలో ఈ ఎత్తిపోతల టెండర్లపై చర్చించి ఆమోదం తెలిపారు. రూ.456.49 కోట్ల నిర్మాణ అంచనా వ్యయంతో టెండర్లు పిలువగా... 4.85శాతం హెచ్చింపుతో పీవీఆర్ ప్రాజెక్ట్స్ (80 శాతం) - ఆదిత్య కన్‌స్ట్రక్షన్ కంపెనీ(20 శాతం) జాయింట్ వెంచర్ టెండర్ వేసింది. ఈ సంస్థకు టెండర్ కట్టబెట్టడానికి సీవోటీ ఆమోదం తెలపడంతో సంబంధిత ప్రాజెక్టు ఎస్ఈ వర్క్ ఆర్డర్ ఇవ్వనున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
అటవీశాఖ
Rc No:1252/2019/S3, **బహిరంగ కలప వేలం ప్రకటన** Date: 30.05.2025
ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా ఈ క్రింద తెలుపబడిన అటవీ జాతుల కలపను ఈ క్రింద తెలుపబడిన తేదీలలో బహిరంగ వేలం నిర్వహించబడును. తేది: 06.06.2025, 13.06.2025, 26.06.2025 & 28.06.2025 ఉదయం గం.10.00 లకు ఏటూరునాగారం ప్రభుత్వ కలప డిపో (Govt. Timber Depot) నందు బహిరంగ వేలం నిర్వహించబడును. **కలప రకములు:** 1) యెగిస 2) నల్లమద్ది 3) బండారు 4) బట్టగనం 5) జిట్రేగి 6) టేకు 7) నారేప. పూర్తి వివరములకు అటవీ క్షేత్రాధికారి, ఏటూరునాగారం నార్త్ రేంజ్ గారిని (ఫోన్ నెంబర్: 9177720923) నందు సంప్రదించగలరు. నోట్: ఒకవేళ సమయం సరిపోకపోతే మరుసటి రోజు కూడా సేల్స్ నిర్వహించబడును.
(ఎస్.రమేష్), డివిజనల్ అటవీశాఖ అధికారి, వన్యప్రాణి విభాగం, ఏటూరు నాగారం, జిల్లా ములుగు
DIPR RO No.2863-PP/CL/ADVT/1/2025-26 తేది:31.05.2025

తెలంగాణ ప్రభుత్వం
ప్రాంతీయ అధికారి కార్యాలయం, PR ప్రాంతీయ కార్యాలయం, ఆదిలాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No.91-102/RO PR/2025-26 తేది:31.05.2025
పనుల సంఖ్య: (12), PR డీపీయన్, ఆదిలాబాద్‌లో PMJANMAN, STSDF, MRR 2024-25, CRR 2024-25, CRR SCP 2024-25 గ్రాంట్ క్రింద మంజూరైన (12 నం.ల) పనుల కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. **మొత్తం అంచనా వ్యయం: రూ.4382.98 లక్షలు.** టెండరు డాక్యుమెంట్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో 03.06.2025 తరువాత లభిస్తాయి మరియు ప్రచురణ తేదీ నుండి (07) రోజుల కొరకు లభిస్తాయి. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in నుండి పొందవచ్చును.
సం/- ప్రాంతీయ అధికారి, PR ప్రాంతీయ కార్యాలయం, ఆదిలాబాద్
DIPR RO No.2912-PP/CL/ADVT/1/2025-26, Dt:31.05.2025

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ కార్యాలయం, పియు యాదాద్రి భువనగిరి
టెండరు ప్రకటన
సంక్షిప్త టెండరు ప్రకటన నం. HD/02/2025-26, తేది:29.05.2025
వివిధ గ్రాంట్ల క్రింద మంజూరు చేయబడినవి యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం 81 పనులకు దిగువ సంతకందారు టెండర్లు కోరుచున్నారు. మొత్తం అంచనా వ్యయం రూ.738.00 లక్షలు, దరఖాస్తు స్వీకరణకు ఆఖరి తేది: 06.06.2025న సా.05.00 గం.ల వరకు, టెండరు షెడ్యూల్స్ జారీ: 09.06.2025న సా.05.00 గం.ల వరకు, టెండర్ల స్వీకరణ తేది: 10.06.2025న మ.03.00 గం.ల వరకు, టెండర్లు తెరుచు తేది: 10.06.2025న మ.03.30 గం.లకు. తదుపరి వివరాలు దిగువ సంతకందారు నుండి పొందవచ్చును.
సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, పియు, యాదాద్రి భువనగిరి
DIPR RO No.2879-PP/CL/ADVT/1/2025-26, తేది:31.05.2025

పురపాలక సంఘం భైంసా, జిల్లా నిర్మల్
నెం:ఏ1/609/MCB/2025 తేది: 28.05.2025
వేలం ప్రకటన
ఇందుమూలముగా సమస్త పట్టణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా పురపాలక భైంసా యొక్క 2025-2026 సంవత్సరమునకు గాను శైబజార్ బహిరంగ వేలములు తేది: 10.06.2025, మంగళవారము రోజున ఉ.11:30 గం.లకు భైంసా మునిసిపల్ కార్యాలయమునందు నిర్వహించబడును. క్రమ సంఖ్య1) వేలం యొక్క స్వభావం: శైబజార్ సంత, **గత సంవత్సరపు వేలం రూపాయలు:** 2,42,550/-, **ప్రస్తుత సంవత్సరమునకు వేలం రూపాయలు:** 8,00,000/-, డిపాజిట్ రూ.డి.డిలో చెల్లించవలెను (Refundable): 4,00,000/-, దరఖాస్తు ఫీజు డి.డిలో చెల్లించవలెను (Non Refundable): 10,000/-, ఇ.యం.డి డి.డిలో చెల్లించవలెను (Refundable): 80,000/-.
గమనిక: అవసరమైన వివరములకు సంబంధిత అధికారి నుండి ఆఫీసు వేళల్లో తీసుకోవచ్చు. వేలములో పాల్గొనుటకు పైన చూపిన విధముగా ధరావత్తు సొమ్ముకు కమిషనర్ పురపాలక సంఘం, భైంసా గారి పేరున డి.డి పేరున తేది: 09.06.2025 సాయంత్రం 04:00 గం.ల లోపు సమర్పించవలెను. ధరావత్తు సొమ్ము నేరుగా స్వీకరించబడదు.
సం/- కమిషనర్, పురపాలక సంఘం, భైంసా
DIPR RO No.2858-PP/CL/ADVT/1/2025-26 తేది:31.05.2025

తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్
(తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ)
జోనల్ మేనేజర్ కార్యాలయం, యాదాద్రి జోన్, ఇ.నం.6-17/1, పగిడిపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లా - 508116
ఫోన్ నం: 8498900031, ఇమెయిల్: zm-ydr-iic@telangana.gov.in
టెండరు ప్రకటన
Lr.No.ZM/TGIIC/YDR/Tenders/2025-26 తేది: 30.05.2025
IALA ఫండ్స్ క్రింద యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం, రాయారావుపేటలోని ఇండస్ట్రియల్ పార్క్ వద్ద రోడ్ల పొడవునా ప్రస్తుత PSCC పోల్స్‌పై అదనంగా 75 నం.ల 90W వీధిలైట్లు ఏర్పాటు చేయుటకు జోనల్ మేనేజర్, TGIIC Ltd., యాదాద్రి జోన్ వారు బిడ్లు కోరుచున్నారు.

టెండరు ప్రకటన నం	:	01/ZM/TGIIC/DB/2025-26, తేది: 30.05.2025
ECV	:	రూ.7,58,291.00
బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది	:	02.06.2025 సా.05.00 గం. నుండి
బిడ్ల దాఖలుకు చివరి తేది	:	16.06.2025 మ.03.00 గం. వరకు

టెండరు ప్రకటనల వివరాలను మరియు బిడ్ డాక్యుమెంట్లను వెబ్‌సైట్: www.tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- జోనల్ మేనేజర్, TGIIC Ltd., యాదాద్రి జోన్
DIPR RO No.2898-PP/CL/ADVT/1/2025-26, Dt: 31.05.2025

పురపాలక సంఘ కార్యాలయం:: మంథని, జిల్లా: పెద్దపల్లి
ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన
R.No.E1/Non-SOR items/MM//2025-26 తేది:31.05.2025
పెద్దపల్లి జిల్లా, మంథని పురపాలక సంఘంలో 2025-26 సంవత్సరానికి మొక్కలు, చెట్లు, విత్తనాలు, వెదురు కర్రలు, ట్రీ గార్డులు, ఉపకరణాలు, షేడ్ నెట్, పాలిథిన్ బ్యాగులు, కంపోస్టు, ఎరువులు/రసాయనాలు, పైపులు, స్ప్రింక్లర్లు, డీసిల్టింగ్ యంత్రాలు మరియు ఏదైనా ఇతర వాహనాలు, పారిశుధ్య పరికరాలు, తట్ట, పార, గడ్డపార, చెత్తబుట్టలు, చీపురులు వంటి పారిశుధ్య ఉపకరణాల కోసం సరైన కొటేషన్లను అనుభవజ్ఞులైన వ్యాపారులు /ఏజెన్సీలు /కాంట్రాక్టర్ల నుండి సీల్డు కవర్లలో ఆసక్తి వ్యక్తీకరణ కోసం కొటేషన్లు కోరుచున్నారు. **దరఖాస్తు దాఖలుకు ఆఖరి తేది & సమయం:** 05.06.2025న మ.03.00 గం.లకు. **ఐటమ్‌ల సరఫరాకు నియమాలు:- 1.** వ్యాపారులు/ఏజెన్సీ/ కాంట్రాక్టర్ ఏ రాష్ట్రంలోనైనా ఏదైనా శాఖలో నమోదు చేసుకుని ఉండవలెను. **2.** తెలంగాణ ప్రభుత్వంతో తగిన తరగతి రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న కాంట్రాక్టర్లు/సంస్థ అర్హులు. **3.** GST రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్. **4.** పాన్ కార్డు మరియు తాజా ఐటీ రిటర్న్‌లు. **5.** పైన పేర్కొన్న నియమాలను నెరవేర్చే / అంగీకరించే సంస్థ మాత్రమే దరఖాస్తు చేసుకోవలెను. **6.** మునిసిపల్ కమిషనర్, మంథని వారికి సీల్డు E.O.I ను అంగీకరించడానికి లేదా తిరస్కరించడానికి అన్ని అధికారాలు ఉన్నవి. ఏదైనా ఇతర వివరాల కోసం పనివేళల్లో మంథని పురపాలక సంఘం కార్యాలయాన్ని సంప్రదించగలరు. **సంప్రదించవలసిన మొబైల్ నం:-** మునిసిపల్ కమిషనర్- (9160222224), మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్- (7989614201).
సం/- కమిషనర్, మంథని పురపాలక సంఘం
DIPR RO No.2871-PP/CL/ADVT/1/2025-26, Dt.31.05.2025

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ ఆర్కే RK

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

లోకేశ్‌కు పట్టం!

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో, కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొన్నదన్నట్టుగా ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. జగన్‌రెడ్డి పాలనలో అనేక ఇబ్బందులు పడ్డ కార్యకర్తల్లో ప్రభుత్వంపై ఆశలు, ఆకాంక్షలు అధికంగా ఉన్నందున ప్రభుత్వంలో ఏ చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియా వేదికగా ప్రతిస్పందన తీవ్రంగా ఉంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించడానికి సైతం తెలుగు తమ్ముళ్లు వెనుకాడలేదు. దీనికితోడు కొన్ని ప్రధాన సంక్షేమ కార్యక్రమాలు ఇంకా అమలుకాకపోవడంతో ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత ఏర్పడిందా? అన్న అనుమానం రాజకీయ పరిశీలకుల్లో కూడా ఏర్పడింది. ఇదంతా చూసి ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత మొదలైందని, నాలుగేళ్ల తర్వాత మళ్లీ అధికారం తనదేనని జగన్‌రెడ్డి ఆశలు పెంచుకుంటున్నారు. అయితే ఈ ప్రచారంలో వాస్తవం లేదని కడప మహానాడు రుజువు చేసింది.

రాజకీయ పార్టీలు సమావేశాలు జరుపుకోవడం కొత్త కాదు. అయితే తెలుగుదేశం పార్టీ నిర్వహించుకునే మహానాడుకు ప్రత్యేకత ఉంటుంది. అది ఒక పార్టీ కార్యక్రమం మాత్రమే కాదు.. అదొక ఉద్విగ్నభరిత సన్నివేశం. తెలుగు ప్రజలతో విడదీయరాని బంధం కూడా. వేలాది మంది పార్టీ ప్రతినిధులతో క్రమం తప్పకుండా మహానాడును ఒక పండుగలా జరుపుకోవడం తెలుగుదేశం పార్టీ ప్రత్యేకత. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ మహానాడు నిర్వహణను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు అధికారంలో ఉన్నా, లేకపోయినా మహానాడును క్రమశిక్షణతో నిర్వహించగలగడం ఆ పార్టీ ప్రత్యేకత. పార్టీ అధ్యక్షుడిగా ఎన్టీఆర్ ఉన్నప్పుడు గండిపేటలోని పార్టీ కార్యాలయం వద్ద మహానాడు నిర్వహించే వారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగేది. పెళ్లిళ్లు, పేరంటాలకు హాజరైనట్టుగా పార్టీ ప్రతినిధులు ముస్తాబై ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు. ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడ, విశాఖలో నిర్వహించిన మహానాడుకు జాతీయ నాయకులు హాజరయ్యారు. నాటి కాంగ్రెస్ వ్యతిరేక శక్తులకు మహానాడు వేదికగా ఉండేది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం పార్టీ ప్రతినిధులకు ఒక అనుభూతిని మిగిల్చేది. పార్టీ అధ్యక్షుడిగా ఎన్టీఆర్ ఉన్నప్పుడు, ప్రస్తుత పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆయనకు కుడి భుజంగా వ్యవహరిస్తూ మహానాడు నిర్వహణలో కీలక పాత్ర పోషించేవారు. తెలుగుదేశం పార్టీలో ఇప్పుడు మూడో తరం ప్రవేశించింది. కడపలో నిర్వహించిన మహానాడు బాధ్యతను మూడవ తరానికి చెందిన లోకేశ్ చేపట్టారు. ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా జరగకుండా కడప మహానాడు గ్రాండ్ సక్సెస్ అయింది. ముగింపు రోజున నిర్వహించే బహిరంగ సభకు జనం భారీగా హాజరవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. సాధారణ ఎన్నికలకు ఏడాది ముందు ఒంగోలులో నిర్వహించిన మహానాడు పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపగా, అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఇప్పుడు నిర్వహించిన మహానాడు ద్వారా కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందన్న ప్రచారంలో నిజం లేదని, ప్రభుత్వంపై ప్రజల భరోసా సన్నగిల్లలేదని రుజువైంది. ప్రభుత్వం పట్ల సానుకూలత విషయం పక్కనపెడితే, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ప్రజల్లో కోపం ఇంకా తగ్గలేదని మహానాడు ముగింపు సభ చెబుతోంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో, కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొన్నదన్నట్టుగా ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. జగన్‌రెడ్డి పాలనలో అనేక ఇబ్బందులు పడ్డ కార్యకర్తల్లో ప్రభుత్వంపై ఆశలు, ఆకాంక్షలు అధికంగా ఉన్నందున ప్రభుత్వంలో ఏ చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియా వేదికగా ప్రతిస్పందన తీవ్రంగా ఉంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించడానికి సైతం తెలుగు తమ్ముళ్లు వెనుకాడలేదు. దీనికితోడు కొన్ని ప్రధాన సంక్షేమ కార్యక్రమాలు ఇంకా అమలుకాకపోవడంతో ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత ఏర్పడిందా? అన్న అనుమానం రాజకీయ పరిశీలకుల్లో కూడా ఏర్పడింది. ఇదంతా చూసి ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత మొదలైందని, నాలుగేళ్ల తర్వాత మళ్లీ అధికారం తనదేనని జగన్‌రెడ్డి ఆశలు పెంచుకుంటున్నారు. అయితే ఈ ప్రచారంలో వాస్తవం లేదని కడప మహానాడు రుజువు చేసింది. పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం ఏ మాత్రం తగ్గలేదు. అతి క్రియాశీలకంగా వ్యవహరించే కొద్ది మంది మాత్రం అతిగా వ్యాఖ్యలు చేస్తున్నారని అర్థమవుతోంది. శాసనసభ్యులపై కార్యకర్తలకు కోపం ఉన్నప్పటికీ ఆ కోపం పార్టీ మీద కాదని రుజువైంది. కడప వంటి చోట మహానాడు నిర్వహించినా వసతులు ఉన్నాయా లేవా అని కూడా చూడకుండా వేలాది మంది కార్యకర్తలు తరలి రావడమే ఇందుకు నిదర్శనం. ముగింపు సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావడం హైలైట్. నిజానికి కడప జిల్లా నుంచి గెలిచిన ఎమ్మెల్యేలపై పార్టీ కార్యకర్తలు సంతృప్తిగా లేరు. తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. చంద్రబాబు మీద ప్రేమ తగ్గకపోయినా స్థానిక ఎమ్మెల్యేలపై ఆగ్రహంతో ఉన్నారు. అయితే మహానాడు విజయవంతం కావడానికి ఇవేమీ అడ్డు రాలేదు. ఇదే ఈ మహానాడు ప్రత్యేకత! ఈ మహానాడులో మరో మూడు నాలుగు ప్రత్యేకతలూ కనిపించాయి. కార్యకర్తల మనోభావాలను గుర్తించిన అధినేత చంద్రబాబు నాయుడు తన ప్రసంగంలో కోవర్టుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎన్నికల తర్వాత అప్పటి వరకు వైసీపీలో అధికారం చెలాయించి తమను ఇబ్బంది పెట్టినవారు ఇప్పుడు ఎమ్మెల్యేల చుట్టూ చేరి అధికారం చెలాయిస్తున్నారని కార్యకర్తలు ఆగ్రహంగా ఉన్నారు. ఎమ్మెల్యేల పంచన చేరుతున్న కోవర్టుల కారణంగానే పల్నాడు జిల్లాలో ఇటీవల ఇద్దరు కార్యకర్తలు హత్యకు గురయ్యారు. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా వచ్చింది. ఈ కారణంగానే ఒక పథకం ప్రకారం పార్టీలో చేరుతున్న కోవర్టుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన పార్టీ శాసనసభ్యులను పరోక్షంగా హెచ్చరించారు. ఈ సమస్యను అధిగమించడానికి ఎటువంటి చర్యలు చేపడతారో చూడాలి. అదే సమయంలో ఎమ్మెల్యేలను కట్టడి చేయవలసిన అవసరాన్ని ఈ మహానాడు గుర్తుచేస్తోంది. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఓడిపోవడానికి ఆయన మాత్రమే కారణం కాగా, ఇప్పుడు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత అంటూ ఏర్పడితే అందుకు శాసనసభ్యులే ప్రధాన కారణం కాబోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రజల్లో భరోసా సన్నగిల్లలేదు కనుక ప్రజలు ప్రస్తుతానికి సర్దిచెప్పుకొంటున్నారు. ఈ దశలో ఎమ్మెల్యేలను కట్టడి చేయని పక్షంలో దాని ప్రభావం పార్టీపై పడుతుంది. ఈ అంశాన్ని వక్తలు తమ ప్రసంగాల్లో ప్రస్తావించకపోయినా ఈ మహానాడు ద్వారా పార్టీకి అంతర్లీనంగా అందిన సందేశం ఇదే. కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా ప్రస్తుతానికి సానుకూలంగా ఉన్నారు. మిగతా నాలుగేళ్లు కూడా ఇదే సానుకూలత కొనసాగాలంటే పార్టీ నాయకత్వం కొన్ని విరుగుడు చర్యలు తీసుకోవాల్సిందే.

రాటుదేలిన లోకేశ్!

ఈ విషయం అలా ఉంచితే, ఈ మహానాడులో లోకేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మూడవ తరం ప్రతినిధిగా పార్టీ బాధ్యతలు మోయగల శక్తియుక్తులు తనకు ఉన్నాయని ఆయన నమ్మకం కలిగించగలిగారు. మహానాడులో ప్రసంగించిన లోకేశ్‌ను నిశితంగా గమనిస్తే ఆయనలో మూర్తీభవించిన ఆత్మవిశ్వాసం కనిపించింది. గతంలో కొంత తొట్రుపాటు కనిపించేది. తెలుగు భాషపై అంతగా పట్టు కూడా ఉండేది కాదు. ఇటీవల ఢిల్లీలో కుటుంబ సభ్యులతో కలసి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని లోకేశ్ కలుసుకోవడం, ప్రధాని వారితో రెండు గంటలపాటు గడపటం తెలిసిందే. ఈ సందర్భంగా లోకేశ్‌కు కొన్ని సూచనలు చేయడంతో పాటు ఆయనలో తాను గమనించిన మార్పు గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. 'మీలో పరిణతి కనిపిస్తోంది. ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. మీ ప్రసంగాలలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మార్పును నేను గమనించాను. మొదట్లో తడబడిన మీరు ఇప్పుడు ఆసువుగా ఉపన్యసిస్తున్నారు' అని ప్రధాని మోదీ ప్రశంసించారు. అదే సమయంలో చంద్రబాబు నీడ నుంచి బయటపడి సొంతంగా ఎదిగే ప్రయత్నం చేయాలని కూడా లోకేశ్‌కు ప్రధాని సూచించారు. ప్రధాని పరిశీలన నిజమే. గతంతో పోలిస్తే లోకేశ్ ఇప్పుడు రాటుదేలారు. నిజం చెప్పాలంటే, ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపన్యాసాలు ప్రజలను ఆకట్టుకొనే విధంగా ఉండవు. ఆయనకు అంతటి వాగ్ధాటి లేదు. 2019కి పూర్వం తెలుగులో మాట్లాడటానికి తొట్రుపడిన లోకేశ్, ఇప్పుడు అనర్గళంగా మాట్లాడగలుగుతున్నారు. లోకేశ్ భాష కూడా బాగా మెరుగైంది. అదే సమయంలో ఆయనలో ఆత్మవిశ్వాసం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. బాడీ లాంగ్వేజ్ కూడా అందుకు అనుగుణంగా మారింది. సాధన వల్లనే ఇది సాధ్యమై ఉంటుంది. వర్తమాన రాజకీయాలలో లోకేశ్‌కు ఎదురైనన్ని అవమానాలు మరే ఇతర నాయకుడికీ ఎదురవలేదు. జగన్ అండ్ కో ఒక పథకం ప్రకారం లోకేశ్‌ను కించపరిచే విధంగా ప్రచారం చేశారు. పప్పు అని అవమానించారు. ఆయన భాషను హేళన చేశారు. చివరికి ఆయన పుట్టుకపై కూడా జుగుప్సాకరంగా మాట్లాడారు. మామూలుగా అయితే ఇన్ని అవమానాలు ఎదురైనప్పుడు మానసికంగా కుంగిపోతాం. అయితే లోకేశ్ వాటిని పట్టించుకోకుండా లక్ష్యం వైపు కదిలారు. తానేమిటో రుజువు చేసుకోవడానికి అహరహం కృషి చేశారు. బాడీ షేమింగ్‌కు గురైనప్పటికీ బాధపడకుండా ఆహార నియంత్రణ పాటించడం ద్వారా విమర్శకుల నోళ్లు కట్టేశారు. రాజకీయాలలో నంబర్ 2గా ఉన్న వారిని టార్గెట్ చేసుకోవడం సహజం. ఎన్టీఆర్ ఉన్నప్పుడు నంబర్ 2గా ఉన్న చంద్రబాబును కూడా అప్పటి కాంగ్రెస్ నాయకులు టార్గెట్ చేశారు. ఆయనపై నిత్యం ఆరోపణలు చేసేవారు. చివరికి చర్మ సంబంధమైన సమస్య వచ్చి చికిత్స తీసుకున్నప్పుడు కూడా అవమానించారు. అయితే లోకేశ్‌కు ఎదురైనన్ని అవమానాలు చంద్రబాబుకు ఎదురవలేదు. తనపై వస్తున్న ఆరోపణలకు చంద్రబాబు వెరవకుండా కార్యకర్తలు, నాయకులకు నిత్యం అందుబాటులో ఉండటం ద్వారా ఎన్టీఆర్‌కు వారసుడిగా నిలిచారు. 1983లో కాంగ్రెస్ పార్టీ తరఫున చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయిన చంద్రబాబు, ఆ తర్వాత సురక్షితమైన కుప్పం నియోజకవర్గానికి మారారు. లోకేశ్ అలా చేయలేదు. సంక్లిష్టమైన మంగళగిరి నుంచి మొట్టమొదటిసారి పోటీచేసిన ఆయన ఓడిపోయారు. మంగళగిరి నుంచి పోటీ చేసి ఉండాల్సింది కాదు అని అప్పట్లో చాలా మంది అభిప్రాయపడ్డారు. ఎందుకంటే, మంగళగిరిలో 1983 నుంచి నేటి వరకు తెలుగుదేశం పార్టీ మూడు నాలుగు పర్యాయాలు మాత్రమే గెలిచింది. అయినప్పటికీ లోకేశ్ మరో సురక్షిత నియోజకవర్గం వెతుక్కోకుండా ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలి అన్నట్టుగా పట్టుదల ప్రదర్శించి గత ఎన్నికల్లో తాను ఓడిన మంగళగిరి నుంచే 91 వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందారు. ఆయనలోని ధైర్యానికి, పట్టుదలకు ఇదొక నిదర్శనం. ఈ నేపథ్యంలో కడపలో జరిగిన మహానాడులో లోకేశ్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి అప్పగించాలని పలువురు ప్రతిపాదించారు. నిజానికి ఆయన ఇప్పుడు జాతీయ ప్రధాన కార్యదర్శిగా మాత్రమే ఉన్నప్పటికీ పార్టీ నిర్వహణ బాధ్యతలను ఇప్పటికే చేపట్టారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీగా ఉంటున్నందున పార్టీ బాధ్యతలను లోకేశ్ చూసుకుంటున్నారు. పార్టీలోని సీనియర్ నాయకులు కూడా ఆయన నాయకత్వాన్ని ఇప్పుడిప్పుడే అంగీకరిస్తున్నారు. కార్యకర్తల్లో కూడా లోకేశ్ నాయకత్వం పట్ల నమ్మకం ఏర్పడుతోంది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు దారుణ హత్యకు గురైన చంద్రయ్య అనే పార్టీ కార్యకర్త కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించడంలో లోకేశ్ పట్టుదలతో కృషి చేశారు. దీంతో ఆయనపై కార్యకర్తల్లో భరోసా ఏర్పడింది. ఇప్పుడు ప్రజానాయకుడిగా గుర్తింపు పొందడమే లోకేశ్ ముందున్న కర్తవ్యం. ప్రజలతో నేరుగా సంబంధాలు ఏర్పరచుకోవడం, అంటే ప్రజల్లోకి వెళ్లడం ద్వారా ప్రజామోదం పొందే ప్రయత్నాలను ఆయన ఇప్పటికే మొదలెట్టారు. పార్టీ వ్యవహారాల్లో ఆయనకు చంద్రబాబు ఇప్పుడిప్పుడే స్వేచ్ఛ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ బాధ్యతలను లోకేశ్‌కు పూర్తిగా ఎందుకు అప్పగించకూడదు అన్న ప్రతిపాదన కూడా అంతర్గతంగా చర్చకు వచ్చింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు తీరిక లేకుండా ఉన్నందున పార్టీ జాతీయ అధ్యక్ష పదవిని లోకేశ్‌కు అప్పగిస్తే తప్పేమిటి?

ఎమ్మెల్యేలను కట్టడి చేయవలసిన అవసరాన్ని కడప మహానాడు గుర్తుచేస్తోంది. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో జగన్‌రెడ్డి ఓడిపోవడానికి ఆయన మాత్రమే కారణం కాగా, ఇప్పుడు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత అంటూ ఏర్పడితే అందుకు శాసనసభ్యులే ప్రధాన కారణం కాబోతున్నారు.

ఇవాళ కాకపోయినా రేపైనా తానే వారసుడు కదా? చంద్రబాబు యాక్టివ్‌గా ఉన్నప్పుడే పార్టీ బాధ్యతలను పూర్తిగా ఆయనకు అప్పగిస్తే నాయకత్వ మార్పిడి సాఫీగా జరిగిపోతుంది కదా? అన్న అభిప్రాయం కూడా బలంగా ఉంది. ప్రజామోదం ఉన్నంత వరకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. మూడో తరం ప్రతినిధిగా లోకేశ్‌ను పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ప్రకటిస్తే ఇటు ప్రభుత్వ, అటు పార్టీ వ్యవహారాలను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చు అన్న అభిప్రాయం ఉంది.



లోకేశ్‌కు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్ష పదవి కట్టబెట్టినా చంద్రబాబు నాయుడు నీడలోనే ఆయన పనిచేయాల్సి ఉంటుంది. ఈ కారణంగా తెలుగుదేశం పార్టీ తదుపరి వారసుడిగా లోకేశ్‌ను ఇప్పుడే ప్రకటించాలని పలువురు భావిస్తున్నారు. చంద్రబాబు కూడా ఈ ప్రతిపాదన పట్ల సుముఖంగా ఉన్నారు. అయితే చంద్రబాబు యాక్టివ్‌గా ఉన్నప్పటికీ ఆయనను పక్కనబెట్టి నాయకత్వం చేపట్టాడన్న అపప్రథ తనకు చుట్టుకోకూడదన్న అభిప్రాయంతో లోకేశ్ ఉన్నట్టు చెబుతున్నారు. చంద్రబాబు ఆయురారోగ్యాలతో ఉన్నంత వరకు ఆయనను ధిక్కరించే పరిస్థితి తెలుగుదేశం పార్టీలో ఉండదు. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ పదమూడేళ్లు మాత్రమే పార్టీ అధ్యక్షుడిగా కొనసాగగా, చంద్రబాబు ముప్పై ఏళ్లకు మించి పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ ముప్పై ఏళ్లలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని తాను నిలబడటమే కాకుండా పార్టీని నిలబెట్టారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు పర్యవేక్షణలో లోకేశ్ పార్టీ బాధ్యతలను చేపడితే ఇటు కార్యకర్తలు, అటు ప్రజలకు కూడా భరోసా ఏర్పడే అవకాశం ఉంది. తెలుగుదేశం పార్టీతో చంద్రబాబుకు సంబంధం లేదు అన్న అభిప్రాయం కలగకుండా పార్టీ ప్రెసీడియం ఏర్పాటు చేసి దానికి ఆయనను చైర్మన్‌గా పెట్టుకోవచ్చునన్న అభిప్రాయం కూడా ఉంది.

తదుపరి ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. ఇప్పుడే పార్టీ బాధ్యతలను లోకేశ్ చేపడితే ఎన్నికల నాటికి మరింత రాటుదేలుతారు. లోటుపాట్లు ఏవైనా జరిగినా సరిదిద్దడానికి చంద్రబాబు ఉండనే ఉంటారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలు చేపట్టినవారు విజయవంతమైన దాఖలాలు పెద్దగా లేవు. తెలుగుదేశం సీనియర్ నాయకుడు ఒకరు ఈ విషయమే ప్రస్తావిస్తూ.. లోకేశ్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించడానికి ఇంతకు మించిన తరుణం ఏముంటుంది? అని ప్రశ్నించారు. శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వం తరఫున ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే బాధ్యతను లోకేశ్ సమర్థవంతంగా నిర్వహించారు. శాసనమండలిలో వైసీపీకి మెజారిటీ ఉండటం గమనార్హం. ప్రతిపక్ష నాయకుడిగా బొత్స సత్యనారాయణ ఉన్నారు. అయినప్పటికీ లోకేశ్ తొట్రుపడకుండా ప్రతిపక్షాన్ని దీటుగా ఎదుర్కొన్నారు. దీంతో లోకేశ్‌ను తక్కువ అంచనా వేయడానికి లేదు, ఆయనలో సరుకు ఉందని ప్రతిపక్ష ముఖ్యుడు ఒకరు వ్యాఖ్యానించారు. పార్టీ బాధ్యతలు స్వీకరించడానికి లోకేశ్ కూడా సుముఖంగా ఉన్నందున ఆయనకు ముందస్తు అభినందనలు చెబుదాం.

అస్సలు తగ్గేదేలే..!

ఎన్టీఆర్ ఏ ముహూర్తంలో తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేశారో గానీ నాలుగు దశాబ్దాలు గడచినా ఆ పార్టీ చెక్కు చెదరలేదు. ఇప్పుడు పార్టీలోకి కొత్త తరం వచ్చింది. వారందరికీ పార్టీ భవిష్యత్తుపై భరోసా కల్పించాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉంది. చంద్రబాబు నిన్నటి తరానికి చెందినవారు. లోకేశ్ ఈ తరానికి చెందినవారు. నిర్ణయాలు తీసుకోవడంలో చంద్రబాబు సాచివేత ధోరణి అవలంబిస్తారు. లోకేశ్ మాత్రం ఈ తరానికి అనుగుణంగా వేగంగా నిర్ణయాలు తీసుకుంటారు. అదే సమయంలో సీనియర్లు, అనుభవజ్ఞులు ఇచ్చే సలహాలను స్వీకరిస్తున్నారు. జగన్మోహన్‌రెడ్డితో ఢీ అంటే ఢీ అనడానికి ఆయన సిద్ధంగా ఉన్నారు. 2029లో ఏ కారణం వల్లనైనా జగన్‌రెడ్డి అధికారంలోకి వస్తే పరిణామాలు ఎలా ఉంటాయో లోకేశ్‌కు తెలుసు. అయినా తగ్గేదేలే అన్నట్టుగా ఆయన అడుగులు వేస్తున్నారు. లోకేశ్ చేతుల్లో తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు భద్రంగా ఉంటుందన్న నమ్మకాన్ని కార్యకర్తల్లో కల్పించాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉంది. చంద్రబాబు మార్గదర్శకత్వంలో తెలుగుదేశం పార్టీని లోకేశ్ నడిపించడానికి నిజానికి ఇదే సరైన తరుణం. ఇప్పుడు పార్టీ బలంగా ఉంది. మాజీ ముఖ్యమంత్రిపై ప్రజల్లో కోపం ఇంకా పోలేదు. నాయకత్వ మార్పిడికి ఇంతకంటే మంచి తరుణం ఏముంటుంది? తెలంగాణలో కేసీఆర్ కూడా పార్టీ నాయకత్వాన్ని కుమారుడు కేటీఆర్‌కు బదలాయించాలని అనుకున్నారు. ఈ క్రమంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్‌ను నియమించారు. అయితే కేసీఆర్ నీడ నుంచి ఆయన బయటపడక ముందే ఎన్నికలు రావడం, పార్టీ అధికారాన్ని కోల్పోవడం జరిగింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కార్యకర్తలతో సంబంధాలను పటిష్ఠం చేసుకోవడంలో కేటీఆర్ విఫలమయ్యారు. ఇప్పుడు పార్టీ అధికారంలో లేదు కనుక కేటీఆర్ నాయకత్వాన్ని ఆయన సోదరి కవిత వ్యతిరేకిస్తున్నారు. కేటీఆర్ నాయకత్వంలో తాను పనిచేయనని ఆమె ప్రకటించారు. చంద్రబాబుకు ఈ సమస్య లేదు. లోకేశ్‌కు కూడా సోదరుడో, సోదరో ఉండి ఉంటే నాయకత్వం కోసం పోటీ పడేవారేమో? దివంగత రాజశేఖరరెడ్డి, కేసీఆర్ కుటుంబాలలో అన్నాచెల్లెళ్లు అధికారం కోసం పోటీ పడటాన్ని చూస్తున్నాం. చంద్రబాబుకు లోకేశ్ ఒక్కడే వారసుడు కనుక ఈ బెడద కూడా లేదు. కాలూ చేయీ సరిగ్గా ఉన్నప్పుడే అన్నీ చక్కదిద్దుకోవాలని అంటారు. చంద్రబాబుకు 75 ఏళ్ల వయసు వచ్చినప్పటికీ మానసికంగా, శారీరకంగా ఆయన దృఢంగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి కొత్త తరం నాయకుడిని అందించడంపై చంద్రబాబు దృష్టి పెట్టాలి. శషభిషలకు స్వస్తి చెప్పి లోకేశ్‌ను పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నియమించే విషయంలో ఆయన ఒక నిర్ణయం తీసుకోవాలి. తదుపరి ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. ఇప్పుడే పార్టీ బాధ్యతలను లోకేశ్ చేపడితే ఎన్నికల నాటికి మరింత రాటుదేలుతారు. లోటుపాట్లు ఏవైనా జరిగినా సరిదిద్దడానికి చంద్రబాబు ఉండనే ఉంటారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలు చేపట్టినవారు విజయవంతమైన దాఖలాలు పెద్దగా లేవు. తెలుగుదేశం సీనియర్ నాయకుడు ఒకరు ఈ విషయమే ప్రస్తావిస్తూ.. లోకేశ్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించడానికి ఇంతకు మించిన తరుణం ఏముంటుంది? అని ప్రశ్నించారు. శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వం తరఫున ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే బాధ్యతను లోకేశ్ సమర్థవంతంగా నిర్వహించారు. శాసనమండలిలో వైసీపీకి మెజారిటీ ఉండటం గమనార్హం. ప్రతిపక్ష నాయకుడిగా బొత్స సత్యనారాయణ ఉన్నారు. అయినప్పటికీ లోకేశ్ తొట్రుపడకుండా ప్రతిపక్షాన్ని దీటుగా ఎదుర్కొన్నారు. దీంతో లోకేశ్‌ను తక్కువ అంచనా వేయడానికి లేదు, ఆయనలో సరుకు ఉందని ప్రతిపక్ష ముఖ్యుడు ఒకరు వ్యాఖ్యానించారు. పార్టీ బాధ్యతలు స్వీకరించడానికి లోకేశ్ కూడా సుముఖంగా ఉన్నందున ఆయనకు ముందస్తు అభినందనలు చెబుదాం. 2029లో పార్టీ మళ్లీ విజయం సాధించాలంటే పార్టీపరంగా తీసుకోవాల్సిన దిద్దుబాటు చర్యలపై లోకేశ్ వెంటనే దృష్టి పెట్టాలి. చంద్రబాబులో మొహమాటం ఎక్కువ. లోకేశ్ అలా కాదని, కరాఖండీగా వ్యవహరిస్తారని అంటున్నారు. తండ్రిని మించిన తనయుడు అని రుజువు చేసుకోవాలన్న పట్టుదల కూడా ఆయనలో కనిపిస్తోంది. అన్నీ మంచి శకునములే అన్నట్టుగా పార్టీ నియమావళికి అనుగుణంగా నాయకత్వ మార్పిడికి చంద్రబాబు శ్రీకారం చుడతారా? లేదా? అంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే. పార్టీలో కట్టుతప్పుతున్న నాయకులను, శాసనసభ్యులను కట్టడి చేసే విషయంలో కూడా చంద్రబాబుకు మొహమాటం అడ్డు వస్తోంది. ఇది అంతిమంగా పార్టీకి నష్టం చేస్తుంది. ఇలాంటి లోటుపాట్లను అధిగమించడం అవసరం. మహానాడులో ఉపన్యాసాల ద్వారా లోకేశ్ ఇప్పటికే తండ్రి కంటే చాలా మెరుగు అని రుజువు చేసుకున్నారు. నాయకత్వం అప్పగిస్తే పార్టీలో క్రమశిక్షణను మరింతగా ఆయన పాదుగొల్పగలరని నాయకులు అంగీకరిస్తున్నారు. తనకు పార్టీ బాధ్యతలు అప్పగిస్తే తెలుగుదేశం పార్టీ భవిష్యత్తుకు ఢోకా ఉండదని లోకేశ్ ఇప్పటికే రుజువు చేసుకున్నారు. కడప మహానాడుతో ఈ విషయం రుజువైంది. కడప మహానాడు వేదికగా లోకేశ్‌కు నాయకత్వం అప్పగించే విషయం తెర మీదకు వచ్చింది. రాజకీయంగా తెలుగుదేశం పార్టీ తలబడుతున్న వైసీపీ అధినేత జగన్‌రెడ్డి సొంత జిల్లా కడప అయినందున మహానాడులోనే ఆయనకు నాయకత్వ బాధ్యతలు అప్పగించే విషయమై ప్రకటన చేసి ఉంటే బాగుండేదని కూడా కొందరు పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా తెలుగుదేశం పార్టీ భావి నాయకుడు లోకేశ్ మాత్రమే కనుక చంద్రబాబు కనుసన్నల్లోనే నాయకత్వ మార్పిడి జరగడం వాంఛనీయం అని తెలుగుదేశం శ్రేణులు కూడా అభిప్రాయపడుతున్నాయి. మొత్తానికి నాయకత్వ మార్పిడికి నిర్ణయం జరిగిపోయింది. ముహూర్తం ఖరారు కావడమే మిగిలి ఉంది. సో.. లోకేశ్‌కు ముందస్తు శుభాకాంక్షలు చెబుదాం!

ఆకాంక్షకు తగ్గ అభివృద్ధి జరిగిందా?

మలిదశ ఉద్యమం ఈ పోరాటాల మేలిమిని స్వీకరించిందన్నట్టుగా అత్యంత శాంతియుతంగా నడిచి, ఖచ్చితమైన లక్ష్యాన్ని చేరుకొని ఒక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. అయితే తెలంగాణ ఎందుకు ఏర్పడిందో ఆ లక్ష్యసాధన తొవ్వలోనే నడుస్తున్నదా అని ప్రశ్నించుకోవలసిన అవసరం ఉంది.



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగి పదకొండు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర ఆవిర్భావ లక్ష్యం ఏ మేరకు నెరవేరిందన్న మూల్యాంకనం చేయాల్సి ఉంది. రాష్ట్రం కోసం జరిగిన పోరాటం చరిత్రాత్మకమైనది. ఈ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. దాదాపు అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్రాన్ని ఇవ్వాలనే డిమాండ్ చేశాయి. ఆ రకంగా చూసినప్పుడు తెలంగాణ మలిదశ ఉద్యమం విలక్షణమైనది. ఇటీవలి కాలంలో అత్యంత శాంతియుతంగా జరిగి సజావుగా లక్ష్యాన్ని సాధించిన ఉద్యమం ఇదే. శ్రీకాంతాచారి లాంటి యువకులు ఆత్మబలిదానం చేసుకున్నప్పటికీ హింసకు ఏ మాత్రం తావు లేకుండా జరిగిన ఉద్యమం ఇది. ఆధునిక పోరాటాలకు ఇదొక మోడల్.

నిజానికి తెలంగాణ చరిత్ర పోరాటాలమయం. 1945లో సాయుధ పోరాటాన్ని జరపాల్సిన పరిస్థితుల్ని ఎదుర్కొన్నది తెలంగాణ. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు కూడా ఇక్కడ భావనాత్మక సంఘర్షణ తొణికిసలాడింది. 1948 సెప్టెంబర్ 17 విలీనం– ఇక్కడి ప్రజలకు ఒక గుర్తుంచుకోవలసిన రోజు. 1952 దాకా దాదాపు మిలిటరీ పరిపాలనే కొనసాగింది. ఇంకొక ప్రధాన ఘట్టం 1956లో ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం. తదనంతరం 1957లో ముల్కీ ఉద్యమం కూడా విద్యావంతులను పట్టి కుదిపేసింది. దీని వైఫల్యసాక్ష్యంగా 1969లో 'జై తెలంగాణ' ఈ ప్రాంతాన్ని అట్టుడికేటట్టు చేసింది. 2000 సంవత్సరం నుంచి మొదలైన మలిదశ ఉద్యమం ఈ పోరాటాల మేలిమిని స్వీకరించిందన్నట్టుగా అత్యంత శాంతియుతంగా నడిచి, ఖచ్చితమైన లక్ష్యాన్ని చేరుకొని ఒక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. అయితే తెలంగాణ ఎందుకు ఏర్పడిందో ఆ లక్ష్యసాధన తొవ్వలోనే నడుస్తున్నదా అని ప్రశ్నించుకోవలసిన అవసరం ఉంది.

తెలంగాణ రాష్ట్రం వచ్చాక తెలంగాణ భాషకు న్యూనత లేకుండా పోయింది, గౌరవం పెరిగింది. ఏ సినిమాలలో తెలంగాణ భాష చిన్నతనానికి గురైందో, అదే తెలుగు సినిమాలలో తెలంగాణ భాషను హీరోలు కూడా మాట్లాడడం మొదలైంది. తెలంగాణ భాష ఉన్న సినిమాలే హిట్ అవ్వడం కూడా ఎవరూ కాదనలేని సత్యం. తెలంగాణలో ప్రపంచ తెలుగు మహాసభలు ఇక్కడి సాహిత్య వాతావరణాన్ని ఉద్దీపింపజేశాయి. భౌతికపరమైన అభివృద్ధిని కూడా గమనించవలసి ఉంది. హైదరాబాదు, దాని పరిసరాలలో రోడ్లు విస్తరించబడ్డాయి. ఫ్లైఓవర్లు నిర్మించబడ్డాయి. అండర్ పాస్‌లు కొత్తగా తొవ్వబడ్డాయి. ఇరవైనాలుగు గంటలు విద్యుత్ సరఫరా నిరాఘాటంగా జరిగింది.

ఇవి కాకుండా ప్రధానంగా తెలంగాణ ఉద్యమం ముందుకు తీసుకు వచ్చిన ఒక నినాదం నీళ్లు, నిధులు, నియామకాలు. ఈ మూడు రంగాలలో ఆశించిన మేరకు అభివృద్ధి జరిగిందా అనే ప్రశ్నకు ఏకవాక్య సమాధానం లేదు. మిషన్ కాకతీయ లాంటి పథకాల ద్వారా చెరువులను కాలువ నీటితో నింపడం, వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవడం జరిగింది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచినీటి సరఫరా చేయాలనే ప్రయత్నం కొంతమేరకు సఫలీకృతమైంది. ఈ చిన్న విజయాలను అపహాస్యం చేసే విధంగా కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఇక నిధుల విషయానికి వస్తే రాష్ట్రంలోని ఆర్థిక వనరులన్నీ మన రాష్ట్రానికే వాడుకునే సౌకర్యం ఒకటి ఉందని సంతోషపడవచ్చు. కానీ కేవలం రూ.75 వేల కోట్ల అప్పుతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం, ఈ రోజు ఆరు లక్షల 70 వేల కోట్లకి చేరుకుందని తలుచుకున్న ప్రతి విద్యావంతుడు ప్రభుత్వాన్ని తప్పు పట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఆర్థిక అస్తవ్యస్తతను తప్పించుకోవడానికి ఉద్యోగుల విరమణ వయసును 58 నుంచి 61కి పెంచడం ఎవరూ కాదనలేని వాస్తవం. ఇక మూడవ ప్రధాన నినాదం నియామకాలు. సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల, మైనారిటీల గురుకులాలు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ విద్యను అందించే లక్ష్యంలో భాగంగా ఉపాధ్యాయులను, లెక్చరర్లను కొంత మందిని నియమించారు. నీటిపారుదల శాఖకు కొంతమంది సహాయ ఇంజనీర్లను కూడా నియమించారు. రెవెన్యూ శాఖను గ్రామస్థాయిలో తొలగించడంలో భాగంగా వ్యవసాయ శాఖకు వ్యవసాయ అధికారులను, వ్యవసాయ విస్తరణ అధికారులను కొంతమందిని నియమించారు. కానీ గ్రూపు వన్, టు, త్రీ నియామకాలు ఏవీ చేపట్టకపోవడం నిరుద్యోగ యువతకు అశనిపాతంగా మారింది. ఇప్పుడిప్పుడే గ్రూప్ వన్, టు, ఉద్యోగాలు నియమించే ప్రక్రియలో పురోగతి కనిపిస్తున్నది. ఏ స్థాయిలో ఉద్యమ ఆకాంక్షలు ఉండేవో ఆ స్థాయిలో అభివృద్ధి జరిగింది అని మాత్రం చెప్పలేం.

లాభ నష్టాలతోపాటు ప్రత్యేకంగా చెప్పవలసిన ఇబ్బందికరమైన పరిస్థితులు కూడా రాష్ట్ర ఆవిర్భావానంతరమే సృష్టించబడ్డాయి. పది జిల్లాల తెలంగాణను 33 జిల్లాలుగా విభజించడం శాస్త్రీయ దృక్పథంతో చేసిన వికేంద్రీకరణ అనిపించుకుంటుందా అన్నది పెద్ద ప్రశ్న. పది మండలాలు కలిగిన ములుగు లాంటి జిల్లాలు, 30 మండలాలు కలిగిన నల్లగొండ లాంటి జిల్లాలకు ఒకే స్థాయి కలిగిన అధికార యంత్రాంగాన్ని నియమించడం ఎంత మేరకు సబబు? అన్ని జిల్లాలు చేసినప్పుడు వాటికి సరిపడా ఉద్యోగ నియామకాలు చేయలేదు. కేవలం 10 మండలాలు ఉన్న జిల్లాలకు కూడా అదే స్థాయి ఐడీఓసీలను నిర్మించడం ప్రజాధనాన్ని సద్వినియోగపరచడమేనా అనే ప్రశ్న కూడా ఉంది. గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా తొలగించడం భవిష్యత్తులో మరిన్ని సమస్యలను తెచ్చే నిర్ణయం. ఇప్పుడు గ్రామానికి రెవెన్యూ రికార్డుల సజీవ చిట్టా పహాణి లేదు. వాటిని నిర్వహించే వీఆర్ఓ లేడు. అటు గ్రామాధికారికి ఇటు తహసిల్దార్‌కు సహకరించే గ్రామ సేవకులు కూడా లేరు. ఇంతగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను నిర్మూలించడం భారతదేశంలో ఇంకే రాష్ట్రంలోనూ జరగలేదు. దీన్ని పునర్నిర్మించడం కూడా అంత సులభం కాదు. ఇట్లా ఆలోచించినప్పుడు తెలంగాణ పరిపాలన మీద ప్రభుత్వాలు మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పక తప్పదు.

▪ ఏనుగు నరసింహారెడ్డి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



వరంగల్ రైల్వేస్టేషన్ వద్ద ర్యాలీలో మంద కృష్ణమాదిగ అభివాదం

ఇది మాదిగ జాతికి దక్కిన గౌరవం

- పద్మశ్రీ పురస్కారంపై మంద కృష్ణ మాదిగ
- అవార్డు అందుకున్న తర్వాత తొలిసారిగా నగరానికి రాక
- వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి హనుమకొండ వరకు ర్యాలీ
- కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా సన్మాన సభ

వడ్డేపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాట ఫలితంగానే తనకు పద్మశ్రీ పురస్కారం వచ్చిందని, ఇది మాదిగ జాతికి దక్కిన గౌరవమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా న్యూఢిల్లీలో పద్మశ్రీ పురస్కారం అందుకున్న అనంతరం శనివారం రాత్రి తొలిసారి కృష్ణ మాదిగ వరంగల్‌కు వచ్చారు. ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి హనుమకొండ కాళోజీ కళాక్షేత్రానికి మందకృష్ణ మాదిగ భారీ స్వాగత ర్యాలీతో తరలివచ్చారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో కృష్ణ మాదిగకు సన్మాన సభ (మిగతా 8వ పేజీలో)

ఉత్సాహంగా సాగిన ర్యాలీ

గిర్మాజీపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ పురస్కారం పొందిన అనంతరం న్యూఢిల్లీ నుంచి ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో శనివారం రాత్రి వరంగల్‌కు చేరుకున్న కృష్ణ మాదిగకు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన ర్యాలీ.. వరంగల్ చౌరస్తా, జేపీఎన్ రోడ్డు, ఎంజీఎం సెంటర్, ములుగురోడ్డు, హనుమకొండ చౌరస్తా మీదుగా కాళోజీ కళాక్షేత్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. ర్యాలీలో కృష్ణ మాదిగ మాట్లాడుతూ అత్యంత కీలకదశలో మాదిగజాతిని గెలిపించిన ఘనత ప్రధానమంత్రి మోదీదేనని, ఆయనకు కృతజ్ఞత చూపాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఆయనతో పాటు బీజేపీ పెద్దల సహకారంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని అన్నారు.



కాళోజీ కళాక్షేత్రంలో కృష్ణ మాదిగ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం



- నేటి నుంచే మూడు నెలల కోటా సన్న బియ్యం పంపిణీ
- మొత్తం డిమాండ్ 12,900 మెట్రిక్ టన్నులు
- ఇప్పటికీ పూర్తి స్థాయిలో రేషన్ షాపులకు చేరని కోటా
- సరఫరా ప్రక్రియలో అధికారుల వైఫల్యం
- ఒకేసారి బియ్యం సేకరణపై లబ్ధిదారుల ఆశలు
- ఆ మేరకు జరగని ఏర్పాట్లు.. తలపట్టుకుంటున్న డీలర్లు

'సన్న'ద్ధత ఏదీ..?

హనుమకొండ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): జూన్, జూలై, ఆగస్టు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడానికి తలపెట్టిన ప్రక్రియ గందరగోళంగా మారింది. మూడు నెలల ఉచిత రేషన్ బియ్యం కోటాను జూన్ 1 నుంచి లబ్ధిదారులకు అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఈ మేరకు సంపూర్ణంగా ఏర్పాట్లు జరగలేదు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయలేదు. ఒకవైపు జూన్ 1వ తేదీ వచ్చేసినా సన్న బియ్యం పంపిణీపై స్పష్టత లేకపోవడంతో అటు లబ్ధిదారులు, ఇటు రేషన్ డీలర్లలో అయోమయం నెలకొంది. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం దశల వారీగా బియ్యం కోటా అందిస్తామని చెబుతున్నారు. మరోవైపు లబ్ధిదారులు మూడు నెలల బియ్యం అందే వరకు రేషన్ షాపుల చుట్టూ తిరగాల్సిందేనా? అనే సందిగ్ధతకు గురవుతున్నారు.

అధికారుల వైఫల్యం

వర్షాలు ఇతరత్రా పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని 3నెలల ఉచిత బియ్యాన్ని ఒకేసారి లబ్ధిదారులకు అందించనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఈ క్రమంలో ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు. జూన్ నుంచి పంపిణీ చేపట్టాలని స్పష్టం చేశారు. కొద్దిరోజులుగా జిల్లా అధికార యంత్రాంగం దీనిపై కసరత్తు చేపట్టింది. మూడునెలల సన్నాల బియ్యం జిల్లా కోటా సేకరణ, రవాణా, స్టాక్ పాయింట్లు, రేషన్ షాపులకు తరలింపు తదితర అంశాలపై సమీక్షలు జరిపింది. కానీ ఈ మేరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు జరగలేదు. జూన్ మాసం వచ్చేసింది. బియ్యం పంపిణీకి సన్నద్ధత సంపూర్ణంగా లేకపోవడంతో సమస్యలు నెలకొననున్నాయి. ఈ విషయాన్ని అధికారులే నర్మగర్భంగా చెబుతున్నారు.

12,900 మెట్రిక్ టన్నుల బియ్యం

హనుమకొండ జిల్లాలో మొత్తం 2,31, 516 రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ మేరకు నెలకు 4,300 మెట్రిక్ టన్నుల చొప్పున మూడు నెలల బియ్యం డిమాండ్ 12,900 మెట్రిక్ టన్నులు.

ఇంత పెద్ద మొత్తంలో బియ్యం పంపిణీ కావడం ఇదే తొలిసారి. ఈ క్రమంలో జిల్లా అధికారులు ముందు నుంచే పకడ్బందీగా చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రణాళిక మేరకు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండగా ఇప్పటికీ గందరగోళంగానే ఉండడం గమనార్హం.

రేషన్ షాపులకు చేరని కోటా

హనుమకొండ జిల్లాలో మొత్తం 424 రేషన్ షాపులున్నాయి. అయితే వీటిలో ఇప్పటికీ 70 శాతం షాపులకు బియ్యం కోటా పంపిణీ కాలేదు. వాస్తవానికి ప్రతీనెల 30వ తేదీలోగా రేషన్ షాపులకు పౌర సరఫరాల శాఖ బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉంది. ఎందుకంటే 1 నుంచి 20 తేదీలోగా రేషన్ షాపులు లబ్ధిదారులకు బియ్యాన్ని పంపిణీ చేస్తాయి. అయితే ఈసారి మే 31వ తేదీ వరకు కూడా 70 శాతం షాపులకు బియ్యం సరఫరా కాకపోవడం గమనార్హం. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తామని ప్రభుత్వం చెప్పడం, మరోవైపు ఇంకా రేషన్ షాపులకు బియ్యమే సరఫరా కాకపోవడంతో సమస్య తీవ్రతరమైంది. మరోవైపు అధికారలేమో బియ్యం పంపిణీ చేస్తామని, దశలవారిగా పంపిణీ ప్రక్రియ ఉంటుందంటున్నారు. కానీ జూన్ 1వ తేదీ నుంచే లబ్ధిదారులు రేషన్ షాపుల వద్దకు పరిగెత్తే పరిస్థితి. క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయి.

లబ్ధిదారుల ఆశలు

మూడు నెలల బియ్యం పంపిణీ లబ్ధిదారుల్లో ఆశలు పెంచాయి. ఒక కుటుంబంలో నలుగురు లబ్ధిదారులుంటే ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున నెలకు 24 కిలోల బియ్యం అందుతాయి. మూడు నెలల కోటా మొత్తంగా 72 కిలోల బియ్యం ఒకేసారి లబ్ధిదారులు పొందాల్సి ఉంటుంది. ఈ తరుణంలో ఇంత పెద్దమొత్తంలో.. అందునా సన్నబియ్యం కావడంతో లబ్ధిదారుల్లో ఆశలు, ఆనందం నెలకొంది. అయితే అధికారులు

మిగతా 8వ పేజీలో...

'మేడారం' ఈవోగా

వీరస్వామి



వరంగల్ కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మేడారం మహా జాతర కార్యనిర్వాహణాధికారిగా వీరస్వామి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత అధికారి రాజేంద్రం శనివారం ఉద్యోగ విరమణ పొందడంతో వీరస్వామిని నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయ శాఖ ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వీరస్వామికి అదనంగా మేడారం ఈవో బాధ్యతలు అప్పగించారు. వరంగల్‌లోని ధార్మిక భవనంలో ఈ నూతన బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు. ఈ మేరకు బాధ్యతలను వీరస్వామి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఉపాధ్యక్షుడు కాక సారయ్య పూజారులు కాక వెంకటేశ్వర్లు సిద్దబోయిన స్వామి దేవాదాయ శాఖ అధికారులు క్రాంతికుమార్, రాజేశ్వర్‌రావు, రమాదేవి, నర్సింహులు, అద్దంకి నాగేశ్వర్‌రావు, వెంకటయ్య, రత్నాకర్‌రెడ్డి, ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు కవిత, అనిల్‌కుమార్‌తోపాటు జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, తనుగుల రత్నాకర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ఇదేక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన రాజేంద్రాన్ని దేవాదాయశాఖ అధికారులు పూజారులతో కలిసి శాలువాను కప్పి పుష్పగుచ్ఛం అందజేసి వీడ్కోలు పలికారు.

మల్లంపల్లి.. ఇకపై జేడీ మల్లంపల్లి

గెజిట్ విడుదల చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ



ములుగు, మే 31(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో నూతనంగా ఏర్పడిన మల్లంపల్లి మండలాన్ని జేడీ మల్లంపల్లిగా ధృవీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు మల్లంపల్లి మండలాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ జడ్పీ చైర్మన్ దివంగత నేత కుసుమ జగదీష్ పేరిట జేడీ మల్లంపల్లిగా మార్చినందుకు మంత్రి సీతక్కకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్ష నాయకుడని చూడకుండా రాజకీయాలకు అతీతంగా కుసుమ జగదీష్ పేరిట మండలాన్ని ఏర్పాటు చేసినందుకు మల్లంపల్లి మండల సాధన సమితి సభ్యులు మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచుదాం..

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్
- ఏకశిల పార్కు వద్ద కార్మిక సంఘాలతో కలిసి ధర్నా

హనుమకొండ టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచుతామని ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ అన్నారు. కార్మిక మాసోత్సవాలలో భాగంగా హనుమకొండ బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ స్మృతివనం ఏకశిలపార్కు వద్ద వివిధ కార్మిక సంఘాలతో కలిసి ధర్నా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలపై నిప్పులు చెరిగారు. కార్మికుల సంక్షేమాన్ని కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వేలాది మంది చిరు వ్యాపారుల కుటుంబాలను మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు వేధించడాన్ని ఆపేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్‌శాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్నప్పుడు వీధి వ్యాపారులకు అనేక రుణాలను, వెండింగ్ జోన్లను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. నాడు తెచ్చిన చిరు వ్యాపారుల రక్షణ చట్టాన్ని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. సంఘటిత, అసంఘటిత కార్మికులకు సామాజిక, ఆర్థిక భద్రతలు కల్పించడంతోపాటు వారికి ఈఎస్ఐ సదుపాయాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ కేటాయించిన 2,600 గజాల స్థలంలో కార్మిక భవన నిర్మాణం చేపట్టాలని అన్నారు. ఆటో కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు యేటా రూ.12వేల నగదు భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన ఆటో కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. జూన్ 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో ప్రతీ ఒక్క కార్మిక సంఘం, ప్రతీ కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగ్, సోడా కిరణ్, కార్యక్రమ కన్వీనర్ నాయిని రవి, మల్లేశం, శ్రీధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్మిక సంఘాలతో కలిసి ధర్నా చేస్తున్న దాస్యం వినయభాస్కర్




పీడిత జన పక్షపాతి డీవీ

7

- తెలంగాణ సాయుధ పోరాట యోధుడు
- కమ్యూనిస్టు పార్టీ తొలితరం నేత
- 17 ఏళ్లు అజ్ఞాతవాసం గడిపిన నాయకుడు
- కమ్యూనిస్టు సిద్ధాంతకర్త, రచయిత
- పోరుగల్లుకు వన్నెతెచ్చిన ఉద్యమ శిఖరం
- నేడు జయంతి

- ప్రైవేటు పాఠశాలల్లో ఖరీదుగా మారిన విద్య
- పుస్తకాలు, ఫీజులు, అడ్మిషన్ల పేరిట దందా
- నియంత్రించలేకపోతున్న విద్యాశాఖ
- అమలుకు నోచుకోని జీవో నెంబరు 91
- ఆందోళనలో పేద, మధ్య తరగతి కుటుంబాలు



మొదలైన ఫీ'జులుం'

వర్ధన్నపేట రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు చదివింపుల కార్యక్రమం మొదలైంది. జూన్ 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ మాసం నుంచే ఖర్చు తడిసి మోపెడు కానుంది. పుస్తకాల మోత పిల్లలకు, పైసల మోత తల్లిదండ్రులకు ప్రారంభం కానుంది. పేద, మధ్య తరగతి కుటుంబాలు పిల్లల ఫీజులు కట్టలేక, వ్యవసాయానికి పెట్టుబడులు సర్దుకోలేక అల్లాడిపోతున్నారు. ఇదే మాసంలో ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభం కావడంతో ఇటు విత్తనాలకు, అటు పిల్లల చదువులకు అప్పులు చేయడం షరా మామూలుగానే ఉంటుంది.

ఇష్టారాజ్యంగా ఫీజులు

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. రూ.వేలకు వేలు డొనేషన్లు, అడ్మిషన్ల పేరిట వసూలు చేయడంతో పాటు రూ.లక్షల్లో ఫీజులు, పుస్తకాలు, నోట్ బుక్కులు, బూట్లు, టైలు, బెల్టుల పేరుతో నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలనే నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఏటా ఫీజుల భారం పెరిగిపోతోంది. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వపరంగా ఎలాంటి అజమాయిషీ లేకపోవడంతో యాజమాన్యాలు నిలువు దోపిడీ చేస్తున్నాయి. ఏ ప్రైవేటు పాఠశాల చూసినా.. ఎల్‌కేజీ విద్యార్థికి ఏడాదికి రూ.10 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. పైగా ఆ పాఠశాలలోనే బట్టలు, టైలు, బెల్టులు, వారు చెప్పిన పుస్తకాలు, నోట్ బుక్కులు తీసుకోవాలని, లేదా వారు సూచించిన బుక్‌స్టాల్‌లోనే కొనాలని నయా దందాకు తెర లేపనున్నారు. కొన్ని పాఠశాలలు ఏకంగా స్కూల్‌లోనే అన్నీ అమ్మేస్తున్నాయి. ఇవన్నీ కలుపుకుని ఒక్క ఎల్‌కేజీ విద్యార్థిని బడికి పంపించాలంటే ఫీజులు కాక మరో రూ.5వేలు చేతిలో పట్టుకోవాల్సిందే. ఇక సీబీఎస్ఈ, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, టెక్నో, ఈ టెక్నో అంటూ ఒక్కో తరగతికి ఒక్కోలా ఫీజులు వసూలు చేస్తున్నారు. పదో తరగతి చదివే విద్యార్థికే ఇప్పుడు రూ.లక్షకు పైగా ఫీజు గుంజుతున్నారు. ఇక అడ్మిషన్ ఫీజులు, సాంస్కృతిక కార్యక్రమాలు, పరీక్ష రుసుములు, పాఠశాల అభివృద్ధి, క్యాలెండర్లు, క్రీడల పేరిట వేలాది రూపాయాలు వసూలు చేస్తున్నారు. దీంతో ఒక కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు ఉంటే వారి పరిస్థితి మరీ ఆగమ్యగోచరంగా తయారైంది.

జీవో నెంబర్ 91 ఏం చెబుతోంది..

ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేయకుండా ప్రభుత్వం 2014లో జీవో నెంబరు 91ని జారీ చేసింది. ఈ జీవో ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలు మాత్రమే ఫీజులు తీసుకోవాలని అంతకు మించి తీసుకోవద్దని నిర్ణయించారు. గడిచిన పదేళ్లలో ఈ జీవో ఎక్కడా అమలు కాకపోవడం విశేషం. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకునేందుకుగాను ప్రతీ పాఠశాలలో పేరెంట్స్ కమిటీని విధిగా ఏర్పాటుచేయాలి. సమావేశాలు నిర్వహిస్తే పాఠశాల లోపాలు బయటపడతాయనే భయంతో సమావేశాలను మూకుమ్మడిగా పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఫీజులను కూడా పేరెంట్స్ కమిటీ నిర్ణయించిన మేరకే వసూలు చేయాలి. కమిటీలు మనుగడలో లేకపోవడంతో యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..

మామిడి జ్ఞానేశ్వర్, డీఈవో వరంగల్



ప్రైవేటు పాఠశాలలు ఫీజులు అధికంగా వసూలు చేసినా, పాఠశాలల్లోనే పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అమ్మినట్లు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అర్హతలేని ఉపాధ్యాయులతో బోధన చేపించినా ఊరుకోం. పాఠశాల గుర్తింపు సైతం రద్దుచేయడానికి వెనకాడం. దీనిపై తల్లిదండ్రులు నేరుగా మాకు ఫిర్యాదు చేయవచ్చు.

జూన్ వచ్చే.. ఖర్చులు తెచ్చే..
సగటు జీవికి దబిడి దిబిడే..

- స్కూల్ ఫీజుల మోత.. చేబదుళ్ల కోసం తంటాలు
- సీజనల్ వ్యాధుల భయం.. ఆస్పత్రుల పాలైతే అంతే..
- ఒక వైపు శుభకార్యాలు.. బడ్జెట్ భారంతో గుండె దిగాలు

6

రాజనీతిశాస్త్రంలో నరేశ్‌గౌడ్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్, మే 31 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం పరిశోధకుడు తాళ్లపల్లి నరేశ్‌గౌడ్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శనివారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ నరేశ్‌గౌడ్‌కు డాక్టరేట్ ప్రకటించారు 'స్టేట్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్- ఏ స్టడీ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్టు ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు నరేశ్‌గౌడ్ డాక్టరేట్ పొందారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగం ప్రొఫెసర్ పోరిక సమ్మూలాల్ పర్యవేక్షణలో నరేశ్‌గౌడ్ పరిశోధన పూర్తి చేశారు. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం షాపల్లికి చెందిన నరేశ్‌గౌడ్ అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో విలువైన పరిశోధన పత్రాలను ప్రచురించారు. డాక్టరేట్ సాధించిన నరేశ్‌గౌడ్‌ను పాటు పలువురు అభినందించారు.

టూరిజంలో సరస్వతికి..



కేయూ క్యాంపస్, మే 31 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ చరిత్ర, టూరిజం విభాగం పరిశోధకురాలు బి.సరస్వతి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శనివారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ సరస్వతికి డాక్టరేట్ ప్రకటించారు 'హిస్టోరికల్ మూమెంట్స్ డ్యూరింగ్ నిజాం పీరియడ్ ఇన్ తెలంగాణ- ఏ కేస్ స్టడీ ఫర్ టూరిజం డెవలప్‌మెంట్' అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను సరస్వతి డాక్టరేట్ పొందారు. కేయూ హిస్టరీ, టూరిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ పి.సదానందం పర్యవేక్షణలో సరస్వతి పరిశోధన పూర్తిచేశారు. కాజీపేట ప్రాంతంలోని వెంకటాద్రినగర్ చెందిన సరస్వతి పరిశోధన పత్రాలను ప్రచురించారు. డాక్టరేట్ సాధించిన సరస్వతిని కేయూ సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, సరస్వతి భర్త మదరి ప్రవీణ్‌కుమార్‌తో పాటు పలువురు అభినందించారు.

టీడబ్ల్యూజేఏ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకన్న




వడ్డెపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్(టీడబ్ల్యూజేఏ) రాష్ట్ర కమిటీ ఎన్నిక శనివారం హనుమకొండలోని ఓ ప్రైవేటు సమావేశ మందిరంలో జరిగింది. టీడబ్ల్యూజేఏ రాష్ట్ర అధ్యక్షుడిగా హనుమకొండకు చెందిన బానోత్ వెంకన్న నాయక్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ భగవాన్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అడ్వయిజర్‌గా మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా బాదావత్ బాలాజీ నాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజావత్ రవినాయక్, కోశాధికారిగా తేజావత్ భీముడు నాయక్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా లావుడ్య రాము నాయక్, బూర్క యాదగిరి, నన్నబోయిన లక్ష్మణ్ దొర, రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా దేవరాజు ఏకాంబరం, బానోత్ వెంకన్న, ఇస్లావత్ రవీందర్‌తో పాటు రాష్ట్ర మహిళా కన్వీనర్‌గా ప్రియ, కోకన్వీనర్‌గా కల్యాణిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వెంకన్న నాయక్ మాట్లాడుతూ.. ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

జూన్ వచ్చే.. ఖర్చులు తెచ్చే..

హనుమకొండ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): జూన్ మాసం వచ్చేసింది. ఇక సగటు జీవికి ఆర్థిక దబిడి దిబిడే. పిల్లల స్కూల్ ఫీజులు తలుచుకుంటే ఫీజులు ఎగిరిపోయే పరిస్థితి. అంతేనా.. యూనిఫామ్, పుస్తకాలు ఇతరత్రా అవసరాల కొనుగోలు లెక్కలు వేసుకుంటునే గుండె బరువెక్కించే ఆర్థిక భారం. ఏటా జూన్ మాసం వచ్చేస్తుందంటే నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు కంటికి నిద్ర పట్టదు. గుండెకు నెమ్మది ఉండదు. జూన్‌లో పాఠశాలలు తెరుచుకుంటున్నాయి. స్కూల్ ఫీజులు ఎంత?, యూనిఫామ్స్ ఖర్చు ఎంత అవుతుంది?, బిడ్డలకు కొత్తగా ఈ సారి యూనిఫామ్ కొనుగోలులాంటి ఖర్చులతో సతమతం అవుతున్నారు.

సగటు జీవికి దబిడి దిబిడే..

స్కూల్ ఫీజులు..



జూన్‌లో ప్రధానంగా సగటు మనిషిని ఆర్థికంగా కుదిపివేసే అంశం పిల్లల స్కూల్ ఫీజులు. ఫీజు ఒక్కటే కాదు.. యూనిఫామ్స్ కొనుగోలుకు సైతం వేలల్లోనే ఖర్చు భరించాల్సి వస్తోంది. ఇక కొన్ని పాఠశాలలు పుస్తకాలను కూడా విక్రయిస్తున్నాయి. మార్కెట్ ధరలతో సంబంధం లేకుండా వాత పెడుతున్నాయి. అనివార్యంగా తల్లిదండ్రులు అధిక ధరలను భరించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితే. ఇక రవాణా సౌకర్యం కోసం స్కూల్ బస్సుల ఫీజు మోత. ఇవన్నీ లెక్కలు వేసుకునే సగటు జీవికి జూన్ మాసంలో దబిడి దిబిడే.

చేబదుళ్ల కోసం తంటాలు

పిల్లల ఫీజుల కోసం రెండు చేతుల సంపాదన ఉన్న కుటుంబాలు సైతం చేబదుళ్లు, వడ్డీకి రుణాలు తీసుకునే పరిస్థితే నెలకొంది. ముఖ్యంగా ప్రైవేటు స్కూల్ ఫీజుల విషయంలో నర్సరీలోనే రూ.35వేలకు పైగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక కొంచెం పేరెన్నిక పాఠశాలలో అయితే ఫీజులు సగటు జీవికి పెనుభారంగానే మారాయి. ఇద్దరు పిల్లలకు ఫీజులు చెల్లించాల్సి వస్తే లక్ష రూపాయలకు పైగానే జూన్‌లో సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. వీటికి తోడు ఇతరత్రా ఖర్చులు ఉండనే ఉన్నాయి. ఈ క్రమంలో నిరుపేద, మధ్య తరగతివర్గాలు చేబదుళ్లు, వడ్డీకి అప్పులు తీసుకునే పరిస్థితులు జూన్ మాసంలో అధికంగా ఉంటున్నాయి. అయితే చదువుల ఫీజులు నియంత్రిస్తామంటూ ప్రభుత్వం షరా మామూలుగానే చెప్పే మాటలు నీటి మూటలుగానే మారుతోంది.

సీజనల్ వ్యాధుల భయం

నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు సీజనల్ వ్యాధుల ఖర్చులను కూడా జూన్ మాసం బెంబేలెత్తించనుంది. వర్షాలు కురుస్తుంటే చల్లదనంతో పాటు ఆ వెంటే రోగాల ఖర్చులు వచ్చిపడతాయనే భయం పట్టేస్తోంది. జూన్ మాసంలో రోగాలకు సైతం వేలల్లోనే ఖర్చు చేయాల్సి ఉంటుందని సగటు జీవులు ఆందోళనకు గురవుతున్నాయి. ఆస్పత్రుల ఖర్చులు ఊహించుకుంటూనే గుండె బరువెక్కిపోయే పరిస్థితి ఉందంటూ ఆవేదన చెందుతున్నాయి.

శుభకార్యాల ఖర్చు భారమే..

జూన్ మాసం శుభకార్యాలకు కూడా అనువుగా ఉండడంతో ఈ అంశం భారమే అంటున్నాయి నిరుపేద, మధ్య తరగతి వర్గాలు పెళ్లిలు ఇతనరరత్రా కార్యక్రమాలు నిర్వహణ, వెళ్లాల్సి వచ్చినా లోటు బడ్జెట్‌తో దిక్కుతోచని స్థితే అంటున్నాయి.

ఎంతగా రాజీ పడినా..

జీవితంతో ఎంతగా రాజీపడినా జూన్ మాసం చేసే ఆర్థిక వికటాట్ట హాసంతో సగటుజీవి అతలాకుతలం అవుతున్నాడు. చివరకు ఇంట్లో ఉదయం పూట టిఫిన్, టీ, వీకెండ్ సెలబ్రేషన్స్‌ను త్యాగం చేసినా లోటు బడ్జెటే అంటూ సామాన్యవర్గాలు అసంతృప్తికి గురవుతున్నాయి. మొత్తంగా జూన్ మాసం సగటు జీవుకి ససేమిరా ఇష్టం లేనిదేగా మారింది.

రాణాలో మహిళ ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట పోలీస్ స్టేషన్ ఓ వివాహిత శనివారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే. నర్సింహులపేట మండల కేంద్రం శివారు పిచ్చిరాంతండాకు చెందిన భూక్య వినోదతో ములుగు జిల్లా మాన్‌సింగ్‌తండాకు చెందిన నూనావత్ నరేందర్‌తో నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. వీరి దాంపత్య జీవితం కొంత కాలం సజావుగా సాగినప్పటికి ఏడాది కాలంగా ఇద్దరి మధ్యమనస్పర్థలు ఏర్పడి తరుచుగా ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో పలు మార్లు పంచాయతీలు నిర్వహించారు. వారిద్దరు విడిపోవడానికి ఇష్టపడడంతో పెద్ద మనుషులు ఒక రీతిలో ఒప్పందం కుదిర్చారు. ఒప్పుకున్న డబ్బు ల్లో రూ.లక్ష వద్ద భార్యాభర్తల మధ్య అంగీకారం కుదరకపోవడంతో వినోద నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఆమె మౌఖికంగా చెప్పారే తప్ప ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. అయినప్పటి పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి ఆమెకు న్యాయం చేద్దామని ప్రయత్నించారు. ఈ క్రమంలో భర్త నరేందర్ అంగీకరించకుండా అక్కడి నుంచి వెళ్లి పోవడంతో మనస్థాపానికి గురైన వినోద పోలీస్‌స్టేషన్‌లోనే తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగేందుకు యత్నించింది. గమనించిన పోలీసులు అప్రమత్తమై పురుగుల మందు డబ్బా లాక్కొని బాధితురాలు వినోదను 108 వాహనంలో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై నర్సింహులపేట ఎస్సై సురేష్‌ను వివరణ కోరగా భార్యాభర్తల మధ్య అనేక సంవత్సరాలుగా తగవులున్నాయని వెల్లడించారు. బాధితురాలు వినోద ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, మౌఖికంగా చెప్పడంతో తాము కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. భర్త నరేందర్ వినకుండా వెళ్లి పోవడంతో వినోద క్షణికావేశంలో పురుగులు మందు తాగేందుకు యత్నించిందని, వెంటనే 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించామని వివరణ ఇచ్చారు.



మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత వినోద

మగ్గం వర్క్స్, టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, మే 31(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ మహిళలకు జర్దోషి మగ్గం వర్క్స్, టైలరింగ్‌లో 31 రోజుల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు భారతీయ స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ బాస రవి తెలిపారు. వరంగల్ రూరల్, హనుమకొండ, ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 18 నుంచి 45 ఏళ్లలోపు కలిగిన మహిళలు అర్హులని తెలిపారు. జూన్ 9వ తేది నుంచి ప్రారంభంకానున్న శిక్షణ తరగతులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూన్ 9లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం, కోర్స్ మెటీరియల్‌తోపాటు శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులకు యోగ్యతా సర్టిఫికెట్ కూడా ఇస్తామన్నారు. ఇతర వివరాలకు భారతీయ స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సంస్కృతి విహార్, టీటీడీసీ హసన్‌పర్తి, వరంగల్ జిల్లా 9704056522, 9849307873, 6281260878, 9949108934 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

భద్రకాళి అమ్మవారి రాజ గోపురానికి భూమి పూజ

వరంగల్ కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన భద్రకాళి అమ్మవారి దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగా మరో అడుగు ముందుకు పడింది. ఇప్పటికే కొనసాగుతున్న అమ్మవారి మాఢ వీధుల నిర్మాణంతోపాటు నూతనంగా రాజగోపాపురాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ఈ నెల 5న భూమి పూజ చేయాలని నిర్ణయించారు. వీటితోపాటు నిత్య అన్నదాన సత్రం, ఈవో కార్యాలయం, వేద పాఠశాల నూతన భవన నిర్మాణంతోపాటు అర్చక కుటీరాల నిర్మాణానికి భూమి పూజ చేయాలని దేవస్థాన అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నెల 5న గురువారం రోజున జరిగే భూమి పూజ కార్యక్రమానికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్‌తోపాటు పలువురు హాజరు కానున్నట్లు తెలిసింది.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాజీపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లిలోని చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని కాజీపేట పోలీసులు శనివారం కనుగొన్నారు. సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని వెలికితీసి వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు చెప్పారు. ఎవరైనా గుర్తించినట్లయితే కాజీపేట పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఐదు జిల్లాల్లో రూ.540 కోట్ల పొదుపు నిధులు

సంఘాల్లోని రుణాల వివరాలు ఆన్‌లైన్‌లో.. ● రుణాలు తీసుకున్న వారికి ఎస్ఎంఎస్‌లు ● సహకార వికాస సంస్థ కోశాధికారి రేవతి

భీమదేవరపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మహిళా, పురుష పొదుపు సంఘాల్లోని ఐదు జిల్లాల్లోని సభ్యులకు రూ.540 కోట్ల పొదుపు నిధులు ఉన్నాయని సహకార వికాస సంస్థ కోశాధికారి ఎర్రబెల్లి రేవతి అన్నారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు జాన ప్రవీణ్ ఆధ్వర్యంలో 25వ వార్షిక సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆర్థిక లావాదేవీలను సమితి గణకులు నీలం భిక్షపతి, రాజ్‌కుమార్ చదివి వినిపించారు. అనంతరం రేవతి మాట్లాడుతూ.. కరీంనగర్, హనుమకొండ, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో 570 మహిళా, పురుషుల పొదుపు సంఘాలు ఉన్నాయన్నారు. వీటిలో 2.70 లక్షల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. రూ.540 కోట్ల ఆర్థిక లావాదేవీల నిధులు ఉన్నాయన్నారు. ఇక నుంచి సభ్యులు తీసుకున్న రుణాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామన్నారు. అలాగే ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా సభ్యులు తీసుకున్న రుణాలను ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించే వ్యవస్థను రూపొందిస్తున్నామని చెప్పారు. ఈసందర్భంగా సంఘాల్లో డిజిటల్ లావాదేవీలు నిర్వహించాలని వివిధగ్రామాలకు చెందిన సభ్యులు కోరారు.

సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాజిరెడ్డి మాట్లాడుతూ.. 1990లో పొదుపు ఉద్యమం చేపట్టామన్నారు. నేడు పొదుపు ఉద్యమాల్లో రూ.500 కోట్లకు పైగా నిధులు జమ కావడం తమకు ఎంతో సంతృప్తిని ఇస్తోందన్నారు. 25వ వార్షికోత్సవాలను పూర్తి చేసుకొని సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నందుకు పలువురు సమితి అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. సమితి అధ్యక్షుడిగా జాన ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా నల్లగోని రమేష్, సమితి-2 అధ్యక్షుడిగా నరాల తిరుపతిరెడ్డి, సల్వాల సురేందర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు జాన ప్రవీణ్, కొత్తకొండ సమితి అధ్యక్షుడు గాజుల సతీష్, వ్యవస్థాపక అధ్యక్షుడు రాజిరెడ్డి, సహకార వికాస సంస్థ డీవో సుమలత, డీఏ ఈశ్వర్, సమితి ఉపాధ్యక్షుడు దొంతరవేణి రవీందర్, పాలకవర్గ సభ్యులు నాయిని తిరుపతి, నరాల తిరుపతిరెడ్డి, రమేష్, కుమారస్వామి, సురేందర్, మురళి, ధర్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, స్వామి, ప్రభాకర్, మురళీకృష్ణ, సంపత్‌రెడ్డితో పాటు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సహకార వికాస సంస్థ కోశాధికారి రేవతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులంతా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తూ విద్యార్థులకు విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి సూచించారు. హనుమకొండ భీమారంలోని స్కిల్‌స్టోర్క్ స్కూల్లో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు నిబద్ధులై ఉండాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో ఎ.శ్రీనివాస్, ఉపాధ్యాయులు విజయ్‌మోహన్, మధుసూదనరెడ్డి, భద్రయ్య, ప్రసాద్, అజయ్, అలీ, శశికళాధర్, శివకుమార్, సంపత్, శీను, విద్యానంద్, రవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన ఓహెచ్ఈ వైరు

పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం



డోర్నకల్,మే 31 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌జిల్లాలోని డోర్నకల్-గార్ల రైల్వే స్టేషన్ల మధ్య ఎగువలైన్‌పై ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ (ఓహెచ్ఈ) వైరు తెగిపడడంతో పలు రైళ్ల రాకపోకలకు శనివారం సాయంత్రం అంతరాయం ఏర్పడింది. దీంతో తిరుపతి నుంచి ఆదిలాబాద్ వెళ్లే కృష్ణాఎక్స్‌ప్రెస్‌ను గంటకు పైగా డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. ఓహెచ్ఈ సిబ్బంది టవర్‌కార్‌తో వెళ్లి మరమ్మతులు నిర్వహించిన అనంతరం రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి. రైళ్లు ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

కేడీసీలో రెండో విడత దోస్త్ అడ్మిషన్లు

కేయూ క్యాంపస్, మే 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్‌లో మే 30 నుంచి జూన్ 8 వరకు రెండో విడత దోస్త్ ఆన్‌లైన్ ప్రక్రియలో అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం శ్రీనివాస్ తెలిపారు. బీఏ హెచ్‌ఈపీ, ఈపీపీ, హెచ్‌పీపీ, కంప్యూటర్ సైన్స్, సైకాలజీ, జర్నలిజం, బీకాం కంప్యూటర్స్, బ్యాంకింగ్ సర్వీసెస్, బిజినెస్ అనలైటిక్స్, బీబీఏ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ ఆపరేషన్స్, బీసీఏ, బీఎస్సీ ఎంపీసీ డాటాసైన్స్, హానర్స్, ఎలక్ట్రానిక్స్, స్టాటిస్టిక్స్, జియాలజీ, ఇంగ్లీష్ మీడియం కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. దోస్త్‌లో జూన్ 8వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని కేడీసీకి వెబ్ అప్షన్లు ఇవ్వాలని విద్యార్థులను కోరారు. కళాశాలలో అడ్మిషన్లపై ఏదైనా సందేహాలు ఉంటే కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ ఎం.రవికుమార్ సెల్ 99633-10073 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టీచర్ల సర్దుబాటు ప్రక్రియను వెనక్కి తీసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి): టీచర్లను సర్దుబాటు చేయాలంటూ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తామంటూనే పాఠశాలల్లో ఉపాధ్యాయులను కుదించేందుకు ఉత్తర్వులు జారీ చేయడాన్ని వారు తప్పుబట్టారు. ఉపాధ్యాయుల సర్దుబాటుతో ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమయ్యే ప్రమాదముందని వారు పేర్కొన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గడంవల్ల ప్రతీ సబ్జెక్టులో విద్యాబోధన జరగదని తెలిపారు. పాఠశాలలు ప్రారంభం కాకముందే ఎలా సర్దుబాటు చేస్తారని వారు ప్రశ్నించారు. విద్యార్థుల ప్రవేశాలను, సంఖ్యకు అనుగుణంగా మాత్రమే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో డీటీఎఫ్ నుంచి ఎ.శ్రీనివాస్‌రెడ్డి, జి.ఉప్పలయ్య, కె.శ్రీనివాస్, టీపీటీఎఫ్ నుంచి ఎన్. తిరుపతి, జి.సత్యనారాయణ, ఎం.రఘుపతి, కుమారస్వామి, లక్ష్మయ్య, రమేష్, భిక్షపతి, సదానందం, భాస్కర్ ఉన్నారు.

పదేళ్లలో సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదు

- మేం వచ్చాక 17,169కోట్ల కేటాయింపు
- గిరిజనుల హక్కులు కాపాడేలా నల్లమల్ల డిక్లరేషన్ ఇచ్చాం: భట్టి విక్రమార్క
- గిరిజనుల హక్కులను రక్షించాలి: మీనాక్షి

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ సర్కారు గిరిజనుల కోసం సబ్‌ప్లాన్ నిధులను ఏ మాత్రం ఖర్చు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.17,169కోట్లను కేటాయించామని డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసానిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కాంగ్రెస్ తెలంగాణ ఆదివాసీ కార్యకర్తల సమ్మేళనం ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో సబ్‌ప్లాన్ నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గిరిజనుల అవసరాలేంటో తెలుసుకునేందుకు ఆ వర్గాలకు చెందిన నాయకులను ఒకచోట చేర్చి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. అడవి బిడ్డలు ఆత్మగౌరవంతో జీవించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర జల గిరిజన వికాస పథకం తీసుకొచ్చిందని వెల్లడించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు నల్లమల్ల డిక్లరేషన్ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నాటరాజన్ మాట్లాడుతూ.. గిరిజనుల చట్టాలను, హక్కులను పరిరక్షించి వారిని అన్నిరంగాల్లో ముందు వరుసలో నిలపాలన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ పరిరక్షించినప్పుడే వారు అభివృద్ధిలో ముందుకు వెళ్తారని, దీనికోసం కాంగ్రెస్ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. పోడు భూముల్లో సాగు చేసుకుని జీవనం సాగించేందుకు అడవి బిడ్డలకు ఆర్థికంగా చేయూతనందించాలనిసూచించారు. పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం రూ.కోట్లాది నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాడు ఇందిరాగాంధీ నుంచి ఇప్పటి సోనియాగాంధీ వరకు గిరిజనుల అభివృద్ధికోసం,వారిని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు.


పాల్వంచలో ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న భట్టి

ప్రభుత్వ పనితీరుపై మీనాక్షి ఆరా

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మీనాక్షి నటరాజన్ శనివారం పాల్వంచలోని జెన్కో అతిథిగృహంలో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ ఒక్కో ఎమ్మెల్యేతో వేర్వేరుగా మాట్లాడి.. వారి నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో ఆయా ఎమ్మెల్యేలు ప్రభుత్వ పని తీరు బాగానే ఉందని, రుణమాఫీ, రైతు బంధు పథకం అందరికీ అందలేదన్న వ్యతిరేకత కొంత ఉందని ఆమె వివరించినట్టు తెలిసింది.

కొందరు బీజేపీ సీనియర్లతో కేసీఆర్‌కు సంబంధాలు



- ఆ కారణంగానే పార్టీ అధ్యక్ష పదవి నుంచి బండిని తప్పించారు
- గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పిన వారే బీజేపీ అభ్యర్థులు: మహేశ్ గౌడ్

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని, కొందరు బీజేపీ సీనియర్ నాయకులతో కేసీఆర్‌కు సంబంధాలున్నాయని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ సంబంధాల కారణంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించారన్నారు. రేపో.. మాపో.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని గురుకుల పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మహేశ్ గౌడ్ మాట్లాడారు. 'బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పినట్టే గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పినట్టుగానే బీజేపీ తమ అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి తెలంగాణలో పునాదులు లేవు.. ఆ పార్టీ ఇక్కడ అధికారంలోకి రావడం కలే.. రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉంది. అన్ని వర్గాల ప్రజలకు చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పార్టీ బలోపేతమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వల్ల.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తప్పనిసరిగా కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది' అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్.. ఒక్కటేనని బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని కొట్టిపారేశారు. బండి సంజయ్ మాటలను ప్రజలు నమ్మడం లేదని, ఆయన ఇంకా యువ మోర్చా నాయకుడిలా మాట్లాడటం సరికాదన్నారు.

అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధే లక్ష్యం: కేటీఆర్

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతమని, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో ప్రాగ్మటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్) నాలెడ్జ్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దిగ్గజ కార్పొరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలందించడం గర్వకారణం అన్నారు. పెట్టుబడులు వచ్చి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు దొరకాలని, అందుకోసం సర్వశక్తులు ఉపయోగిస్తామని చెప్పారు.

కేసీఆర్‌కు నోటీసులంటే.. తెలంగాణకు ఇచ్చినట్లే

ఆయనపై ఈగ వాలినా ఊరుకోం.. కాళేశ్వరం కమిషన్ నోటీసులకు వ్యతిరేకంగా 4న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

- జాగృతి నూతన కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. తెలంగాణ జాతిపిత అని, ఆయనకు నోటీసులు ఇవ్వడమంటే యావత్తు తెలంగాణకు నోటీసులిచ్చినట్లేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్‌పై ఈగ వాలినా తాము ఊరుకోబోమని హెచ్చరించారు. కేసీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఒక కన్ను అయితే.. తెలంగాణ జాగృతి మరో కన్ను అని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసం సమీపంలో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని కవిత ప్రారంభించారు. కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించిన అనంతరం బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోదావరి జలాల్లో 200 టీఎంసీల హక్కు తెలంగాణకు ఉండాలని కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని తెలిపారు. "కాళేశ్వరం ద్వారా ఏటా 20 లక్షల ఎకరాలకు నీళ్లు అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా? కోటి ఎకరాల మాగాణంగా తెలంగాణను చేసినందుకు నోటీసులు ఇచ్చారా ? రైతు బీమా, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టినందుకు ఇచ్చారా? తెలంగాణ ప్రజలకు మేలు చేసినందుకు ఇచ్చారా? అది కాళేశ్వరం కమిషనా? లేక కాంగ్రెస్ కమిషనా?"అని కవిత ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం పట్ల ప్రతి తెలంగాణ బిడ్డ బాధపడుతున్నారని అన్నారు.

నీళ్లు తరలించుకుపోతుంటే మాట్లాడరేం?

ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ నీళ్లను తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం అంత బలహీనంగా ఎందుకున్నారని, పక్క రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఎందుకు పనిచేస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నదుల అనుసంధానాన్ని తుపాకులగూడెం నుంచి చేపట్టేలా ప్రతిపాదించారని, కానీ.. ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకుండా ఇచ్చంపల్లి నుంచి చేపడతామని చెప్పిందని అన్నారు. కానీ, ఇప్పుడు పోలవరం నుంచి 200 టీఎంసీల గోదావరి నీళ్లను తరలించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. జూన్ 2 నాడు సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కనీసం జై తెలంగాణ అనకపోవడం మన ఖర్మ అని, తెలంగాణ గ్రహచారం బాగాలేక రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని కవిత వ్యాఖ్యానించారు. జై తెలంగాణ అనని వారికి, అమరవీరులకు నివాళులర్పించని వారికి సీఎం కుర్చీలో కూర్చొనే అర్హత లేదన్నారు. ఇప్పటికైనా రేవంత్ జై తెలంగాణ అనాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పిడికిలెత్తి బయటికి వస్తేనే తెలంగాణ వచ్చిందని, దానివల్లే ఇవాళ అధికారంలో ఉన్నామన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఆ విషయాన్ని మరిచిపోయి కేసీఆర్‌కు నోటీసులివ్వడం దారుణమన్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం ప్రారంభిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం పేరు మార్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు ఎటువంటి సంబంధంలేని రాజీవ్‌గాంధీ పేరు పెట్టడం సరికాదన్నారు. అమరులు శ్రీకాంతచారి, యాదిరెడ్డి, ప్రజాకవి కాళోజీ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టాలని సూచించారు. రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఆమోదించిన బీసీ బిల్లులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా తాత్సారం చేస్తోందని కవత మండిపడ్డారు. ఇటీవల ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి కలిసిన సమయంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడారు తప్ప.. బీసీ బిల్లు మీద మాట్లాడలేదని ఆరోపించారు. బీసీ బిల్లును డీప్ ఫ్రిడ్జ్‌లో పెట్టే ప్రయత్నం చేస్తే బీజేపీకి సెగ తాకేలా పోరాటం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి పోరాటం చేస్తుందని అన్నారు.


జాగృతి కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న కవిత

జాగృతి కమిటీల ఏర్పాటు..

మైనారిటీల హక్కుల కోసం కూడా జాగృతి పోరాటం చేస్తుందని కవిత ప్రకటించారు. జాగృతిలో మైనారిటీల హక్కుల కోసం ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ విభాగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాగృతి తరఫున ఎస్సీ ఎస్టీ విభాగాన్ని ఏర్పాటు చేసి ఆ వర్గాల కోసం ఉద్యమిస్తామన్నారు. అయితే, తాము పోరాటాలు చేస్తుంటే కొంతమంది ఓర్వడం లేదన్నారు. తెలంగాణ కోసం బీజేపీ నాయకులు మాట్లాడకపోవడం దారుణమని, 8మంది ఎంపీలను గెలిపించినా కేంద్రం నుంచి రూపాయి తీసుకురాలేదని విమర్శించారు. గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను కాపాడకపోతే తెలంగాణ జాగృతి పవర్ చూపిస్తామన్నారు. కాగా, తెలంగాణ జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీరావును నియమిస్తున్నట్లు ఆ కార్యాలయం తెలిపింది.

బీజేపీతో పొత్తు ఉంటుందని ఏమార్చారు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లోకి.. వచ్చినప్పుడల్లా కేసీఆర్ ఇదే చెప్పారు: సంజయ్



కరీంనగర్, మే 31(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీలోని చాలా మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లోకి వచ్చారని.. అలా జరిగిన ప్రతిసారీ కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమై కమలంతో పొత్తు పెట్టుకుంటామని చెప్పి వారిని కాషాయ గూటికి రాకుండా చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ అంటేనే అవినీతి పార్టీ అని, కవితను అరెస్టు చేయకుండా ఉండటానికి బీజేపీతో కలవడానికి బీఆర్ఎస్ ప్రయత్నించిందని చెప్పారు. కుటుంబ పార్టీని తాము దగ్గరకు రానివ్వలేదని తెలిపారు. శనివారం కరీంనగర్‌లో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్, హరీశ్‌రావు భేటీ విషయం తెలియదని, ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అని తెలిపారు. కవిత విషయంలోనూ అదే డ్రామా నడుస్తోందని చెప్పారు కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నిర్మాణ దర్శకత్వంలో కవిత పాత్రధారిగా చార్‌పత్తా సినిమా నడుస్తోందన్నారు. కవిత ఎపిసోడ్‌తో ప్రజలకు మేలు జరుగుతుందా..? అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై చర్చ జరగకుండా చిట్‌చాట్‌ల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర జరుగుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ముమ్మాటికీ దేశద్రోహమే అని సంజయ్ అన్నారు. సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా, పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి, కాళేశ్వరం ప్రాజెక్టు, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫాంహౌస్, ఫార్ములా-ఈ రేసు కేసుల విషయంలో అరెస్టులు ఉంటాయని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నాయని, వాళ్లెన్ని కుట్రలు చేసినా అది జరగదని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయ పరిధిలో 18 గోవులు చనిపోవడంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని సంజయ్ అన్నారు.

పీడిత జన పక్షపాతి దేవీ


తొలి తరం కమ్యూనిస్టు నేత, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరు, జనం నుంచి వచ్చిన అసలు సిసలు జన నేత దేవులపల్లి వెంకటేశ్వర్ రావు(డీవీ). తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో చూపించారు. 40 ఏళ్లకుపైగా కమ్యూనిస్టు ఉద్యమాల్లో పని చేసిన అనుభవం అందులో 17 ఏళ్ల అజ్ఞాత జీవితం ఆయన సొంతం. కమ్యూనిస్టు పార్టీ సెక్రటేరియల్ సభ్యుడు. నల్లగొండ జిల్లా పార్టీ కార్యదర్శిగా పని చేశారు. 1951 వరకు జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి గుండెలాంటి నల్లగొండ జిల్లా పార్టీ సారథిగా అటు పోరాటంలోనూ, ఇటు సిద్ధాంత చర్చల్లోనూ అగ్రభాగాన నిలిచారు. నేడు (జూన్ 1) దేవులపల్లి వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

హనుమకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): దేవులపల్లి వెంకటేశ్వర్ రావు 1917 జూన్ 1న మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో జన్మించారు. జనగామతో పాటు నల్లగొండ జిల్లాతో ఆయన ఉద్యమ జీవితం ఎక్కువగా పెనవేసుకుపోయింది. సంపన్న భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. బాల వితంతువైన రంగమ్మను వివాహం చేసుకున్నారు. దేవులపల్లి ప్రాథమిక విద్యాభ్యాసం నల్లగొండ జిల్లా చందుపట్ల సమీపంలోని తిరుమలగిరి, నామవరం గ్రామాల్లో, మాధ్యమిక విద్య సూర్యాపేట, హైస్కూల్ చదువు వరంగల్‌లో సాగింది. ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్నందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరణకు గురికావడంతో జబల్పూర్ వెళ్లి అక్కడ బీఏ డిగ్రీ పూర్తి చేశారు. అక్కడే జాతీయోద్యమం, కమ్యూనిస్టు సాహిత్యంతోనూ పరిచయం ఏర్పడింది.

17 ఏళ్లు అజ్ఞాత జీవితం

జబల్‌పూర్ నుంచి స్వగ్రామానికి తిరిగి వచ్చిన తర్వాత 1939లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అప్పటికే నిజాం పాలనలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉంది. హైదరాబాద్‌లో కామ్రేడ్స్ అసోసియేషన్ నిర్మాతల్లో ఆయన ప్రథములు. 1941-51 మధ్య ఉద్యమం సాయుధ పోరాట రూపం తీసుకున్న సమయంలో నల్లగొండ జిల్లా పార్టీ బాధ్యతలు చేపట్టారు. పోరాట విరమణ తర్వాత 1957లో నల్లగొండ నియోజకవర్గం నుంచి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆయన తన మొత్తం వ్యవసాయ భూములను కౌలుదారులకే ఇచ్చేశాడు. 1962, 1964లో డిటెన్యూగా, 1970లో నాగిరెడ్డి కుట్ర కేసులో ముద్దాయిగా జైలు జీవితం గడిపారు. కుట్ర కేసులో నాలుగు సంవత్సరాలు జైలుశిక్ష పడగా బెయిల్‌పై బయటకు వచ్చారు. తెలంగాణ సాయుధ పోరాటం కాలం 8 సంవత్సరాలు, నక్సల్బరీ పోరాట కాలంలో 9 సంవత్సరాలు అజ్ఞాతవాసం గడిపారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో కేంద్ర కమిటీ సభ్యుడిగా, సీపీఎం నుంచి విడిపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ విప్లవ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా, అనంతర కాలంలో భారత విప్లవకారుల సమైక్యతా కేంద్రం కేంద్ర కమిటీ కార్యదర్శిగా పని చేశారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు
కమ్యూనిస్టు పార్టీ తొలితరం నేత
17 ఏళ్లు అజ్ఞాతవాసం గడిపిన నాయకుడు
కమ్యూనిస్టు సిద్ధాంతకర్త, రచయిత
పోరుగల్లుకు వన్నె తెచ్చిన ఉద్యమ శిఖరం
నేడు దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు జయంతి


దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు

తొలితరం నేత

కమ్యూనిస్టు పార్టీకి తొలితరం నేతగా ప్రాముఖ్యత పొందారు. నాటి ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమానికి నాయకత్వం వహించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో నాయకత్వ స్థానంలో ఉన్నారు. నాడు గ్రామాల్లో భూస్వాముల దోపిడి, దైర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు జరిపించారు. ఆనాడు భూస్వాముల నుంచి భూములను స్వాధీనం చేసుకొని ప్రజలకు పంచిపెట్టడంలో ఆయన పాత్ర గణనీయం. కమ్యూనిస్టు ఉద్యమం కష్టాల పాలైనప్పుడు సిద్ధాంతపరంగా వెన్నుదన్నుగా నిలిచారు. ఒక కుట్ర కేసులో జైలు జీవితం గడిపారు. తన కేసును తానే వాదించుకున్నారు. 400 పేజీల ప్రకటనను జడ్జి ముందు చదివారు. ఆయన జీవితాంతం నీతి, నిజాయితీ, నిరాడంబర జీవితానికి నిక్కచ్చిగా నిలిచారు. జనగామ ప్రాంతంలో చెదిరిన ఉద్యమాన్ని సాయుధ పోరాట దశకు చేర్చి, బెదిరిన ప్రజలను వీరయోధులుగా తీర్చిదిద్ది ఏనాడు శత్రువు చేతికి చిక్కకుండా పోరాట ప్రాంతాల్లో, సాయుధ దళాలతోనే ఉన్నారు. అడుగడుగునా పార్టీలోని మితవాదుల కుట్రలను ఎదిరించారు. రజాకార్లకే కాకుండా యూనియన్ సైన్యాలను సైతం మూడేళ్లకుపైగా ముప్పుతిప్పలు పెట్టిన పోరాటానికి మార్గదర్శిగా నిలిచారు.

రచయితగా..

దేవులపల్లి కలం నుంచి 'మా భూమి' వంటి అనేక నాటకాలు, కళారూపాలు, రచనలు, పాటలు, బుర్రకథలు వెలువడ్డాయి. 1983-84లో దేవులపల్లి కలం నుంచి జాలువారిందే 'తెలంగాణ ప్రజల సాయుధ పోరాట చరిత్ర'. తెలంగాణ పోరాట చరిత్రను ఆయన ఇందులో సవివరంగా గ్రంథస్తం చేసినా మొదటి భాగమే అందుబాటులోకి వచ్చింది. జనగామ ప్రజల వీరోచిత పోరాటం, హైదరాబాద్ కౌల్దారీ చట్టం అనే పుస్తకాలు రాశారు. సాయుధ పోరాట కాలం నాటి, అంతకన్న రెండు, మూడు దశాబ్దాలకు పూర్వం ఉన్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు, జన జీవన స్థితిగతులను వివరించే సాధికారత కలిగిన ఏకైక ప్రామాణిక గ్రంథం ఇది. 1968లో పోరాట ఉద్యమానికి పునాదులు వేయండి అన్న సుదీర్ఘమైన సర్క్యులర్‌ను విడుదల చేశారు. తక్షణ కార్యక్రమం పేరుతో తిరిగి విప్లవోద్యమాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకతను గుర్తు చేశారు. దీని ఫలితంగానే 1975లో భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యత కేంద్రం ఏర్పడింది. ప్రొలిటేరియన్ పాత్, సంకేతం, జనశక్తి పత్రికల ద్వారా దేశంలో కమ్యూనిస్టు విప్లవకారుల్లో పొడచూపిన అతివాద, మితవాద పెడధోరణులకు వ్యతిరేకంగా తరిమెల నాగిరెడ్డితో కలిసి ఆయన చేసిన పోరాటం అద్వితీయం. 1984 జూలై 12న ఆయన గుండెపోటుతో చనిపోయారు.


లొంగిపోయిన మావోయిస్టులను మీడియాకు చూపుతున్న పోలీసులు

8 మంది మావోల లొంగుబాటు

» రూ.25 వేల చొప్పున రివార్డులు » అందించిన ఎస్పీ శబరీష్

ములుగు, మే 31 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ ఎదుట 8 మంది మావోయిస్టు సభ్యులు లొంగిపోయారు. లొంగిపోయిన వారి వివరాలను ఎస్పీ శబరీష్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డివిజినల్ కమిటీ సభ్యుడు దోర్పెట్టి మిర్గు అలియాస్ లింగ, ఏరియా కమిటీ సభ్యురాలు మడవి టిడో అలియాస్ రామె, ఏరియా కమిటీ సభ్యుడు మిడియం భీమా, పార్టీ సభ్యురాలు ఉయిక అనిత, పార్టీ సభ్యుడు మడకం కమలేష్, పార్టీ సభ్యురాలు సోయం భీమే, సీఎన్ఎం సభ్యుడు మడవి మడక అలియాస్ గుడ్డు, వికాస్ కమిటీ సభ్యుడు మదవి ఇడుము అలియాస్ భాస్కర్‌లు ఉన్నారని ఎస్పీ వెల్లడించారు. వీరికి రూ. 25వేలు అందించామని తెలిపారు. లొంగి పోయిన వారి కోసం వారి పేరు మీద ఉన్న రివార్డు సొమ్మును లొంగిపోయిన 24 గంటల్లో బ్యాంకు డీడీ రూపంలో అందజేస్తున్నామని, వారికి ఆరోగ్యపరమైన సమస్యలు ఉంటే వైద్య చికిత్స చేయిస్తున్నామని, పునావాసం కోసం ప్రభుత్వం నుంచి సహకారం అందేలా చూస్తున్నామని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి కథనంపై ఎస్పీ వివరణ

మే 30న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'చిట్టీ.. చిక్కింది' కథనంపై ములుగు జిల్లా ఎస్పీ శబరిష్ వివరణ ఇచ్చారు. ఆమె పేరు చిట్టి కాదని.. ఐతె మడవి అని అన్నారు. మే 17న లొంగిపోయిన మావోయిస్టుల్లో ఒక సభ్యురాలి ఫొటోను డిస్‌ప్లే చేసి చూపించారు. ఐతె మడవి లొంగిపోయి చాలా రోజులు అవుతుందని, ఆమెను వారి తల్లిదండ్రులకు అప్పగించామని వివరించారు. కాగా మడకం కీడోకు, మడవి ఐతేకు ఎలాంటి సంబంధం లేకపోయినా పోలీసులు వివరణ ఇవ్వడంపై జిల్లాలో తీవ్ర చర్చ జరుగుతుంది. మరి లొంగిపోయింది మడవి ఐతెనా... లేక మడకం కీడోనా.. అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. ఒకవేళ పోలీసులు ధ్రువీకరించింది మడవి ఐతె అయితే మరి చిట్టీ అలియాస్ మడకం కీడో వివరాలు ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

ఏటూరునాగారం ఇసుక క్వారీలో వసూళ్ల దందా!

- ఒక్కో లారీ నుంచి రూ. 200 చొప్పున వసూలు
- వేబ్రిడ్జి వద్ద అక్రమాలు, నిబంధనలకు తూట్లు
- టీజీఎండీసీ అధికారుల నిర్లక్ష్యంపై ఆరోపణలు

ఏటూరునాగారం, మే 31 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇసుక క్వారీలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇసుక లోడింగ్ చార్జీల పేరిట క్వారీ నిర్వాహకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు లారీ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. రూ. 1,400 నుంచి రూ. 2,000 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు.

బయటపడ్డ అక్రమాల వీడియో

క్వారీ నిర్వాహకులు లోడింగ్ చార్జీల పేరుతో డబ్బులు తీసుకుంటున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వీడియోలో క్వారీ సిబ్బంది లారీ డ్రైవర్ నుంచి డబ్బులు వసూలు చేస్తున్న దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమేనని, ప్రతీ లారీ నుంచి ఇలాగే వసూళ్లకు పాల్పడుతున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీజీఎండీసీ అధికారుల నిర్లక్ష్యం

ఇసుక లోడింగ్ కోసం నిర్దిష్ట చార్జీలున్నా, క్వారీ నిర్వాహకులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన టీజీఎండీసీ (తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోందని డ్రైవర్లు మండిపడుతున్నారు.

వే బ్రిడ్జి వద్ద మామూళ్లు

ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామంలో ఉన్న వే బ్రిడ్జి వద్ద అక్రమ వసూళ్ల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఇసుక లారీల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతుండటంతో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అక్రమ వసూళ్లతో పాటు, వేబ్రిడ్జి వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యలు వాహనదారులు, ప్రజలకు సమస్యగా మారాయి.

అలాగే వే బ్రిడ్జి వద్ద ఇసుక బరువును తూకం వేసి, అందుకు సంబంధించిన చార్జీలు మాత్రమే వసూలు చేయాలి. అయితే, చిన్నబోయినపల్లి వేయింగ్ బ్రిడ్జి వద్ద క్వారీ నిర్వాహకులు, అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ప్రతీ లారీ నుంచి రూ. 200 నుంచి రూ. 300 వరకు లాగుతున్నారు. డబ్బులు ఇవ్వకపోతే లారీలను అడ్డుకొని బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు చెబుతున్నారు.


లారీ డ్రైవర్ నుంచి డబ్బులు వసూలు చేస్తున్న క్వారీ నిర్వాహకుడు

ప్రభుత్వ ఆదాయానికి గండి

టీజీఎండీసీ అధికారులు తమ బాధ్యతలను విస్మరించి, వసూళ్ల దందాకు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపణలున్నాయి. క్వారీ నుంచి ఇసుక లోడ్ చేసుకుని వెళ్లే ప్రతి లారీ నుంచి అదనంగా వసూలు చేస్తున్నారని డ్రైవర్లు వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ వసూళ్లతో సామాన్య ప్రజానీకంతో పాటు నిర్మాణ రంగానికి నష్టం వాటిల్లుతోంది. క్వారీ నిర్వాహకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, టీజీఎండీసీ అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపించాలని లారీ డ్రైవర్లు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వ్యాధుల నివారణకు ప్రణాళిక సిద్ధం చేయాలి

వరంగల్ మెడికల్, మే 31 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య అన్నారు. వర్షాకాల వ్యాధుల నివారణపై శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. దోమలు పుట్టకుండా, కుట్టకుండా ఎలా చూసుకోవాలో, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, ఈగల ద్వారా వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించాలన్నారు. మంగళవారం, శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు, డాక్టర్ నరేశ్, మలేరియా నోడల్ పర్సన్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలి

- జూన్ 6 నాటికి నిర్మాణాలు ప్రారంభం కావాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య


కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. కలెక్టరేట్‌లో శనివారం ఇందిరమ్మ ఇళ్లు, లబ్ధిదారుల ఎంపిక, పొజిషన్ సర్టిఫికెట్లు, రెవెన్యూ సదస్సులు, రాజీవ్ యువ వికాసం, టూబీహెచ్‌కే ఇండ్లు, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం పథకంపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాపెల్లి బాలరాజు, ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి గృహ నిర్మాణ శాఖ డీఈ సిద్ధార్థనాయక్, జిల్లాలోని ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతికి సంబంధించిన వివరాలను ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు.

అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకంలో మొదటి దశలో రూ. 50వేలు, రూ.లక్షలోపు రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను జూన్ 9నాటికి పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మండలస్థాయిలో పూర్తిచేసిన తర్వాత ఆ జాబితాను సబ్సిడీ రుణాల మంజూరు నిమిత్తం జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సమర్పించనున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి పైలెట్ గ్రామాలలో ప్రారంభమైన ఇండ్ల నిర్మాణాల పనులను వేగంగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం కాబట్టి ప్రతీ నియోజకవర్గానికి సంబంధించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ప్రొసీడింగ్ పత్రాలు ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందజేస్తారని, వెంటనే లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు వైవీ గణేష్, మేన శ్రీను, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


నక్కలగుట్టలోని డీఆర్ఎఫ్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న మేయర్

డీఆర్ఎఫ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మేయర్ గుండు సుధారాణి » డీఆర్ఎఫ్ కార్యాలయం తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని డీఆర్ఎఫ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. సిబ్బందితో కలిసి కార్యాలయంలోని బోట్లు, పరికరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో చెట్లు కూలిపోవడం, పాత భవనాలు నేలమట్టం అవుతాయని, వెంటనే అక్కడికి వెళ్లి డీఆర్ఎఫ్ సిబ్బంది సేవలందించాలన్నారు. అనంతరం అక్కడి నర్సరీలో పెంచుతున్న రకరకాల మొక్కల గురించి అడిగి తెలుసుకున్నారు. మొక్కల లెక్కలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, కావడం జరుగుతుందని, సీపీ రవీంద్రరాడేకర్, ఈఈలు రవికుమార్, మాధవీలత, ఏసీపీ రజిత, రాజ్‌కుమార్, టీపీఎస్ రోజారెడ్డి పాల్గొన్నారు.

'సన్న'ద్ధత ఏదీ ?

(5వ పేజీ తరువాయి)

మాత్రం పకడ్బందీ ఏర్పాట్లు చేయకపోవడంతో లబ్ధిదారులకు ఇక్కట్లు తప్పేలా లేవు. ఒకేసారి షాపు వద్దకు వెళ్లి మూడు నెలల బియ్యాన్ని పొందే పరిస్థితి ఇప్పటివరకైతే లేదు. ఇందుకోసం లబ్ధిదారులు పలుమార్లు షాపుల వద్దకు వెళ్లాల్సి వచ్చే అవకాశాలే ఉన్నాయి.

తల పట్టుకుంటున్న డీలర్లు

సన్నబియ్యం మూడు నెలల కోటా పంపిణీపై జిల్లా అధికారులకు దిశా, నిర్దేశం కరువైంది. అధికారులు సమీక్షలు జరిపినా ప్రణాళికల మేరకు ఏర్పాట్లు జరగలేదు. ఇక బియ్యం పంపిణీలో కీలకంగా ఉన్న రేషన్ డీలర్లను సైతం అధికారులు పట్టించుకోలేదు. డీలర్లతో సమీక్ష సమావేశాలే జరుపలేదు. వారి అభిప్రాయాలు, ఎదురయ్యే సమస్యలను పరిగణనలోకి తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడు నెలల బియ్యం కోటా రేషన్ షాపుల్లో నిల్వ ఉంచుకోవడం అసాధ్యంగా మారింది. ఒకే షెటర్ దుకాణంతో రేషన్ షాపులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బియ్యం నిల్వలు డీలర్లకు సమస్యలు తెచ్చే అంశమే. ప్రత్యామ్నాయ మార్గాలను డీలర్లే చూసుకోవాలని అధికారులు చెప్పి చేతులు దులుపేసుకుంటున్నారు. అంతేకాదు.. పెద్దమొత్తంలో బియ్యం రవాణా కూడా ఇబ్బందిగానే పరిణమించింది. ఈ మేరకు వాహనాల సమకూర్పు, ట్రిప్పులు, లోడింగ్, అన్ లోడింగ్, నిల్వలు ఇత్యాది విషయాలన్నింటిపై ప్రణాళికలు లోపభూయిష్టంగా ఉండడంతో బియ్యం పంపిణీ అన్ని వర్గాలకు సమస్యలు తెచ్చేదిగా మారిందనే విమర్శలు నెలకొన్నాయి.

ఇది మాదిగ జాతికి దక్కిన గౌరవం

(5వ పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి సమాజంలోని అన్నివర్గాల ప్రజల అండ ఉందన్నారు. పద్మశ్రీ పురస్కారం రావడానికి అదే ప్రధాన కారణమన్నారు. వ్యక్తిగా పద్మశ్రీ పురస్కారం తనకే దక్కినప్పటికీ.. అది యావత్తు మాదిగ జాతికి దక్కిన గౌరవమేనని స్పష్టం చేశారు. 30ఏళ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రయాణం లో సమాజంలోని అన్నివర్గాలు సహకారం అందించడం వల్లే ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ధైర్యంగా నిలబడి ఎస్సీ వర్గీకరణను సాధించామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ స్వప్నాన్ని సాకారం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణ సాధించడం మాదిగ జాతి ఉద్యమ విజయమని కృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఓరుగల్లు బిడ్డగా ప్రయాణం మొదలుపెట్టి.. ప్రకాశం జిల్లాలో ఉద్యమానికి పునికిపుచ్చుకుని ఈ స్థాయికి చేరడానికి మాదిగ జాతి బిడ్డల త్యాగాలతోపాటు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, ఎంఎస్పీ జాతీయ నేత మందకుమార్ మాదిగ, రాష్ట్ర నాయకులు బొడ్డు దయాకర్, నరేంద్రబాబు, బొర్ర బిక్షపతి, బిర్రు సతీష్, పుట్ట రవి, గద్దల సుకుమార్, బండారి సురేందర్, పుట్ట బిక్షపతి, మంద రాజు, తెలంగాణ క్రాంతి దళ్ వ్యవస్థాపకుడు డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కేయూలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

కేయూ క్యాంపస్, మే 31 (ఆంధ్రజ్యోతి) : జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండా ఆవిష్కరణ వేడుకలు నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. జూన్ 2న ఉదయం 8 గంటలకు కేయూ పరిపాలన భవనం ఎదుట కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మువ్వన్నెల జెండాను ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. వర్సిటీ పరిపాలన అధికారులు, ఉద్యోగులు, స్కాలర్లు, విద్యార్థులు హాజరు కావాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం కోరారు.


మడికొండలోని విత్తన షాపును తనిఖీ చేస్తున్న పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు

నాణ్యమైన విత్తనాలు అందించాలి

మడికొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని విత్తన షాపులలో శనివారం పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అలాగే విత్తనాలను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, వ్యవసాయ శాఖ ఏడీఏ.రాజ్‌కుమార్, కాజీపేట మండల వ్యవసాయ అధికారి సంతోష్, ఎస్సై పెగడ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తూర్‌జెండా, చర్చి, మార్కెట్ బ్యాక్ సైడ్, తోటబడి బ్యాక్‌సైడ్, భగత్‌సింగ్ కాలనీ, గోపాల్‌రావు బిల్డింగ్, డబ్బాలు, హనుమాన్‌నగర్, ఏకశిల కళాశాల, యాదవనగర్, పాలజెండా, రెడ్డికాలనీ, బుద్ధనగర్ ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

'కేడీసీ కెమిస్ట్రీ అధ్యాపకులు ఆదర్శం'

కేయూ క్యాంపస్, మే 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు రాష్ట్రానికే ఆదర్శమని కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ బాలభాస్కర్‌లు అన్నారు. శనివారం కేడీసీ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వాసం శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన ఎంఎస్సీ కెమిస్ట్రీ ప్రవేశాల పరీక్షలకు ఉచిత కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ప్రేరణ, గైడెన్స్‌పై ఆన్‌లైన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేడీ బాలభాస్కర్ మాట్లాడుతూ.. కేడీసీ కెమిస్ట్రీ విభాగం నేతృత్వంలో 2013 నుంచి ఉచిత కోచింగ్ నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. అనేక మంది విద్యార్థులు ఉచిత కోచింగ్‌తో హెచ్‌సీయూ, ఓయూ, కేయూతో పాటు ఇతర రాష్ట్రాల్లోని వర్సిటీల్లోనూ సీట్లు సాధించారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కళాశాల విద్యార్థులు 470 మంది విద్యార్థులు ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారని వివరించారు. 40 రోజుల పాటు జరిగే కోచింగ్‌లో విద్యార్థులకు మోడల్ టెస్టులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సదస్సుకు సమన్వయకులుగా కేడీసీ కెమిస్ట్రీ హెడ్ వాసం శ్రీనివాస్, ఎడమ శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించగా పింగళి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి, డాక్టర్ బి.రమేశ్, డాక్టర్ సురేందర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ సోమిరెడ్డి, కోకన్వీనర్ డాక్టర్ వీరన్న, డాక్టర్ ఎం.విజయలక్ష్మి, డాక్టర్ బి.సంధ్యారాణి, ప్రసన్న, రమేశ్, డాక్టర్ అరుణ, డాక్టర్ దయానంద్, విద్యార్థులు అశ్రుత, రవిప్రఖ్య, రుబీనా, సుమ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 16.1 మి.మీ. వర్షం

హనుమకొండలో అత్యధికంగా 32.5 మి.మీ

హనుమకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో 24 గంటల్లో 16.1 మి.మీ. వర్షం పడింది. ఇది సాధారణ వర్షపాతం 0.5 మి.మీ. కన్నా 15.9 మి.మీ. ఎక్కువ. హనుమకొండ మండలంలో అత్యధికంగా 32.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. దామెర మండలంలో 28 మి.మీ., ఐనవోలులో 25.3 మి.మీ., వర్షం కురిసింది. భీమదేవరపల్లిలో 11.5 మి.మీ., ఎల్కతుర్తిలో 18 మి.మీ., కమలాపూర్‌లో 19.9 మి.మీ., హసన్‌పర్తిలో 12.5 మి.మీ., ధర్మసాగర్‌లో 10.7 మి.మీ., కాజీపేటలో 11.6 మి.మీ., పరకాలలో 17.1 మి.మీ., ఆత్మకూరులో 17.4 మి.మీ., శాయంపేటలో 12.5 మి.మీ., నడికూడలో 9 మి.మీ., వర్షపాతం నమోదైంది. వేలేరు మండలంలో వర్షపు జాడ లేదు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య


రమేష్ మృతదేహం

హనుమకొండ టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన మామిడిపెల్లి రమేష్ (28) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు సుబేదారి పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారంగా.. భార్యతో గొడవ పడిన రమేష్ మే 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. నోటి నుంచి వాసన వస్తుండగా కుటుంబసభ్యులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ మే 30న సాయంత్రం మరణించినట్లు వారు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మడికొండలో అగ్నిప్రమాదం

మడికొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): మడికొండలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఎస్సీ కాలనీకి చెందిన జన్ను అనసూర్య ఇంట్లో దేవుడి పటం వద్ద దీపం పెట్టింది. పక్కనే ఉన్న దుస్తులకు అంటుకుని ఇంట్లో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సై పెగడ రాజ్‌కుమార్, పోలీసు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ఇంట్లో చిక్కుకున్న అనసూర్యను బయటకు తీసుకువచ్చారు. అలాగే మంటలను ఆర్పివేసి ప్రమాదాన్ని తప్పించారు. సకాలంలో స్పందించిన ఇన్‌స్పెక్టర్, ఎస్సై, పోలీసులను స్థానికులు అభినందించారు.


మంటలు ఆర్పుతున్న పోలీసులు


టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని కలిసిన అర్షనపల్లి విద్యాసాగర్‌రావు

చంద్రబాబుకు అభినందనల వెల్లువ

వడ్డెపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించిన మహానాడులో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహానాడుకు హాజరైన వరంగల్ పార్లమెంట్ టీడీపీ కన్వీనర్ అర్షనపల్లి విద్యాసాగర్‌రావు తదితరులు చంద్రబాబు నాయుడిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

న్యాయం చేయాలి

వరంగల్ మెడికల్, మే 31 (ఆంధ్రజ్యోతి): తనకు జరిగిన అన్యాయంపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని బంధన్ హాస్పిటల్ బాధితుడు కృష్ణ వేడుకుంటున్నారు. గత సంవత్సరం బంధన్ ఆస్పత్రిలో తనకు అన్యాయం జరిగిందని పలు విభాగాల అధికారులను కలిసి ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్యులు వ్యాపార దృక్పథంలో సామాన్యుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అపెండిక్స్ సమస్యతో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యానని, ఆపరేషన్ సమయంలో పెద్దపేగుకు రంధ్రం పడి శరీరం మొత్తం ఇన్‌ఫెక్షన్ అయి పరిస్థితి విషమించిందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచారణ చేసి తనకు న్యాయం చేయాలని బాధితుడు కృష్ణ కోరారు.

రూ.1,18,850 విలువ చేసే గుట్కాలు సీజ్

వరంగల్ క్రైం (ఆంధ్రజ్యోతి): పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలో విక్రయిస్తున్న ప్రభుత్వ నిషేధిత గుట్కాలను శనివారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు బృందం పరకాల కూరగాయల మార్కెట్ సమీపంలోని పూరెల్ల సత్యం నివాసంలో సోదాలు చేయగా రూ. 1,18,850 విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన పొగాకు ఉత్పత్తులు గుట్కాలు పట్టుబడ్డట్లు పేర్కొన్నారు. నిందితుడు సత్యంను స్థానిక పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు.

తంబాకును వినియోగించొద్దు

బాలసముద్రం, మే 31 (ఆంధ్రజ్యోతి): తంబాకు వాడకం వల్ల ప్రతీ ఏటా లక్షలాది మంది క్యాన్సర్ వ్యాధి బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కె.అనితారెడ్డి అన్నారు. ప్రపంచ తంబాకు నిరోధక దినోత్సవం సందర్భంగా శనివారం ఆమె నగరంలోని ఆటోడ్రైవర్లకు, స్లమ్ ఏరియా వాసులను కలిసి అవగాహన కల్పించారు. ప్రభుత్వం, పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు, ఆరోగ్య నిపుణులు, ఉపాధ్యాయులు కలిసికట్టుగా పనిచేస్తేనే తంబాకు వాడకం నివారణ సాధ్యమవుతుందని ఆమె అన్నారు. ఇది కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాదని, సామాజిక బాధ్యత కూడా అని తెలిపారు. తంబాకు లేని సమాజం కోసం ప్రతిజ్ఞ పూనాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్బోధించారు. ఆరోగ్యకరమైన అలవాట్లతో ఎదిగి దీర్ఘకాలిక జీవితం గడపాలన్నారు. సంకల్పంతో ప్రతీ ఒక్కరు బాధ్యతగా మెలగాలని అన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

వరంగల్ కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో పనిచేసిన ప్రతీ ఉద్యోగికి చివరికి తప్పకుండా ఉద్యోగ విరమణ సహజమని ఆకాశవాణి వరంగల్ రేడియో స్టేషన్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి ఇల్లెందుల రవికుమార్ అన్నారు. శనివారం హనుమకొండలోని ఆకాశవాణి వరంగల్ రేడియో కేంద్రంలో సీనియర్ వాఖ్యాత అడవి రాజబాబు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్టేషన్ సిబ్బందితో పాటు ఆకాశవాణి వాఖ్యాతల సంఘం ఆధ్వర్యంలో రాజబాబుతో పాటు వారి సతీమణిని సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో అనిల్‌ప్రసాద్, నరేష్, ఉషశ్రీ, వెంకటరమణ, రామ్మూర్తి, శివశంకర్, విజయలక్ష్మి, రామ్మోహన్, వాఖ్యాతల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిరంజీవి, అర్షం సదానందం, కోశాధికారి శ్రీనివాస్‌శర్మ, ఎల్లయ్య, రామకృష్ణాచారి, నాగేశ్వర్‌రావు, చైతన్య, వాణి, పాల్గొన్నారు.


రాజబాబు దంపతులను సన్మానిస్తున్న ఆకాశవాణి ఉద్యోగులు

ఐదేళ్లుగా కంకర రోడ్డుపై ప్రయాణం

- అధ్వానంగా రెడ్డిపురం ప్రధాన రహదారి
- ఇద్దరు ఎమ్మెల్యేల పరిధిలో నిలిచిపోయిన రోడ్డు
- స్మార్ట్ సిటీ నిధులతో రోడ్డు వేయాలని ప్రజల డిమాండ్

వరంగల్ కార్పొరేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ యాదవనగర్ నుంచి రెడ్డిపురం ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఐదేండ్లుగా వాహనదారులు కంకరపై ప్రయాణిస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఇద్దరు ఎమ్మెల్యేల పరిధిలో ఉన్న ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోవడం లేదు. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతో సమీప కాలనీవాసులు తలా కొంత డబ్బును జమ చేసి రూ. 2.80 లక్షలతో ప్రధాన మార్గంపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. సుమారు 3 కి.మీ. పొడవునా 60 ఫీట్ల రోడ్డు కనీసం వంద మీటర్ల పొడవు కూడా సక్రమంగా ప్రయాణించే పరిస్థితి లేదు. ఐదు సంవత్సరాల క్రితం రోడ్డు నిర్మాణం కోసం రూ. 3 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. 1.5 పొడవునా కంకర పోసిన కాంట్రాక్టర్ బిల్లుల కోసం బల్దియా కార్యాలయం చుట్టూ తిరిగాడు. అప్పటి ప్రజాప్రతినిధులు కమిషన్ భారీగా డిమాండ్ చేయడంతో ఏటూరునాగారంనకు చెందిన కాంట్రాక్టర్ పనులు చేయలేనంటూ వెళ్లినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణ పనులకు అతీగతీ లేదు. బల్దియా ప్రజావాణిలో వందల సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కంకర పోసి వదిలేసిన రెడ్డిపురం రహదారి

జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నా అంతే..

ఆరెపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే 163 జాతీయ రహదారి నుంచి హనుమకొండ నగరానికి రావడానికి ఈ మార్గం ఒక్కటే దగ్గరగా ఉంటుంది. 60 ఫీట్ల రోడ్డు కావడంతో భారీ వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఉంటుంది. హనుమకొండ చౌరస్తాకు కూతవేటు దూరంలో రెడ్డిపురం రోడ్డు ఉన్నా కనీసం బల్దియా, ఆర్‌అండ్‌బీ అధికారులకు పట్టింపులేకుండా పోయింది. రెడ్డిపురం నుంచి డాక్టర్‌కాలనీ, లయోలకాలనీ, విజయలక్ష్మీకాలనీ, మైత్రినగర్, సాయినగర్, భగత్‌సింగ్ కాలనీ, కృష్ణకాలనీ, యాదవనగర్ వరకు ఈ రోడ్డు మార్గం మీదుగా నగరానికి ప్రజల రాకపోకలు సాగుతాయి. ఇక రాత్రి వేళల్లో ఇటుగా ప్రయాణం ప్రాణ సంకటంగా మారిందని కాలనీవాసులు చెబుతున్నారు. రహదారి గుంతలమయం కావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ పట్టించుకోవాలి

కలిమి మధుయాదవ్, లయోలకాలనీ వాసి



ప్రతీ సంవత్సరం మా కాలనీవాసులు క్రమం తప్పకుండా ప్రభుత్వానికి లక్షల్లో అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నాం. కానీ ప్రజాప్రతినిధులు, బల్దియా అధికారులకు మా సమస్య పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా వర్ధన్నపేట ఎమ్మెల్యే, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేతో పాటు స్థానిక కార్పొరేటర్ పట్టించుకుని ప్రధాన రహదారి సమస్యను పరిష్కరించాలి.

రోడ్డుపై కంకర ప్రమాదకరంగా మారింది

పసుల సంజీవ్‌కుమార్, డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు



ఐదు సంవత్సరాల క్రితం ఈ రోడ్డును నిర్మిస్తామని రోడ్డుపై కొంత దూరం కంకర పోసి వదిలివేశారు. ప్రస్తుతం కొత్త రోడ్డు కంకర తేలి ఉంది. పాత రోడ్డు అడుగులోతు గుంతలు ఏర్పడి ఉంది. ఇక్కడి సమస్యపై బల్దియా ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదు చేశాం. మేము చేసుకున్న పనులకు ఓ ఏఈ వర్క్ ఆర్డర్ తీసుకుని ప్రభుత్వం నుంచి బిల్లు కూడా తీసుకున్నాడు.



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా
విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఒన్ ఆఫ్ దెమ్ డేస్	హాలీవుడ్ మూవీ	జూన్ 04
జాట్	హిందీ చిత్రం	జూన్ 05
అమెజాన్ ప్రైమ్		
స్టోలెన్	హిందీ చిత్రం	జూన్ 04
జియో హాట్‌స్టార్		
మౌంటెన్ హెడ్	హాలీవుడ్ మూవీ	జూన్ 01
టూరిస్ట్ ఫ్యామిలీ	తమిళ చిత్రం	జూన్ 02
గజానా	హిందీ చిత్రం	జూన్ 02
దేవికా అండ్ డానీ	తెలుగు సిరీస్	జూన్ 06

వ్యాపార నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి నటుడిగా కొనసాగుతున్నారు శివబాలాజీ. రెండు దశాబ్దాలకు పైగా ఉన్న ఆయన కెరీర్‌లో చేసిన చిత్రాల సంఖ్య స్వల్పమే అయినా నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్'లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న **శివబాలాజీ** 'నవ్య'తో ముచ్చటించారు.

ఆ విషయంలో నేను లక్కీ

పాత్రల ఎంపికలో చాలా సెలెక్టివ్‌గా ఉంటున్న మీరు 'కన్నప్ప' చిత్రం చేయడానికి ప్రత్యేక కారణం?

అనుకోకుండా దొరికిన అవకాశం అది. నా క్యారెక్టర్ మొదట స్క్రిప్ట్‌లో లేదు. ఒకరోజు మోహన్‌బాబుగారు, విష్ణు, నేను భోజనం చేస్తుండగా సడన్‌గా 'శివ మన సినిమాలో ఎందుకు నటించడంలేదు?' అని మోహన్‌బాబు గారు అడిగితే 'శివ చేయతగ్గ పాత్ర ఇందులో లేదు నాన్నా' అని విష్ణు చెప్పారు. 'లేదు.. అతను మన సినిమాలో ఉండాలి' అన్నారు. ఆ టాపిక్ అంతటితో ఆగిపోయింది. మోహన్‌బాబు గారు 'కన్నప్ప'లో మహదేవశాస్త్రి పాత్ర పోషిస్తున్నారు. రెండు రోజుల్లో తన కొడుకు కుమారదేవ శాస్త్రి పాత్ర క్రియేట్ చేసి 'ప్రతి సీన్‌లో నువ్వు నా పక్కన ఉంటావు.. చెయ్యి' అని ఆదేశించారు. అటువంటి గొప్ప నటుడితో నటించే అవకాశం వచ్చింది. అందుకే ఇంకా ఏమీ ఆలోచించకుండా ఒప్పేసుకొన్నా.

మీరు పరిశ్రమలోకి వచ్చి 22 ఏళ్లయింది. కానీ నటించిన చిత్రాల సంఖ్య చాలా తక్కువ. ఎందుకలా?

నాకు ఇప్పటికీ ఏడాదికి ఐదారు చిత్రాల్లో అవకాశాలు వస్తున్నాయి. పారితోషికం బాగానే ఆఫర్ చేస్తున్నారు. కానీ డబ్బు కోసం మాత్రమే ఆలోచించి నిర్మాతకు నష్టం కలిగించలేను కదా! కథ నచ్చకపోతే నిర్మొహమాటంగా చెప్పేస్తాను. అలా నేను రిజెక్ట్ చేసిన కథలను వేరే వాళ్లతో తీస్తే అవి ఫెయిల్ అయ్యాయి. నేను రెండేళ్లకు ఒక సినిమా చేసినా, మంచి పారితోషికం, మంచి క్యారెక్టర్ దొరుకుతున్నాయి. సాధారణంగా ఇలా రెండేళ్లకో సినిమా చేస్తే జనం మరిచిపోతారని అంటుంటారు. కానీ నా విషయంలో అలా జరగడం లేదు. ఆ విషయంలో నేను లక్కీ.

కానీ సినిమాల సంఖ్య కూడా ముఖ్యమే కదా!

యాభై ఏళ్ల తర్వాత ఆ సంఖ్యను ఎవరు గుర్తు పెట్టుకుంటారు చెప్పండి! ప్రస్తుతం మనం హ్యాపీగా, కంఫర్ట్‌గా ఉన్నామా లేదా అనేది నాకు ముఖ్యం. చాలామంది సక్సెస్ సక్సెస్ అంటుంటారు కదా. నా దృష్టిలో సక్సెస్ అంటే హ్యాపీనెస్. మనం దేని కోసం పరిగెడుతుంటాం.. డబ్బు కోసం. డబ్బు దేనికి? హ్యాపీగా ఉండడానికి. నేను ప్రస్తుతం హ్యాపీగానే ఉన్నాను కదా. సంతోషాన్ని ఎలా వెదుక్కుంటామనేది మన చేతుల్లో ఉంది. దానికి గురించి ఎవరూ క్లాసెస్ చెప్పరు. మన చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలిస్తూ మన జీవన విధానాన్ని మార్చుకుంటు ముందుకు వెళ్లాలి. హ్యాపీగా ఉండాలి. అదంత ఈజీ కాదు, అలాగని కష్టమూ కాదు. ప్రతి రోజూ ఎందుకు టెన్షన్‌తో పరుగులు తీయడం? ఏముంది నీ చేతిలో.. అన్నీ ఇతరుల చేతుల్లో ఉంటాయి. రోజూ ఎవరో ఒకరిని కలవాలి.. తెలియని వాళ్ల దగ్గరకు వెళ్లి పరిచయం చేసుకోవాలి. కాకా పట్టాలి.. కబుర్లు చెప్పాలి... ఇవన్నీ నిజంగా నాకు తెలీదు. నా ఐడెంటిటీని చంపుకోవడం నాకు ఇష్టం లేదు. మరి నేను నేనుగా బతకాలి, హ్యాపీగా ఉండాలని ఆలోచించి నా మార్గాన్ని నేను వెదుక్కున్నా. మనం, ఫ్యామిలీ కంఫర్ట్‌గా ఉండాలంటే సొంత ఇల్లు, వీలైతే ఓ ఫామ్‌హౌస్, మంచి కారు.. ఇవన్నీ చాలు అనుకున్నా. సంపాదించుకున్నా. సంతోషంగా గడిపేస్తున్నా.



మీకు చాలా పొగరు.. అందుకే అవకాశాలు రావడం లేదని అంటారు!

'ఆర్య' చిత్రం చేసిన తర్వాత ఆ క్యారెక్టర్ నుంచి బయటకు రావడానికి చాలా టైమ్ పట్టింది. ఆ స్పీడ్, ఆ పొగరు లోపల అలాగే ఉండిపోయాయి. నేను ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడను. అందుకే పొగరు అనుకుంటారు. కానీ అది నిజం కాదు. నాకు సిగ్గు ఎక్కువ. కొత్తవాళ్లతో తొందరగా కలవలేను. దాన్ని కరెక్ట్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నా.

పరిశ్రమలో మీకు స్నేహితులు ఎవరు?

చాలా మంది ఉన్నారు కానీ మొదటి నుంచీ రాజీవ్ కనకాలతో అనుబంధం ఉంది. అలాగే సీనియర్ నరేశ్ చాలా క్లోజ్. మంచు విష్ణు మంచి స్నేహితుడు. మోహన్‌బాబుగారు గొప్ప స్నేహితుడు. హైదరాబాద్‌లో ఉంటే ప్రతి రోజూ ఆయన్ని కలుస్తా.

మీ పిల్లల గురించి చెప్పండి

మా పెద్దబ్బాయి ఇటీవల టెన్త్ పాస్ అయ్యాడు. 81 పర్సంట్ వచ్చింది. కానీ వాడికి అది చాల్లేదు. వచ్చే ఏడాది మరిన్ని మార్కులు సంపాదించుకుందాం అని నచ్చజెప్పా.. చదువు విషయంలో తనకు ఎవరెవరు హెల్ప్ చేశారో వారందరితో ఇటీవల ఓ గెట్ టు గెదర్ నిర్వహించాం. చిన్నోడు సిక్త్స్ క్లాస్ చదువుతున్నాడు.

మీ కొత్త సినిమాలు ఏమిటి?

ఆగస్టు నుంచి మోహన్‌బాబుగారు నిర్మించే చిత్రం మొదలవుతుంది. లీడ్ రోల్ నాదే. అద్భుతమైన సబ్జెక్ట్. అది కాకుండా మరో రెండు ప్రాజెక్టులు ఉన్నాయి. రెక్కీ 2 వెబ్ సిరీస్ త్వరలో మొదలవుతుంది. ఇంకో థ్రిల్లర్ సబ్జెక్ట్ రెడీ అవుతోంది.

● వినాయకరావు



సుమారు 300 ఏళ్ల క్రితం సాధారణ మనుషులు ఎలాంటి దుస్తులు ధరించేవారు? అవి ఏ రంగులో ఉండేవి? వాటిని ఎలా కుట్టేవారు? ఇలాంటివన్నీ ఆసక్తికరమైన ప్రశ్నలు. చారిత్రాత్మక సినిమాలు చూసినప్పుడు వాటికి సంబంధించిన కొన్ని సమాధానాలు లభిస్తాయి. ఈ నెల 12న విడుదల కాబోతున్న పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు' సినిమా కూడా ఈ కోవకు చెందినదే! ఈ సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా వ్యవహరించిన **ఐశ్వర్య**ను 'నవ్య' పలకరించినప్పుడు ఆమె అనేక అంశాలను వెల్లడించారు.

చిన్న తేడానైనా పసిగట్టేస్తున్నారు...



చారిత్రాత్మక సినిమాలకు దుస్తులను డిజైన్ చేయటం ఒక సవాలు కదా... మీరు ఈ ప్రాజెక్టును ఎలా చేపట్టారు?

గతంలో 'కంచె', 'గౌతమీపుత్ర శాతకర్ణి' మొదలైన చారిత్రాత్మక సినిమాలకు కూడా నేను డిజైనర్‌గా పనిచేశాను. వీటితో పాటుగా కొన్ని సీరియల్స్‌లోని పాత్రలకు కూడా దుస్తులు డిజైన్ చేశాను. అందువల్ల చరిత్రకు సంబంధించిన అంశాలపై నాకు అవగాహన ఉంది. చరిత్రను జాగ్రత్తగా గమనిస్తే.. ఆ సమయంలో ప్రజలు వేసుకొనే దుస్తులకు సంబంధించిన అనేక విషయాలు తెలుస్తాయి. ఇక ఈ ప్రాజెక్టు విషయానికి వస్తే- డైరక్టర్ క్రిష్ నాకు సినిమా కథ వివరించారు. ఆ తర్వాత కళ్యాణ్‌గారికి దుస్తులు డిజైన్ చేయాలని చెప్పారు. నాకు చాలా భయం వేసింది. ఎందుకంటే కళ్యాణ్‌గారు ఒక ట్రెండ్ సెట్టర్. అభిమానులు చాలా ఎక్కువ. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని దుస్తులు డిజైన్ చేయాలి. 16, 17 శతాబ్దాలలో దక్షిణ భారత దేశంలో వీరులు ఎలాంటి దుస్తులు వేసుకొనేవారనే విషయంపై కొంత అధ్యయనం చేశాం. వారు మామూలు సమయంలో ఎలా ఉండేవారు? యుద్ధాలకు వెళ్లేటప్పుడు ఎలాంటి దుస్తులు వేసుకొనేవారు? వాటిపై ఎలాంటి ఆభరణాలు పెట్టుకొనేవారు?లాంటి అనేక కోణాలలో ఆలోచించి కొన్ని స్కెచ్‌లు వేసుకున్నాం. వాటి ఆధారంగా దుస్తులు కుట్టించి కళ్యాణ్‌గారిపై ట్రయల్ వేశాం. మొదటి రోజు చిన్న చిన్న మార్పులతో అన్నింటికీ ఆయన ఓకే చెప్పేశారు. ఆ తర్వాత షూటింగ్‌కు వెళ్లాం.



17వ శతాబ్దంలో ఎలాంటి దుస్తులు వేసుకొనేవారనే విషయంలో మనకు అనేక రిఫరెన్స్‌లు ఉన్నాయి. ఔరంగజేబు ఎలా ఉండేవాడు? ఎలాంటి దుస్తులు వేసుకొనేవాడనే విషయం కూడా మనకు తెలుసు. కానీ ఈ సినిమాలో వీరమల్లు ఒక ఊహాజనితమైన పాత్ర. అతను దక్షిణాదికి చెందిన ఒక వీరుడు. దాన్ని దృష్టిలో పెట్టుకొని అతనికి జుబ్బా, ధోవతితో ప్రత్యేక డ్రస్సు తయారుచేశాం. జుబ్బా మీద ఒక కోటులాంటిది కూడా వేశాం. దానితో పాటుగా ఊళ్లలో సాధారణంగా ఒక గుడ్డను తలకు చుట్టుకుంటారు. దాన్ని అవసరమైతే నడుముకు కట్టుకుంటారు. మేము ఈ గుడ్డను మెడలో వేశాం. నడుముకు కూడా కట్టాం. ఇక ఆభరణాల విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకున్నాం. కళ్యాణ్‌గారి ఈ లుక్‌కు విపరీతమైన స్పందన లభించింది.

ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి ఐదేళ్లు దాటిపోయింది. ఇంతకాలం దుస్తుల్ని పరిరక్షించటం కష్టం కాలేదా?

2020 ఫిబ్రవరి 4వ తేదీన షూటింగ్ మొదలైంది. 'కొల్లగొట్టిన..' సాంగ్ 70 శాతం చిత్రీకరణ అయ్యేసరికి కొవిడ్ లాక్‌డౌన్ వచ్చింది. దాంతో షూటింగ్ ఆగిపోయింది. 2021లో మళ్లీ షూటింగ్ మొదలుపెట్టాం. రెండు, మూడు నెలలకే లాక్‌డౌన్ ప్రకటించారు. మళ్లీ షూటింగ్ ఆగిపోయింది. ఆ తర్వాత కళ్యాణ్‌గారు రాజకీయాలలో బిజీ అయిపోయారు. దీంతో షూటింగ్ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో దుస్తుల్ని జాగ్రత్త చేయటం చాలా కష్టమయింది. ఎందుకంటే- ఈ సినిమాలో కేవలం కాటన్ దుస్తులను వాడాం. ఇవన్నీ సహజమైన రంగులతో తయారుచేసినవి. ఎక్కువ కాలం వదిలేస్తే వాటి మెరుపు తగ్గిపోతుంది. ఉదాహరణకు 'కొల్లగొట్టిన..' పాట షూటింగ్ అర్ధాంతరంగా ఆగిపోయింది. మళ్లీ షూటింగ్ ప్రారంభించే సమయానికి కొన్ని దుస్తులు పాడైపోయాయి. వాటిని తిరిగి కుట్టాల్సి వచ్చింది. ఈ తరహా సందర్భాలు కొన్ని ఎదురయ్యాయి. ఇదంతా చాలా శ్రమతో కూడిన వ్యవహారం.

చారిత్రాత్మక సినిమా అంటే జూనియర్ ఆర్టిస్టుల సహా అందరికీ ప్రత్యేకమైన దుస్తులు కుట్టాలి కదా.. ఎన్ని వేల మీటర్ల వస్త్రం వాడి ఉంటారు?

కచ్చితమైన లెక్క చెప్పలేను కానీ 30 వేల మీటర్ల కన్నా ఎక్కువ వస్త్రం వాడి ఉంటాం. అన్ని వేల మీటర్లు వాడారా? అని చాలామంది ఆశ్చర్యపోతూ ఉంటారు. మీకు ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. ఈ సినిమాలో ఒక పాటలో 350 మంది డ్యాన్సర్లు ఉన్నారు. ఒక్కొక్కరికి ప్రత్యేకమైన డ్రస్సు కుట్టాలంటే 9 మీటర్లు పడుతుందనుకుందాం. అంటే 3150 మీటర్లు అవుతుంది. వీరితో పాటు కొందరు జూనియర్ ఆరిస్టులు, క్యారెక్టర్ ఆర్టిస్టులు, ఇతరులు కూడా ఉంటారు. వీరికి కూడా ప్రత్యేకంగానే కుట్టాలి కదా! అంతా కలిపితే 3500 మీటర్లు అయిందనుకుందాం.. తలపాగాల లెక్క వేరు. ఒక తలపాగ చుట్టాలంటే 20 మీటర్ల వస్త్రం అవసరమవుతుంది. వీటితో పాటుగా రకరకాల సీన్లు, ఫైట్లు కూడా ఉంటాయి కదా! ఒక ఫైట్ సీక్వెన్స్‌ను తీసుకుంటే వాటిలో దుస్తులు పాడైపోయే అవకాశం ఎక్కువ ఉంటుంది. అందువల్ల హీరోకు, ఆయన బాడీ డబుల్ (డూప్)కు కలిపి ఆరేడు జతలు రెడీగా ఉంచుకుంటాం. మనకు అత్యాధునికమైన కెమేరాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఏ చిన్న తేడా వచ్చినా ప్రేక్షకులు పసికట్టేస్తున్నారు. అందువల్ల దుస్తుల విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తోంది.

> సాధారణంగా సినిమా పూర్తయిన వెంటనే దుస్తులన్నీ ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లిపోతాయి. వారు మంచి దుస్తులను వేరు చేసి, ఉతికించి జాగ్రత్తగా భద్రపరుస్తారు. భవిష్యత్తులో అవసరమైనప్పుడు తిరిగి వాడతారు. చారిత్రాత్మక సినిమాల్లో దుస్తులను బయట ఎవరు వాడలేరు కాబట్టి జాగ్రత్తగా భద్రపరుస్తూ ఉంటాం. కొన్నిసార్లు 'సురభి' వంటి సంస్థలకు ఉచితంగా ఇచ్చేస్తాం. 'గౌతమీపుత్ర శాతకర్ణి' సినిమాలో వాడిన దుస్తులను 'సురభి' వారికే ఇచ్చేశాం. వాటిని వారు తమ నాటకాలలో వాడారు.

రంగుల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

ఆ సమయంలో ప్రకృతిలో ఎలాంటి రంగులు ఉన్నాయో అలాంటి రంగులే ఎక్కువగా వేసుకొనేవారు. అయితే ఆ రంగులన్నీ కెమేరాలో ఎలా కనిపిస్తాయో తెలియదు. అందువల్ల ముందు కొన్ని నమూనాలు తీసుకొని వాటిని సినిమాటోగ్రాఫర్‌కు, ఆర్ట్ డైరక్టర్‌కు చూపించేవాళ్లం. వాళ్లతో చర్చించిన తర్వాత వేర్వేరు పాత్రలకు రంగులు నిర్ణయించాం. అలాగే అన్ని పాత్రలకు ఒకే విధమైన దుస్తులను కుట్టించలేం. ఉదాహరణకు గ్రామంలో నివసించే గ్రామీణులను తీసుకుందాం. వారు మెరిసే దుస్తులు వేసుకోరు. అవి ఎక్కువ మెరవకుండా ముతకగా కనిపించాలి. హీరో, హీరోయిన్, ముఖ్యమైన పాత్రల దుస్తులలో కొంత మెరుపు ఉండాలి. వారు పెట్టుకున్న ఆభరణాలకు తగినట్లు ఉండాలి. అందువల్ల మేము తెల్ల వస్త్రాన్ని తీసుకొని, దానికి మాకు అవసరమైన రంగులను వేయించుకొని వాటితో దుస్తులు కుట్టేవాళ్లం. ఈ సినిమాలో కళ్యాణ్‌గారి కోసం చేసిన డిజైన్లను చేతితోను కుట్టాం. ఒకో డ్రస్సు కుట్టడానికి ఆరు నుంచి ఎనిమిది రోజులు పట్టేది.

> మొత్తం సినిమా బడ్జెట్‌లో రెండు నుంచి మూడు శాతం దుస్తులకు పెడితే మంచి క్వాలిటీ అవుట్‌పుట్ వస్తుంది. ఒక కోటి రూపాయలు పెడితే పది కోట్ల రూపాయల విలువ ఉన్న దుస్తులు వేసుకున్న అనుభూతి కలగాలి. అప్పుడే కాస్ట్యూమ్ డిజైనర్ విజయవంతం అయినట్లు లెక్క.

షూటింగ్‌లో మీరు మరచిపోలేని అనుభవం?

కళ్యాణ్‌గారు చాలా మితభాషి. ఎవరితోను ఎక్కువగా మాట్లాడరు. మొదట్లో నాతో కూడా ఏమి మాట్లాడేవారు కాదు. నేను ప్రతిరోజూ లోకేషన్‌లో ఉండి అందరిని సరైన దుస్తులు, ఇతర ఆభరణాలు అందాయా? లేదా? అని చూసుకుంటూ ఉండేదాన్ని. ఒక రోజు పని అయిపోయిన తర్వాత కళ్యాణ్‌గారి టెంట్ దగ్గరకు వచ్చి నిలబడ్డా. కళ్యాణ్ గారు వచ్చి- "ఇంతకు ముందు మీరు ఏం చేశారు?" అని అడిగారు. "నేను ఇంజనీరింగ్ చదివాను సర్.. టీచింగ్ చేసేదాన్ని. కాస్ట్యూమ్ డిజైనింగ్ అంటే నాకు ఇష్టం. దాంతో ఉద్యోగం వదిలేసి వచ్చా. 'కంచె' సినిమాతో మొదలుపెట్టాను" అని చెప్పాను. "జూనియర్ ఆర్టిస్టులకు మీరు ఇస్తున్న దుస్తుల రిఫరెన్స్‌లు చూశా. వారి లుక్స్ చాలా బావున్నాయి. చారిత్రాత్మక సినిమాలకు పనిచేయటం అంత సులభం కాదు. మీరు అద్భుతంగా పనిచేస్తున్నారు" అని ప్రశంసించారు. నా జీవితంలో అతి పెద్ద ప్రశంస అది.

● సీవీఎల్ఎన్ ప్రసాద్

చిన్న సినిమాలకు పెద్ద గౌరవం

పద్నాలుగు సంవత్సరాల తరవాత తెలుగు చిత్ర పరిశ్రమలో అవార్డుల సందడి మళ్లీ మొదలైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 'గద్దర్ సినిమా అవార్డు'లను ప్రకటించింది. ఏడాదికి మూడు చొప్పున పదేళ్ల అవార్డులను ఒకేసారి ప్రకటించారు. ఈ అవార్డులు పొందిన వాటిలో పెద్ద చిత్రాలతో పాటు చిన్న సినిమాలకు కూడా సముచిత ప్రాధాన్యం లభించింది.

ఈసారి గద్దర్ అవార్డులు పొందిన 'పొట్టేల్, బలగం, 35 చిన్న కథ కాదు, కమిటీ కుర్రోళ్లు, అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, కలర్ ఫొటో' వంటి చిన్న చిత్రాలు బాక్స్ ఆఫీసు వద్ద కూడా విజయం సాధించాయి. పైగా ఈ చిత్రాలన్నీ గ్రామీణ నేపథ్యంలో తీసినవే! తెలుగు ప్రాంత సంస్కృతిని ప్రతిబింబేవే! ఉదాహరణకు 'కమిటీ కుర్రోళ్లు' పూర్తి గ్రామీణ నేపథ్యంలో తీసిన చిత్రం. పైగా ఈ సినిమాలో దర్శకుడు సహా అందరూ కొత్తవారే! ఈ చిత్రాన్ని తెరకెక్కించిన యదువంశీకి ఉత్తమ తొలి దర్శకుడి అవార్డు దక్కింది. ఇక '35 చిన్న కథ కాదు' ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికైంది. ఇందులో నటించిన నివేదా థామస్ ఉత్తమ నటిగా, మాస్టర్ అరుందేవ్ పోతుల, బేబీ హారిక ఉత్తమ బాల నటులుగా అవార్డులు కైవసం చేసుకున్నారు. ఈ సినిమాలో పిల్లలతోపాటు తల్లిదండ్రులు, సమాజం నేర్చుకోవాల్సిన ఎన్నో విషయాలను చర్చించారు. తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో తెరకెక్కిన 'బలగం' ఇటు ప్రేక్షకులు, అటు విమర్శకుల ప్రశంసలు పొందింది. ఈ సినిమా కథ చావు చుట్టూ తిరుగుతుంది. పల్లెల్లో బంధాలు, అనుబంధాలు ఎంత గొప్పగా ఉంటాయో చాటి చెప్పింది. కంటెంట్ బావున్న సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ ఉంటుందనే విషయాన్ని ఈ చిత్రం చెప్పకనే చెప్పింది. సమాజంలోని అంతరాలు, పరువు, ప్రేమ నేపథ్యంలో వచ్చిన 'అంబాజీపేట మ్యారేజ్ బ్యూరో' పెద్ద విజయమే సాధించింది. కులాల మధ్య అంతరాన్ని, ఆర్థిక అసమానతలను ఈ చిత్రంలో దర్శకుడు చక్కగా ఆవిష్కరించారు. 2014 నుంచి 2023 వరకు ప్రతి ఏటా మూడు ఉత్తమ చిత్రాలను ఎంపిక చేయడం సినీ అభిమానుల్లో ఆసక్తిని కలిగించింది. ఉత్తమ కేటగిరీ చిత్రంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలను ప్రకటించారు. ఇలా ఎంపిక చేసిన 30 సినిమాల్లో సింహ భాగం సూపర్ హిట్ అయినవే. మొదటి ఉత్తమ చిత్రాలుగా ఎంపికైన 'రన్ రాజా రన్, రుద్రమదేవి, శతమానం భవతి, బాహుబలి, మహానటి, మహర్షి, అల వైకుంఠపురములో, ఆర్ఆర్ఆర్, సీతారామం' మొదలైనవి ప్రేక్షకుల ఆదరణతో పాటుగా బాక్స్‌ఆఫీసు విజయాలు కూడా సాధించాయి.



బాలయ్యకు 3 అవార్డులు

ఈ అవార్డుల్లో మరో గొప్ప విశేషం ఏమిటంటే.. 2021 సంవత్సరానికి గాను నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ' రెండో ఉత్తమ చిత్రంగా, 2023లో 'భగవంత్ కేసరి' మూడో ఉత్తమ చిత్రంగా ఎంపికయ్యాయి. వీటితోపాటు ఎన్టీఆర్ జాతీయ అవార్డు సైతం బాలకృష్ణను వరించింది. బాలయ్య నటుడిగా 50 ఏళ్ల స్వర్ణోత్సవం పూర్తి చేసుకున్న శుభతరుణాన ఒకేసారి మూడు అవార్డులు రావడం నిజంగా విశేషమే.



పదే పదే కడగకూడదా?

మన శరీరంలో కొన్ని భాగాలు చాలా సున్నితంగా ఉంటాయి. పరిశుభ్రత పేరుతో వాటిని పదేపదే కడిగితే అనారోగ్య సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు.

- కొంతమంది... జిడ్డుగా ఉందనో మొటిమలు వస్తున్నాయనో ముఖాన్ని పదే పదే సబ్బుతో రుద్ది కడుగుతూ ఉంటారు. దీనివల్ల ముఖం మీద ఉండే సహజ నూనెలు తొలగిపోయి చర్మం పొడిబారుతుంది. ముఖం మృదుత్వాన్ని కోల్పోతుంది. ముఖాన్ని రోజుకు మూడుసార్ల కంటే ఎక్కువగా కడగకూడదు.
- ముక్కులోపలి భాగాన్ని కూడా ఎక్కువగా శుభ్రం చేయకూడదు. ఇక్కడ... లోపలికి ప్రవేశించే గాలిని శుభ్రపరచి చుట్టూ తేమగా ఉంచే పొర ఉంటుంది. ముక్కును ఎక్కువగా నీళ్లతో శుభ్రం చేస్తూ ఉంటే ఈ పొర దెబ్బతింటుంది. దీంతో దుమ్ము కణాలు శ్వాసనాళాల్లోకి చేరి తుమ్ములు, దగ్గు లాంటి శ్వాసకోశ సమస్యలను కలిగిస్తాయి.
- కంటి చుట్టూ నల్లని వలయాలు వచ్చాయని, వేళ్ల మధ్య మురికి చేరిందని ఆ ప్రదేశాలను అతిగా రుద్దకూడదు. ఈ భాగాల్లో చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. శుభ్రత పేరుతో మాటిమాటికీ సబ్బుతో కడుగుతూ ఉంటే చర్మం పొరలు బలహీనమై ఇన్ఫెక్షన్లు సోకవచ్చు.
- జననేంద్రియాలను కూడా సబ్బు లేదా షాంపూతో పదేపదే శుభ్రం చేయకూడదు. అలా చేస్తే ఆ భాగాల్లోని పీహెచ్ స్థాయిలు దెబ్బతిని దురద, మంట లాంటి సమస్యలు ఏర్పడవచ్చు. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే చాలు.

స్టైపెండ్ ఇవ్వని ప్రైవేటు వైద్య కాలేజీలపై చర్యలు తీసుకోండి

- పీజీ సీట్ల పెంపునకు అనుమతివ్వండి
- ఎన్ఎంసీ చైర్మన్‌కు మంత్రి దామోదర విజ్ఞప్తి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ప్రైవేటు వైద్య కళాశాలలు స్టైపెండ్ విషయంలో విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నాయని, అటువంటి కాలేజీలపై చర్యలు తీసుకోవాలని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) చైర్మన్ డాక్టర్ బి.ఎన్.గంగాధర్‌ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోరారు. శనివారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఎన్ఎంసీ చైర్మన్‌తో మంత్రి బేగంపేటలోని టూరిజం ప్లాజాలో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఒకేసారి భారీ సంఖ్యలో వైద్య కాలేజీలు పెరిగినందున, ఫ్యాకల్టీ సర్దుబాటు, భవనాల విషయంలో అవసరమైన మినహాయింపులు ఇవ్వాలని ఎన్ఎంసీ చైర్మన్‌కు మంతిర విజ్ఞప్తి చేశారు. ఎంబీబీఎస్ సీట్లకు అనుగుణంగా పీజీ సీట్లు లేకపోవడం వల్ల, యూజీ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని.. పీజీ సీట్ల సంఖ్యనూ పెంచుకునేందుకు అనుమతులివ్వాలని కోరారు. పీజీ సీట్లు పెరిగితే ప్రజలకు మేలు జరుగుతుందని, మెరుగైన వైద్య సేవలు అందుతాయని, మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల నియామకాలకు కూడా ఇబ్బంది ఉండదని ఎన్ఎంసీ చైర్మన్‌కు వివరించారు. మంత్రి చేసిన విజ్ఞప్తులకు ఎన్ఎంసీ చైర్మన్ సానుకూలంగా స్పందించారు.

పైలట్లు తిరిగొచ్చినా.. యుద్ధ విమానాలు రాలేదు

ఎన్ని రాఫెల్ ఫైటర్లు కోల్పోయామో మోదీ సర్కారు వెల్లడించాలి

- రక్షణ సామర్థ్యాలపై పున:సమీక్ష అవసరం
- వాయుసేనలో 42ఫైటర్ స్క్వాడ్రన్ల అవసరం
- మన దగ్గర ఉన్నవి 31 స్క్వాడ్రన్లే!
- త్రివిధ దళాల్లో 10శాతానికిపైగా ఖాళీలు
- యుద్ధ విమాన మాజీ పైలట్, మంత్రి ఉత్తమ్





యుద్ధ విమానం దగ్గర ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

న్యూఢిల్లీ, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో ఎన్ని రాఫెల్ యుద్ధ విమానాలు కోల్పోయామన్న వివరాలను మోదీ ప్రభుత్వం ఎందుకు వెల్లడించడం లేదని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. నాలుగు రోజుల పాటు జరిగిన యుద్ధంలో పైలట్లు సురక్షితంగా తిరిగివచ్చినప్పటికీ రాఫెల్ యుద్ధ విమానాలు ఎయిర్ బేస్‌లకు తిరిగి రాలేదని పేర్కొన్నారు. యుద్ధ విమానాలు కోల్పోయిన అంశంలో కేంద్రం పారదర్శకంగా వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. శనివారం ఢిల్లీ అక్బర్‌రోడ్డులోని కాంగ్రెస్ పాత కేంద్ర కార్యాలయంలో ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. తాను చైనా, పాక్ సరిహద్దులలో విుగ్-21, మిగ్-23 యుద్ధ విమానాల పైలట్‌గా పనిచేసిన నేపథ్యాన్ని వివరించారు. "మా పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రాఫెల్ యుద్ధవిమానాలు కూలిపోవడంపై ప్రశ్నిస్తే ఆయనను దేశద్రోహిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ యుద్ధ విమానాలు కూలిపోయాయని చెప్పారు. ఆయన దేశభక్తిని కూడా శంకిస్తారా?" అని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌లో యుద్ధ విమానాలను కోల్పోయామని, మన రక్షణ సాంకేతిక సామర్థ్యాలను లోతుగా సమీక్షించాల్సిన అవసరాన్ని ఇది సూచిస్తోందని చెప్పారు. యుద్ధ విమానాల సరఫరాలో ఆలస్యం, తగిన ప్రతిభ గల మానవ వనరుల కొరత, తగినన్ని ఫైటర్ స్క్వాడ్రన్‌లు లేకపోవడం వంటి సమస్యలను ఇటీవల ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ లేవనెత్తారని గుర్తు చేశారు. వైమానిక దళంలో 42 ఫైటర్ స్క్వాడ్రన్‌లు ఉండాలని, మన దగ్గర ప్రస్తుతం 31 స్క్వాడ్రన్‌లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. చైనా, పాక్‌లను ఒకేసారి ఎదుర్కోవాల్సి వస్తే అవసరమైన వాటి కంటే.. ఈ సంఖ్య చాలా తక్కువని పేర్కొన్నారు. నియామకాలు చేపట్టకపోవడంతో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లలో 10శాతానికి పైగా ఖాళీలు పేరుకుపోయాయని తెలిపారు. రక్షణ దళాల బలోపేతానికి కేంద్రం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులకు దేశభక్తి లేదంటూ, పాకిస్థాన్‌కు వంతపాడారంటూ బీజేపీ నేతలు అడ్డగోలుగా, వికారమైన వ్యాఖ్యలు చేశారని ఉత్తమ్ మండిపడ్డారు. కాంగ్రెస్ కంటే ఎక్కువ దేశభక్తి దేశంలో ఏ పార్టీకి లేదన్నారు. పాక్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేసిన భారత వైమానిక దళాన్ని అభినందిస్తున్నానని ఆయన చెప్పారు.

పార్లమెంటు సమావేశాలు నిర్వహించాలి: ఖర్గే

భారత్-పాక్ ఉద్రిక్తల విషయంలో కేంద్ర ప్రభుత్వం దేశాన్ని తప్పుదోవ పట్టించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. సీడీఎస్ అనిల్ చౌహాన్ చెప్పిన అంశాల విషయంలో ప్రభుత్వం కీలక అంశాలు వెల్లడించా ల్సి ఉందని, ఈ మేరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీనితోపాటు భారత రక్షణ రంగ సన్నద్ధతపై స్వతంత్ర నిపుణుల కమిటీతో సమీక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

వాజ్‌పేయిలా కమిటీ వేయగలరా?: జైరామ్ రమేశ్

కార్గిల్ యుద్ధం ముగిసిన మూడో రోజే అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం 'కార్గిల్ రివ్యూ కమిటీ' వేసిందని, ఆ నివేదికను పార్లమెంటులో పెట్టిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ చెప్పారు. ఇప్పుడు ఆపరేషన్ సిందూర్‌పై మోదీ ప్రభుత్వం కమిటీ వేయగలదా అని సవాల్ చేశారు.

చిత్రజ్యోతి

SINCE 1965

కమల్ సినిమాలను నిషేధించాలి



● కర్నాటక మంత్రికి ఫిల్మ్‌చాంబర్ లేఖ

కమల్ హాసన్ క్షమాపణ చెప్పకుంటే ఆయన సినిమాలను నిషేధించాలని కోరుతూ కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడగికి కర్ణాటక ఫిల్మ్ చాంబర్ లేఖ రాసింది. ఈ అంశంపై మంత్రి శివరాజ్ తంగడగి స్పందిస్తూ, ఇతర భాషల నటులు కన్నడ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని అన్నారు. విధానసౌధలో మంత్రి శనివారం మీడియాతో మాట్లాడారు. కమల్ సీనియర్ నటుడైనా, భాష గురించి అనుచితంగా మాట్లాడితే సహించేది లేదని అన్నారు. ఈ అంశంపై సీఎం సిద్దరామయ్యతోనూ, సీనియర్ నటుడు శివరాజ్‌కుమార్‌తోనూ చర్చిస్తానని అన్నారు. థగ్‌లైఫ్ సినిమా కోసం వచ్చిన సమయంలో కమల్‌హాసన్ మాట్లాడుతూ, తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందని అన్నారు. ఈ వ్యాఖ్యలు వివాదానికి దారి తీశాయి. జూన్ 5న సినిమా విడుదల కానుంది. కమల్ వ్యాఖ్యలు ఇప్పటికే వివాదాస్పదం అయ్యాయని, అందుకు ఆయన క్షమాపణ చెప్పాల్సిందేనని ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు నరసింహులు అన్నారు. జూన్ 5లోగా స్పందించకుంటే ఆయన నటించిన సినిమాను రాష్ట్రంలో ప్రదర్శించేందుకు అవకాశం ఇచ్చేది లేదని డిస్ట్రిబ్యూటర్‌లు స్పష్టం చేశారని తెలిపారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

అక్టోబర్‌లో పెళ్లివేడుక



అక్టోబర్‌లో సిరి లేళ్ల (శిరీష)తో ఏడడుగులు వేయబోతున్నట్లు నారా రోహిత్ తెలిపారు. ఆయన నటించిన 'భైరవం' చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా నారా రోహిత్ మీడియాతో మాట్లాడుతూ తమ పెళ్లి గురించి స్పందించారు. 'ప్రతినిధి 2' చిత్రంలో జంటగా నటించిన నారా రోహిత్, శిరీష ఆ సినిమా షూటింగ్ సమయంలో ప్రేమలో పడ్డారు. గతేడాది అక్టోబర్‌లో ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో వారి నిశ్చితార్థం జరిగింది. అయితే నారా రోహిత్ తండ్రి రామ్మూర్తి నాయుడు నవంబర్‌లో కన్నుమూయడంతో పెళ్లి వేడుకను వాయిదా వేసుకున్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



నార్నె నితిన్ కథానాయకుడిగా సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. సంపద కథానాయిక. శ్రీ వేధాక్షర మూవీస్ పతాకంపై చింతపల్లి రామారావు నిర్మించారు. శనివారం చిత్ర బృందం నిర్వహించిన కార్యక్రమంలో మేకర్స్ ట్రైలర్‌ను ఆవిష్కరించి, విడుదల తేదీని ప్రకటించారు. ఈనెల 6న 'శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సతీశ్ వేగేశ్న మాట్లాడుతూ "ఇదొక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. మనల్ని మనం జయించడమే సక్సెస్' అంటే అని ఈ సినిమాలో నరేశ్ గారికి ఒక డైలాగ్ ఉంది. ఈ కాన్సెప్ట్‌తోనే సినిమాను రూపొందించాం. నార్నే నితిన్‌లోని యాక్షన్ కోణం ఈ సినిమాలో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అన్నారు. పూర్తి కమర్షియల్ ఫార్మాట్‌లో భారీ తారాగణంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని చింతపల్లి రామారావు తెలిపారు.

ఊహకందని మలుపులతో



వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధానపాత్ర పోషిస్తున్న హారర్ థ్రిల్లర్ 'పోలీస్ కంప్లెయింట్'. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో సింగపూర్ బాలకృష్ణ, మల్లెల ప్రభాకర్ నిర్మిస్తున్నారు. నవీన్‌చంద్ర, రవిశంకర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సూపర్‌స్టార్ కృష్ణ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి వరలక్ష్మీ శరత్‌కుమార్ ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కర్మసిద్ధాంతం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. హారర్ థ్రిల్లర్ జానర్‌లో ఊహకందని మలుపులతో కథ సాగుతుంది. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది' అని చెప్పారు. ఈ చిత్రంలో కృష్ణగారి మీద ప్రత్యేకంగా ఓ గీతాన్ని రూపొందించాం, అది సినిమాకు ప్రత్యేకాకర్షణ అని నిర్మాతలు చెప్పారు. సంగీతం: సుదీంద్ర, సినిమాటోగ్రఫీ: ఎస్.ఎన్ హరీశ్

మైథలాజికల్ థ్రిల్లర్



జగదీశ్ ఆమంచి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'యముడు'. శ్రావణి శెట్టి హీరోయిన్. మైథాలజీ, సస్పెన్స్ క్రైమ్ అంశాలతో రూపుదిద్దుకుంటున్న థ్రిల్లర్ ఇది. గురువారం ఈ మూవీ టీజర్‌ను హీరో నవీన్‌చంద్ర విడుదల చేశారు. సిటీలో ఉన్న అమ్మాయిలు అపహరణకు, హత్యకు గురవడం, నాటకాల్లో యముడి వేషం వేసే నటుడికీ ఆ హత్యలకు సంబంధం ఉందేమో అన్నట్లుగా ఈ టీజర్‌లో చూపించారు. త్వరలోనే ఈ చిత్రం గురించి మరిన్ని అప్‌డేట్స్‌ను ప్రకటిస్తామని నిర్మాత జగదీశ్ చెప్పారు. ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రజని ఆమంచి.

ఇన్ ప్రోగ్రెస్

కొత్త కథలతో తెరపైకి



'నిర్మాతగా టాలీవుడ్‌లో అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉంది. కొత్త తరాన్ని ప్రోత్సహించడానికి, సరికొత్త కథలను తెరపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తాం' అని వర్ధమాన నిర్మాత జేజే అన్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో తన సొంత నిర్మాణసంస్థ 'సోమో ఐరానిక్ ఆర్ట్ క్రియేషన్స్' బేనర్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేజే మీడియాతో మాట్లాడుతూ 'త్వరలో ఓ భారీ చిత్రాన్ని ప్రకటిస్తాం. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో సినిమా రూపొందుతోంది. భవిష్యత్తులో ఎన్నో మంచి చిత్రాలను నిర్మించాలనేదే మా లక్ష్యం' అని తెలిపారు.

మీరే నాకు స్ఫూర్తి!

● చిరంజీవిని కలిసిన శేఖర్ కమ్ముల



ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల చిత్ర పరిశ్రమలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఈ ప్రత్యేక సందర్భంలో ఆయన మెగాస్టార్ చిరంజీవిని కలిశారు. '25 ఇయర్స్ ఆఫ్ శేఖర్ కమ్ముల' సెలబ్రేటింగ్ ది సోల్ ఆఫ్ స్టోరీ టెల్లింగ్ అనే పోస్టర్‌ని చిరంజీవి ఆవిష్కరించి, అభినందించారు. ఈ విషయాన్ని శేఖర్ కమ్ముల సోషల్ మీడియా వేదికగా తెలియజేశారు. 'టీనేజ్‌లో ఉన్నప్పుడు మెగాస్టార్ చిరంజీవిని ఒకసారి దగ్గర నుంచి చూశాను. ఈయనతో సినిమా చేయాలనే భావన కలిగింది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 సంవత్సరాలు అవుతోంది. దీనిని సెలబ్రేట్ చేసుకుందామని మా టీమ్ అనగానే వెంటనే నాకు గుర్తొచ్చింది చిరంజీవి గారే. కొన్ని తరాల వారిలో స్ఫూర్తి నింపిన వ్యక్తి ఆయన. కలలను వెంటాడితే విజయం తప్పకుండా మనల్ని అనుసరిస్తుందని నమ్మకం కలిగించింది ఆయనే. నా ఈ 25 ఏళ్ల వేడుకను ఆయన సమక్షంలో చేసుకోవాలనిపించింది. థాంక్యూ సర్. ఈ క్షణంలోనే కాదు నా టీనేజ్ నుంచి మీరు నా ముందు ఇలాగే ఉన్నారు' అని శేఖర్ కమ్ముల ఆ పోస్టులో పేర్కొన్నారు. చిరంజీవితో కలసి దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఆ సినిమాతో ముడిపెట్టడం సరికాదు

- ఆర్. నారాయణ మూర్తి



'ప్రభుత్వాన్ని సినీ పెద్దలు కలవాలి అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనడంలో తప్పులేదు. సమస్యలపై చర్చించడానికి సినీ పరిశ్రమను ప్రభుత్వం మరోసారి పిలిస్తే బాగుండేది' అని అన్నారు సీనియర్ నటుడు ఆర్.నారాయణ మూర్తి. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'గద్దర్ అవార్డులు ప్రకటించడం గర్వంగా ఉంది. ఏపీలో కూడా 'నంది' అవార్డులు ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరుతున్నా. పర్సంటేజీ విషయంలో ఈ మధ్య వివాదం నెలకొంది. 'హరి హర వీరమల్లు' చిత్రం కోసమే థియేటర్లు బంద్ చేస్తున్నారనేది అబద్ధం. పర్సంటేజీ విధానాన్ని కోరుకునే వ్యక్తుల్లో నేనూ ఒకడిని. పర్సంటేజీ ఖరారైతే నాలాంటి ఎంతోమంది నిర్మాతలకు మేలు కలుగుతుంది. అయితే, 'హరి హర వీరమల్లు' సినిమా ప్రస్తావన లేకుండా సమస్యలపై చర్చించడానికి పిలిస్తే పవన్‌పై గౌరవం మరింత పెరిగేది. పర్సంటేజీ విషయంలో చాంబర్ ముందు ఆందోళనలు చేశాం. ఎంతోమంది చాంబర్ అధ్యక్షులకు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదు. పర్సంటేజీ విషయం ఒక కొలిక్కి వచ్చే దశలో 'హరి హరి వీరమల్లు'కు లింక్ పెట్టడం సరికాదు. నేడు సింగిల్ థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకమైంది. కొందరు కార్పొరేట్ వ్యవస్థకు వంత పాడుతున్నారు. సింగిల్ థియేటర్లు దేవాలయాల్లాంటివి. ఇప్పుడు ఇవి కల్యాణ మండపాలవుతున్నాయి. పర్సంటేజీని బతికించి నిర్మాతలను కాపాడాలి' అని అన్నారు.

భూమ్.. భూమ్



'అర్ధనారి', 'తెప్ప సముద్రం', 'వెడ్డింగ్ డైరీస్' వంటి వైవిధ్యమైన చిత్రాల్లో హీరోగా నటించిన అర్జున్ అంబటి తాజా చిత్రం 'పరమపద సోపానం'. నాగ శివ దర్శకత్వంలో గుడిమట్ల శివప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జూలై 11న విడుదల కానుంది. ఇటీవల 'చిన్ని చిన్న తప్పులేవో' పాటను విడుదల చేసిన యూనిట్ ఇప్పుడు 'భూమ్ భూమ్' అనే పెప్పీ మాస్ నంబర్‌ను రిలీజ్ చేసింది. గీతా మాధురి పాడిన ఈ పాటను రాంబాబు గోశాల రాశారు. దేవ్ జాండ్ సంగీత దర్శకుడు. హీరోయిన్ నమితపై ఈ పాటను చిత్రీకరించారు.

సెమీస్‌లో సాత్విక్ జంటకు షాక్

సింగపూర్ ఓపెన్

సింగపూర్: సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి కథ ముగిసింది. శనివారం జరిగిన సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-19, 10-21, 18-21తో మలేసియాకు చెందిన ఆరన్ చియా-సో వు యిక్ చేతిలో ఓటమి పాలైంది. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌లో సాత్విక్ జోడీ నెగ్గినా.. ఆ తర్వాతి గేమ్‌లో ధాటిగా ఆడిన ప్రత్యర్థి ద్వయం ఆ గేమ్‌ను గెలిచి స్కోరు సమం చేసింది. నిర్ణాయక ఆఖరి గేమ్‌లో 11-20తో వెనుకంజలో ఉన్నప్పుడు వరుసగా ఏడు మ్యాచ్ పాయింట్లు కాపాడుకొన్న సాత్విక్ జంట సమం చేసేందుకు తీవ్రంగా పోరాడింది. కానీ, ఉత్కంఠ మధ్య ఆఖరి పాయింట్ సాధించిన మలేసియా జంట గేమ్‌తో పాటు మ్యాచ్‌ను నెగ్గి ఫైనల్‌కు దూసుకెళ్లింది.

రెజా @ రూ. 2.23 కోట్లు

- టాప్ లేపిన ఇరాన్ ఆల్‌రౌండర్
- దేవాంక్‌కు రూ. 2.20 కోట్లు

ప్రొ కబడ్డీ వేలం


మహమ్మద్ రెజా

ముంబై: ప్రొ కబడ్డీ సీజన్-12 వేలంలో ఇరాన్ ఆల్‌రౌండర్ మహమ్మద్ రెజా టాప్ లేపాడు. శనివారం జరిగిన తొలిరోజు వేలంలో గుజరాత్ జెయింట్స్ భారీ ధర రూ. 2.23 కోట్లకు రెజాను కొనుగోలు చేసింది. అతడు వేలంలో 2 కోట్ల మార్క్ దాటడం ఇది వరుసగా మూడోసారి. కాగా, గత సీజన్ బెస్ట్ రైడర్ దేవాంక్ దలాల్ అత్యధికంగా రూ. 2.20 కోట్లకు అమ్ముడైన భారత ఆటగాడిగా నిలిచాడు. దేవాంక్ కోసం పుణె తీవ్రంగా పోటీపడినా.. భారీ ధరకు బెంగాల్ వారియర్స్ దక్కించుకొంది. అషు మాలిక్‌ను దబాంగ్ ఢిల్లీ ఫైనల్ బిడ్ టు మ్యాచ్ కింద రూ. 1.90 కోట్లకు తిరిగి దక్కించుకోగా.. రెయిడ్ మెషీన్ అర్జున్ దేశ్వాల్‌ను తమిళ్ తలైవాస్ రూ. 1.40 కోట్లకు ఖరీదు చేసింది. మొత్తంగా మొదటి రోజు వేలంలో 10 మంది ఆటగాళ్లు కోటికిపైగా ధరపలికారు. కాగా, ఇరాన్ స్టార్ డిఫెండర్ ఫజల్ అత్రాచెలిని కనీస ధర రూ. 30 లక్షలకు ఢిల్లీ కొనుగోలు చేసింది. ఇక, భారత జట్టు కెప్టెన్ పవన్ కుమార్ షెహ్రావత్‌పై ఫ్రాంచైజీలు పెద్దగా ఆసక్తి చూపలేదు. అతడు అన్‌సోల్డ్‌గా మిగులుతాడనుకొన్న సమయంలో ఢిల్లీ, బెంగాల్ పోటీపడ్డాయి. కానీ, తమిళ్ తలైవాస్ రూ. 59.50 లక్షలకు సొంతం చేసుకొంది. డిఫెండర్ శుభం షిండేను తెలుగు టైటాన్స్ రూ. 80 లక్షలకు దక్కించుకొంది. కాగా, పట్నాకు మూడు వరుస టైటిళ్లు అందించిన పర్‌దీప్ నర్వాల్ అన్‌సోల్డ్‌గా మిగలడం గమనార్హం.

ఫైనల్‌కు ఇంటికి ఎవరు?

- ముంబైతో పంజాబ్ అమీతుమీ
- నేడు క్వాలిఫయర్-2 పోరు

రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో


కెప్టెన్లు శ్రేయాస్, హార్దిక్

అహ్మదాబాద్: తాజా ఐపీఎల్ సీజన్ ముగింపు దశకు చేరింది. ఆదివారం క్వాలిఫయర్-2లో పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. గెలిచిన జట్టు ఈనెల 3న జరిగే ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరును ఎదుర్కొంటుంది. ఇక, ఇరుజట్లలోనూ బ్యాటింగ్ విభాగం పటిష్ఠంగా కనిపిస్తుండడంతో అభిమానులు హోరాహోరీ పోరును ఆశిస్తున్నారు. క్వాలిఫయర్1లో ఆర్‌సీబీ చేతిలో ఓడిన పంజాబ్‌కు ఫైనల్ చేరేందుకిది రెండో అవకాశం. ఐపీఎల్‌లో పంజాబ్ 2014లో తుది పోరుకు అర్హత సాధించింది. మళ్లీ 11 ఏళ్ల తర్వాత అదే ఫీట్ సాధించి తొలిసారి కప్‌ను ముద్దాడాలనే ఆశతో ఉంది. అటు ముంబై జట్టు ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించి ఫైనల్ బెర్త్‌పై కన్నేసింది. ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన ముంబై.. చివరిసారి 2020లో విజేత కాగలిగింది. లీగ్ దశలో ఈ రెండు జట్ల మధ్య జరిగిన పోరులో పంజాబే నెగ్గడంతో తాజా పోరులో హార్దిక్ సేన ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది.

ఒత్తిడి లేకుండా ఆడితేనే..

టేబుల్ టాపర్‌గా ప్లేఆఫ్స్‌లో అడుగు పెట్టిన పంజాబ్.. క్వాలిఫయర్-1లో మాత్రం ఆర్‌సీబీ చేతిలో పూర్తిగా చిత్తయ్యింది. హార్డ్ హిట్టర్లతో కూడిన కింగ్స్ బ్యాటింగ్ ఆర్డర్ కనీసం 100 పరుగులు చేసేందుకే కష్టపడాల్సి వచ్చింది. అటు బెంగళూరు పది ఓవర్లలోనే ఛేదనను పూర్తి చేయడం పంజాబ్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసినట్టయ్యింది. ఇప్పుడు ముంబై రూపంలో వారి ముందు అతిపెద్ద గండం ఉంది. అయితే కెప్టెన్ శ్రేయాస్, కోచ్ పాంటింగ్ ఆధ్వర్యంలో వ్యూహాత్మకంగా ముందుకు సాగాలనే ఆలోచనలో ఉంది. ఈ సీజన్‌లో ఆడిన 15 మ్యాచ్‌ల్లో ఏడుసార్లు 200+ స్కోర్లు సాధించింది. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ మెరుపు ఆరంభాన్నిస్తుండగా.. ఇన్‌గ్లిస్, శ్రేయాస్, స్టొయినిస్, నేహల్, శశాంక్ రూపంలో బ్యాటింగ్ పటిష్ఠంగా కనిపిస్తోంది. కానీ ముంబై బౌలింగ్ బలం ముందు వీరి నిలకడ ఎలా ఉంటుందో వేచిచూడాల్సిందే. పేసర్ జాన్సెన్ స్వదేశానికి వెళ్లడంతో అర్ష్‌దీప్‌పైనే భారం పడనుంది. గత మూడు మ్యాచ్‌లకు దూరమైన స్పిన్నర్ చాహల్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండనున్నాడు.

జోష్‌లో హార్దిక్ సేన

ఆరంభంలో అపజయాలు ఎదురైనా ఆ తర్వాత ముంబై ఇండియన్స్ చాంపియన్స్ ఆటతీరును ప్రదర్శించింది. వరుస విజయాలతో ప్లేఆఫ్స్‌కు దూసుకురాగలిగింది. ఇప్పుడు ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను మట్టికరిపించిన జోష్‌లో పంజాబ్‌ను ఎదుర్కొనేందుకు ఉవ్విళ్లూరుతోంది. అటు బ్యాటింగ్ ఇటు బౌలింగ్‌లో ఈ జట్టు ఎదురులేకుండా ఉంది. రోహిత్‌తో పాటు బెయిర్‌స్టో చెలరేగడం జట్టుకు శుభసూచకం. మిడిలార్డర్‌లో సూర్యకుమార్, తిలక్, నమన్, హార్దిక్ ఎదురుదాడితో భారీ స్కోర్లు సాధించగలుగుతుంది. ఇక పేసర్ బుమ్రా జట్టు ప్రధాన ఆయుధంగా చెప్పవచ్చు. శుక్రవారం మ్యాచ్‌లో గుజరాత్‌ను సరైన సమయంలో దెబ్బతీసి తమ జట్టు విజయానికి బాట వేసిన సంగతి తెలిసిందే. పంజాబ్‌కు కూడా తనే ప్రమాదకారి అనడంలో సందేహం లేదు. ఇక బౌల్ట్ పవర్‌ప్లేలోనే ప్రత్యర్థి వెన్నువిరుస్తున్నాడు. కొత్త పేసర్ గ్లీసన్ కూడా ఆకట్టుకోవడం జట్టుకు సానుకూలాంశం కానుంది.

తుది జట్లు (అంచనా)

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్, ఇన్‌గ్లిస్, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), నేహల్ వధేరా, శశాంక్ సింగ్, స్టొయినిస్, ఒమర్జాయ్, హర్‌ప్రీత్, జేమిసన్, చాహల్.

ముంబై: రోహిత్, బెయిర్‌స్టో, సూర్యకుమార్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), నమన్ ధిర్, శాంట్నర్, అశ్వని, గ్లీసన్, బుమ్రా, బౌల్ట్.

పిచ్, వాతావరణం

ఈ సీజన్‌లో ఇక్కడ ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో ఆరుసార్లు మొదట బ్యాటింగ్‌కు దిగిన జట్టే గెలిచింది. అలాగే తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 173గా ఉంది. పిచ్ పేసర్లతో పాటు స్పిన్నర్లకు కూడా అనుకూలించనుంది. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపవచ్చు.

నిత్య బృందానికి రజతం

- ఆఖరి రోజు ఆరు
- ఆసియా అథ్లెటిక్స్

24 పతకాలతో భారత్‌కు రెండోస్థానం


నిత్య గంధె



గుమి: ప్రతిష్ఠాత్మక ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి నిత్య గంధె రజత పతకంతో మురిసింది. అయితే మరో తెలుగు అథ్లెట్ జ్యోతి యర్రాజి 200 మీటర్ల పరుగులో నిరాశ పరిచింది. ఇక..శనివారం చివరి రోజు భారత్ 3 రజతాలు, 3 కాంస్యాలతో మొత్తం ఆరు పతకాలు సొంతం చేసుకుంది. మహిళల 4.100 మీటర్ల రిలేలో హైదరాబాద్‌కు చెందిన నిత్య గంధె, అభినయ, స్నేహ, సర్వాని నందతో కూడిన భారత జట్టు 43.86 సెకన్ల టైమింగ్‌తో రేస్‌ను పూర్తి చేసి రజత పతకం కైవసం చేసుకుంది. మహిళల 200 మీటర్ల పరుగు ఫైనల్లో జ్యోతి యర్రాజి 23.47 సెకన్ల టైమింగ్‌తో ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. చాంపియన్‌షిప్‌లో ఇంతకు ముందు మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి స్వర్ణ పతకం గెలిచిన సంగతి తెలిసిందే. అయితే 200 మీటర్లలోనూ పోటీపడిన నిత్య 23.90 సెకన్లతో రేస్‌ను ముగించి ఏడో స్థానంలో నిలిచింది. మహిళల ఐదు వేల మీటర్ల పరుగులో పారుల్ చౌధరి 15 నిమిషాల 15.53 సెకన్ల టైమింగ్‌తో రజత పతకం చేజిక్కించుకుంది. ఇప్పటికే 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లోనూ పారుల్ రజతం నెగ్గింది. పురుషుల 200 మీటర్ల పరుగులో అనిమేష్, మహిళల 800 మీటర్ల రేసులో పూజ, మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో విద్య రామ్‌రాజ్ కాంస్య పతకాలను భారత్ ఖాతాలో చేర్చా రు. జావెలిన్ త్రోలో సచిన్ యాదవ్ 85.16 మీటర్ల దూరంతో రజత పతకం సాధించాడు. పాకిస్థాన్‌కు చెందిన పారిస్ ఒలింపిక్స్ చాంపియన్ అర్షద్ నదీమ్ (86.40 మీ.) స్వర్ణం నెగ్గాడు. ఇక..ఈ చాంపియన్‌షిప్‌ను భారత్ మొత్తం 24 పతకాలతో (8 స్వర్ణాలు, 10 రజతాలు, 6 కాంస్యాలు) ఓవరాల్‌గా రెండో స్థానంతో ముగించింది. 19 పసిడి, 9 రజత, 4 కాంస్యా లతో కలిపి మొత్తం 32 పతకాలతో చైనా అగ్రస్థానంలో నిలిచింది. 5 స్వర్ణ, 11 రజత, 12 కాంస్యాలతో ఓవరాల్‌గా 28 పతకాలు సాధించిన జపాన్‌కు రెండోస్థానం దక్కింది.

కరుణ్ డబుల్ సెంచరీ

భారత్ 'ఎ' 557

కాంటర్‌బరీ: కరుణ్ నాయర్ (204) తన సూపర్ ఫామ్‌ను డబుల్ సెంచరీతో చాటుకున్నాడు. దీంతో ఇంగ్లండ్ లయన్స్‌తో జరుగుతున్న తొలి అనధికార టెస్టులో భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 557 పరుగులకు ఆలౌటైంది. అయితే ధ్రువ్ జురెల్ (94) తృటిలో శతకం కోల్పోయాడు. హర్ష్ దూబె (32), శార్దూల్ (27) పర్వాలేదనిపించారు. ఆ తర్వాత బరిలోకి దిగిన ఇంగ్లండ్ లయన్స్ రెండో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 52 ఓవర్లలో 2 వికెట్లకు 237 పరుగులు చేసింది. ఓపెనర్ టామ్ హైనెస్ (103 బ్యాటింగ్) సెంచరీ, మాక్స్ హోల్డెన్ (64 బ్యాటింగ్) హాఫ్ సెంచరీ సాధించారు.

రాష్ట్ర కబడ్డీ సంఘంలో నిధుల దుర్వినియోగం?

పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): క్రీడాకారుల అభ్యున్నతికి ఖర్చు చేయాల్సిన కోట్లాది నిధులు కొందరి అక్రమార్కుల జేబుల్లోకి పోయాయని తెలంగాణ కబడ్డీ సంఘం మాజీ సంయుక్త కార్యదర్శి తోట సురేష్ ఆరోపించాడు. ఈమేరకు 2020 నుంచి 2024 మధ్య కబడ్డీ సంఘంలో సుమారు రూ. కోటి 30 లక్షల నిధుల దుర్వినియోగం జరిగిందని గతనెల 28న అబిడ్స్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రాష్ట్ర ఒలింపిక్ సంఘం, కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి జగదీష్ యాదవ్ కొన్నేళ్లుగా వివిధ పదవుల్లో ఉంటూ అక్రమాలకు పాల్పడ్డాడని తన ఫిర్యాదులో సురేష్ పేర్కొన్నాడు. సంఘం సభ్యులకు తెలియకుండా వేరే అకౌంట్ ద్వారా రూ.60 లక్షలు, సూర్యాపేటలో జాతీయ పోటీల నిర్వహణలో సుమారు రూ. 50 లక్షలు, తెలంగాణ కబడ్డీ ప్రీమియర్ లీగ్‌లో చింతల స్పోర్ట్స్ సంస్థ ఇచ్చిన రూ. 20 లక్షలను మాయం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆండ్రీవా

ప్రీక్వార్టర్స్‌కు సినర్, గాఫ్

అల్కారజ్, జ్వెరెవ్, ఆండ్రీవా, పెగులా కూడా

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో సీడెడ్ల పయనం సాఫీగా సాగుతోంది. పురుషుల టాప్‌సీడ్ సినర్, రెండోసీడ్ అల్కారజ్, మూడోసీడ్ జ్వెరెవ్, ఐదోసీడ్ డ్రేపర్, మహిళల రెండోసీడ్ కొకొ గాఫ్, మూడోసీడ్ పెగులా, ఆరోసీడ్ విఁరా ఆండ్రీవా ప్రీక్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు. శనివారం జరిగిన సింగిల్స్ మూడో రౌండ్‌లో సినర్ 6-0, 6-1, 6-2తో లెహకాపై, జ్వెరెవ్ 6-2, 7-6 (4), 6-1తో కొబోలీపై, డ్రేపర్ 6-2, 6-4, 6-2తో ఫొనెస్కాపై, అల్కారజ్ 6-1, 6-3, 4-6, 6-4తో జుముర్‌పై నెగ్గారు. మహిళల సింగిల్స్‌లో గాఫ్ 6-1, 7-6(3)తో బౌస్కోవాను, పెగులా 3-6 6-4, 6-2తో వోండ్రొసోవాని, ఆండ్రీవా 6-3, 6-1తో పుటింట్సేవాని ఓడించారు. 10వ సీడ్ బడొసాకు 6-1, 7-5తో 17వ సీడ్ కసట్కినా షాకిచ్చింది.

బాలాజీ జోడీ అవుట్: పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో శ్రీరామ్ బాలాజీ/మిగ్వెల్ రేయస్ (కెనడా) ద్వయం 3-6, 4-6తో ఇటలీ జంట సిమోన్/ఆండ్రియా చేతిలో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

కెనరా బ్యాంక్ పొదుపు ఖాతాలకు

బిజినెస్ ప్లస్

'మినిమం బ్యాలెన్స్' రుసుము రద్దు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగానికి చెందిన కెనరా బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. పొదుపు ఖాతాలు, శాలరీ అకౌంట్లు, ఎన్ఆర్ఐ సేవింగ్స్ అకౌంట్లకు మినిమం బ్యాలెన్స్ చార్జీని రద్దు చేస్తున్నట్లు, జూన్ ఒకటి నుంచి ఇది అమలులోకి వస్తుందని బ్యాంక్ తెలిపింది. దీంతో బ్యాంక్ ఖాతాదారులు తమ సేవింగ్స్ అకౌంట్లో కనీస నగదును నిర్వహించకపోయినప్పటికీ ఎలాంటి జరిమానా లేదా రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండదని కెనరా బ్యాంక్ స్పష్టం చేసింది. ఇంతక్రితం బ్యాంక్ ఖాతాదారులు తమ పొదుపు ఖాతాల్లో కనీస నిల్వను ఉంచాల్సి వచ్చేది. ఖాతాలోని కనీస నిల్వ నెల రోజుల సగటు బ్యాంక్ నిర్దేశిత పరిమితి కంటే తగ్గితే పెనాల్టీ చెల్లించాల్సి వచ్చేది.

సంగీత 51వ వార్షికోత్సవ ఆఫర్లు



సంగీత వ్యవస్థాపకులు నారాయణ రెడ్డితో ఎండీ సుభాష్ చంద్ర, డైరెక్టర్ చందు రెడ్డి

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): రిటైల్ మొబైల్ వ్యాపారంలో కీలకంగా ఉన్న 'సంగీత' మొబైల్స్ 51వ వార్షికోత్సవం సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ సందర్భంగా సంగీత వ్యవస్థాపకులు ఎల్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. సంగీత వార్షికోత్సవం కోసం ఏటా వినియోగదారులు ఎదురు చూసేలా పలు ఆఫర్లు ప్రకటిస్తున్నామన్నారు. 51వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంగీత మొబైల్ స్టోర్‌ను సందర్శించే ప్రతి ఒక్కరికి వ్యాలెట్ ద్వారా రూ.5,001 మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేయనున్నట్లు తెలిపారు. మొబైల్‌తో పాటు ఏ వస్తువు కొనుగోలు చేసినా ఆఫర్ కింద రూ.2,500 వరకు వ్యాలెట్ నుంచి జమ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా మారుతున్న కాలానికి అనుగుణంగా మొబైల్స్‌తో పాటు అన్ని రకాలైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు అందుబాటులోకి తెచ్చినట్లు సంగీత డైరెక్టర్ చందు రెడ్డి తెలిపారు. ఢిల్లీ, ముంబైలతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లోని తమ షోరూమ్స్‌లో మొబైల్ కొనుగోలు చేస్తే 30 నిమిషాల్లో డోర్ డెలివరీ చేస్తున్నట్లు చందు తెలిపారు.

జూన్‌లో వచ్చే ఆర్థిక మార్పులివే..

జూన్‌లో ఫైనాన్షియల్ మార్కెట్లో పలు మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సొమ్ము ఉపసంహరణ, ఆధార్ ఉచిత అప్‌డేట్స్, క్రెడిట్ కార్డు విధానాలు సహా మరికొన్నింటిలోనూ మార్పులు చేర్పులు అమల్లోకి రానున్నాయి. అవేమిటంటే..



క్రెడిట్ కార్డులు

క్రెడిట్ కార్డుల ద్వారా విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లలోని లాంజ్ సదుపాయాల్ని వినియోగించుకునే విధానాలు ఈ నెల నుంచి మారనున్నాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్: టాటా న్యూ ఇన్ఫినిటీ, టాటా న్యూ ప్లస్ క్రెడిట్ కార్డు వినియోగదారులు విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లలో లాంజ్ (విశ్రమించే చోటు) సదుపాయాల్ని వినియోగించుకునే విధానంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్పులు చేసింది. ఇక నుంచి ఇలా వెళ్లి అలా కార్డు స్వైప్ చేసి లాంజ్ సదుపాయాలు ఉపయోగించుకోవడం కుదరదు. తమ క్రెడిట్ కార్డు ద్వారా గత మూడు నెలల్లో చేసిన ఖర్చుల ఆధారంగా బ్యాంకులు ఇక వోచర్లు ఇస్తాయి. ఆ వోచర్ల ఆధారంగానే ఈ లాంజ్‌ల్లో ప్రవేశం లభిస్తుంది. క్రెడిట్ కార్డుల వినియోగాన్ని పెంచడంతో పాటు ప్రయోజనాల్ని క్రమబద్ధం చేసేందుకు ఈ నెల 10 నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈ విధానం అమలు చేయనుంది.

యాక్సిస్ బ్యాంక్: యాక్సిస్ బ్యాంక్ ఈ నెల 20 నుంచి తన రివార్డ్ క్రెడిట్ కార్డుపై రివార్డులు, ఫీజు మినహాయింపు విధానంలో మార్పులు చేస్తోంది. ఈ కార్డులపై ఇక ఈ ప్రయోజనాలను వివిధ (రెంట్, వ్యాలెట్, ఇంధన ఖర్చులు వంటివి) ఖర్చుల ఆధారంగా నిర్ణయిస్తారు. ఇప్పటి వరకు వీటిని నాలుగు అంకెల మర్చంట్ కోడ్స్ ఆధారంగా నిర్ణయించేవారు.

కోటక్ మహీంద్రా బ్యాంక్: ఈ నెల 1 నుంచే కోటక్ మహీంద్రా బ్యాంక్ తన క్రెడిట్ కార్డుల ఫీజు విధి విధానాలను సవరించింది. స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్స్ పాటించడంలో వైఫల్యం, డైనమిక్ కరెన్సీ కన్వర్షన్ (ఇతర దేశాల్లో ప్రయాణించేటప్పుడు కార్డు ద్వారా మన దేశ కరెన్సీలోనే చెల్లించడం), కరెంట్, డీటీహెచ్, గ్యాస్ వంటి యుటిలిటీ బిల్లుల చెల్లింపులు, విద్యకు సంబంధించి చేసే లావాదేవీల చెల్లింపులు, వ్యాలెట్ టాప్ అప్స్, పెట్రోల్, డీజిల్ చెల్లింపులు, నైపుణ్యాల ఆధారిత ఆన్‌లైన్ గేమ్స్ కోసం చేసే చెల్లింపులకు సవరించిన ఈ ఫీజు విధానం వర్తిస్తుంది. దీనికి తోడు కనీస బాకీ మొత్తాన్ని (ఎంఏడీ) లెక్కించే విధానాన్నీ బ్యాంక్ మార్చివేసింది.

ఈపీఎఫ్ఓ 3.0

పీఎఫ్ డబ్బులు విత్‌డ్రా చేయడం, నో యువర్ కస్టమర్ (కేవైసీ) అప్‌డేట్ చేయడం ఇప్పుడో పెద్ద ప్రహసనం. ఈ కష్టాలకు చెక్ పెట్టేందుకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ).. ఈపీఎఫ్ఓ 3.0 పేరుతో ఈ నెల కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకురాబోతోంది. దీని ద్వారా క్లెయిమ్స్‌ను త్వరగా ప్రాసెస్ చేసే అవకాశం కల్పించనుంది. వీటికి తోడు డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా బ్యాంకు ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రా చేసుకున్నట్టుగా పీఎఫ్ విత్‌డ్రాయల్స్ కోసం కూడా ప్రత్యేక కార్డులు తీసుకురానుంది.

టీడీఎస్ సర్టిఫికెట్

మీరు ఉద్యోగి అయితే ఈ నెల 15లోగా మీరు పని చేస్తున్న ఆఫీస్ నుంచి ఫారమ్-16, ఫారమ్-16ఏతో పాటు టీడీఎస్ సర్టిఫికెట్ తీసుకోవాలి. తప్పులు లేకుండా ఐటీ రిటర్న్ ఫైల్ చేసేందుకు ఇవి తప్పనిసరి అనే విషయం మర్చిపోకూడదు.

అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపు

అడ్వాన్స్ ట్యాక్స్ తొలి కిస్తీని కూడా ఈ నెల 15లోగా చెల్లించాలి. జీతంతో పాటు డిపాజిట్లపై వడ్డీ, అద్దెలు, మూలధన లాభాలు ఉండి టీడీఎస్, టీసీఎస్ పోను రూ.10,000 లేదా అంతకంటే ఎక్కువ ఆదాయ పన్ను చెల్లించాల్సిన వ్యక్తులకు ఇది వర్తిస్తుంది. మొత్తం చెల్లించాల్సిన ఆదాయ పన్నులో తొలి కిస్తీ కింద 15 శాతం అడ్వాన్స్ ట్యాక్స్‌గా చెల్లించాలి. ఈ ట్యాక్స్ చెల్లించకపోయినా, ఆలస్యం చేసినా నెలకు ఒక శాతం చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

ఆధార్ అప్‌డేట్

ఆధార్ వివరాల ఉచిత అప్‌డేట్ గడువు కూడా ఈ నెల 14తో ముగుస్తోంది. మై ఆధార్ పోర్టల్ ద్వారా ఈ అప్‌డేట్ పూర్తి చేసుకోవాలి. ఆ తర్వాత ఆఫ్‌లైన్‌లో ఆధార్ కేంద్రాల వద్ద అప్‌డేట్ చేయించుకోవాలంటే ఫీజు చెల్లించక తప్పదు.

ఓవర్ నైట్ ఫండ్స్ కటాఫ్ టైమ్

మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)కు చెందిన ఓవర్ నైట్ ఫండ్స్ యూనిట్ల రిడంప్షన్, కేటాయింపుల విధానం ఈ నెల 1 నుంచి మారుతోంది. ట్రేడింగ్ రోజుల్లో మధ్యాహ్నం మూడు గంటల వరకు వచ్చిన అప్లికేషన్లకు అంతకు ముందు రోజు ఉన్న ఎన్ఏవీ ఆధారంగా, ఆ తర్వాత వచ్చిన అప్లికేషన్లకు ఆ తర్వాతి రోజు ఎన్ఏవీ ఆధారంగా యూనిట్ల కేటాయింపు లేదా రిడంప్షన్స్ ఉంటాయి.

క్యాపిటల్ గూడ్స్ అమ్ముతుంటే?

ఇదీ GST


రాంబాబు గొండాల

చాలా రకాల పరిశ్రమల్లో యంత్ర సామాగ్రిని తరచుగా మార్చాల్సిన అవసరం వస్తుంది. దీనికి కారణాలు అనేకం. ఉదాహరణకు టెక్స్‌టైల్ వంటి పరిశ్రమలో వాడే మగ్గాలు, రంగులు అద్దె ఇతర సామాగ్రి తొందరగా అరిగిపోవటంతో వాటిని మార్చాల్సిన అవసరం వస్తుంది. ఇలాంటి సందర్భాల్లో పాత యంత్రాలను అమ్ముతుంటారు. మరి వీటి మీద జీఎస్‌టీ ఎలా చెల్లించాలి?

ఈ యంత్రాలను లేదా యంత్ర పరికరాలను అంటే మెషిన్ లేదా మిషనరీ మొదలైన వాటిని జీఎస్‌టీ పరిభాషలో క్యాపిటల్ గూడ్స్ అంటారు. అంటే, ఏ వస్తువులను అయితే తమ అకౌంట్స్‌లో క్యాపిటలైజ్ చేస్తారో వాటిని క్యాపిటల్ గూడ్స్‌గా వ్యవహరిస్తారు. మరి ఈ క్యాపిటల్ గూడ్స్‌ను తిరిగి అమ్మినప్పుడు జీఎస్‌టీ చెల్లించటానికి ఒక విధానం ఉంది. ఉదాహరణకు ఒక పరిశ్రమ ఒక యంత్రాన్ని లేదా క్యాపిటల్ గూడ్స్‌ను కొనుగోలు చేసినప్పుడు వాటి మీద చెల్లించిన జీఎస్‌టీని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద తీసుకోవచ్చు. ఈ క్యాపిటల్ గూడ్స్ జీవిత కాలం జీఎస్‌టీ కింద 20 త్రైమాసికాలుగా నిర్ధారించారు. అంటే, కనీసం 5 సంవత్సరాలు ఆయా వస్తువులను వాడితేనే దానికి సంబంధించి తీసుకున్న ఐటీసీ మొత్తానికి అర్హత లభిస్తుంది. లేదంటే ఎంత కాలమైతే వాడారో అంత మేరకే అర్హత ఉంటుంది. మిగతాది రివర్స్ చేయాల్సి ఉంటుంది.

దీన్ని ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం. ఒక కంపెనీ తన పరిశ్రమ కోసం కొన్ని యంత్రాలను కొనుగోలు చేసింది. వీటి విలువ రూ.2 లక్షలు. కాగా దీని మీద 18 శాతం చొప్పున రూ.36,000 తీసుకోవటం జరిగింది. దీనికి సంబంధించిన ఇన్వాయిస్ 2002 జనవరి 1న పొందటం జరిగింది. ఈ యంత్రాలను తిరిగి 2023 సెప్టెంబరు 15న అమ్మారనుకుందాం. అప్పుడు ఆ కంపెనీ ఆ యంత్రాలను 6 త్రైమాసికాల రెండు నెలల పైచిలుకు వాడినట్లు అర్థం. సంబంధిత నియమం ప్రకారం ఒక త్రైమాసికం దాటి ఒక్క రోజు గడిచినా తదుపరి త్రైమాసికం కింద లెక్కించాలి. కాబట్టి సదరు యంత్రాలను 7 త్రైమాసికాల పాటు వాడినట్లు భావించాలి.

మొత్తం జీవిత కాలం 20 త్రైమాసికాలు కాబట్టి మిగిలిన 13 త్రైమాసికాలకు సరిపోను క్రెడిట్‌ను అర్హత లేనిదిగా భావించాలి. ఆ విధంగా లెక్కిస్తే రివర్స్ చేయాల్సిన మొత్తం రూ.23,400 అవుతుంది (36,000 x 13/20). ఇప్పుడు ఆ యంత్రాల వాస్తవ అమ్మకపు విలువ రూ.1,40,000 అనుకుందాం. దీని మీద 18 శాతం జీఎస్‌టీ లెక్కిస్తే పన్ను విలువ రూ.25,200 అవుతుంది. అంటే రివర్స్ చేయాల్సిన మొత్తం కంటే పన్ను విలువ ఎక్కువ ఉంది. కాబట్టి ఎక్కువ ఉన్న విలువ చెల్లించాల్సి ఉంటుంది. అలాకాకుండా ఒకవేళ ఆ యంత్రాల అమ్మకపు విలువ రూ.లక్ష అనుకుందాం. అప్పుడు చెల్లించాల్సిన పన్ను రూ.18,000 మాత్రమే అవుతుంది. ఇలాంటి సందర్భంలో రివర్స్ చేయాల్సిన మొత్తం అంటే రూ.23,400 ఎక్కువ కనుక ఆ మొత్తం పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. కానీ, ఇన్వాయిస్‌లో యదార్థ అమ్మకపు విలువ దానికి సంబంధించిన పన్ను మాత్రమే చూపాలి. అలాగే కొనుగోలుదారుడు కూడా ఇన్వాయిస్ చూపిన పన్నునే క్రెడిట్ కింద తీసుకోవాలి. అంటే మొదటి ఉదాహరణలో ఎలాగు చెల్లించాల్సిన పన్ను విలువే (ఇన్వాయిస్ ప్రకారం) ఎక్కువ ఉంది కాబట్టి ఎలాంటి సమస్య లేదు. రెండో ఉదాహరణలో ఇన్వాయిస్ చూపేది రూ.18,000 కాగా చెల్లించాల్సింది రూ.23,400. కాబట్టి జీఎస్‌టీఆర్-1లో ఇన్వాయిస్ విలువ రూ.1,00,000, పన్ను కింద రూ.18,000 చూపాలి. అంటే యదార్థ విలువే చూపించాలి. కాగా, వ్యత్యాసం ఉన్న రూ.5,400 జీఎస్‌టీఆర్-3బీ లో రివర్సల్ కాలమ్‌లో చూపాలి.

అయితే ఇక్కడ మరొక విషయం ఉంది. ఈ రివర్స్ చేసే విషయంలో త్రైమాసికాల బదులు నెలలను పరిగణనలోకి తీసుకోవాలని జీఎస్‌టీలోని మరొక నిబంధన తెలుపుతుంది. అంటే 20 త్రైమాసికాల బదులు 60 నెలలను తీసుకోవాలి. ఈ విధంగా తీసుకున్నా జీవితకాలం 5 సంవత్సరాలే వస్తుంది. కానీ, రివర్స్ చేయాల్సిన మొత్తంలో కొద్దిగా మార్పు ఉంటుంది. పై ఉదాహరణే నెలల ప్రకారం తీసుకుంటే, యంత్రాలను 20 నెలల పైచిలుకు అంటే 21 నెలల తర్వాత అమ్మినట్లు. కనుక 60 నెలల్లో మిగిలిన 39 నెలలకు సరిపోను క్రెడిట్‌ను లెక్కించాలి. ఈ ఉదాహరణలో ఈ విధంగా లెక్కించినా రివర్స్ చేయాల్సిన మొత్తం రూ.23,400 వస్తుంది కాబట్టి ఎలాంటి సమస్య లేదు. కానీ, కొన్ని సందర్భాల్లో నెలవారీ విధానంలో ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది.

ఉదాహరణకు 2023 సెప్టెంబరు బదులుగా ఆగస్టు లేదా జూలై నెలలో యంత్రాలను అమ్మి ఉంటే త్రైమాసిక విధానంలో ఎలాంటి మార్పు ఉండదు. కానీ, నెలవారీ విధానంలో ఎక్కువ రివర్స్ చేయాల్సి ఉంటుంది. కాబట్టి క్యాపిటల్ గూడ్స్ అమ్మేటప్పుడు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలి. ఒకవేళ కొనుగోలు సమయంలో ఎలాంటి ఐటీసీ తీసుకోకుంటే ఈ రెండు విధానాలను పాటించాల్సిన అవసరం లేదు. ఇన్వాయిస్ ప్రకారం పన్ను చెల్లిస్తే సరి పో

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక్ 100 గుడ్లు)

జూన్ 1వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	100
కర్నూలు	110	నెల్లూరు	105
విశాఖపట్నం	106	అనంతపురం	105
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,310 ▲	89,150 ▼	1,10,500 ▼
విజయవాడ	98,300 ▲	92,500 ▲	99,500 ▼
విశాఖపట్నం	97,310 ▼	89,200 ▲	1,10,900 ▼
రాజమండ్రి	97,310 ▲	89,200 ▲	99,800 ▼
ప్రొద్దుటూరు	95,600 ▲	87,950 ▲	98,300 ▼
ముంబై	95,355 ▲	87,345 ▼	97,458 ▼



అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి కమిటీని ఏర్పాటు చేయాలని, నిర్ణీత గడువులోగా కమిటీ పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని అన్నారు. రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవుల సంరక్షణ, నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు ఉండాలన్నారు. మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కాలేజీలు, వ్యవసాయ యూనివర్సిటీ, కాలేజీలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని, కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్వహణ, సంరక్షణలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణకు సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పరిశీలించారు. షెడ్ల నిర్మాణం, ఇతర డిజైన్లలో పలు మార్పులను సూచించారు. మరో నాలుగైదు రోజుల్లోగా తుది నమూనాను ప్రభుత్వం ఖరారు చేయనుంది.

మా కుమారుడి వివాహానికి రండి!

సీఎంకు నాగార్జున దంపతుల ఆహ్వానం

ఈ నెల 6వ తేదీన తమ కుమారుడు అఖిల్ వివాహానికి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని సినీ నటుడు అక్కినేని నాగార్జున, అమల దంపతులు ఆహ్వానించారు. శనివారం సీఎం రేవంత్‌ను ఆయన నివాసంలో కలిసిన వారు.. వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఫారం-6

(ప్రాథమిక ప్రకటన)

(తెలంగాణ సవరణ చట్టం 2016లోని చాప్టర్ IIIఎ లోని 10ఎ అనుసరించి)

(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)

(నిబంధన 6/12 చూడుము)

తెలంగాణ ప్రభుత్వము

రెవెన్యూ (భూసేకరణ) శాఖ

గెజిట్ నెం. 31 /2025/ తేది: 30.05.2025

జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి ఫైల్ నెం. ఇ/2435/2025 తేది: 26.05.2025

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (L.A) యాదాద్రి భువనగిరి ఫైల్ నెం. ఎ/10/2025 తేది: 21.05.2025

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామములో విస్తీర్ణం ఎ. 23.17 1/2 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమై యున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీ చేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం. 108 I& CAD (LA. R&R/A2) Department Dt: 31.10.2017 ద్వారా బునాదిగాని కాలువ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరావాస కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం-2013లోని చాప్టర్-2 (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్-3 (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

ఇట్టి ప్రాజెక్టు పునరావాసం మరియు పునరుపాధి కల్పనకు అదనపు కలెక్టర్ (రెవిన్యూ) యాదాద్రి భువనగిరి గారిని కార్యనిర్వాహకునిగా (అడ్మినిస్ట్రేటర్)గా నియమించనైనది.

కావున, పైన తెలిపిన బునాదిగాని కాలువ నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామములో విస్తీర్ణం ఎ. 23.17 1/2 గుంటల భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

జిల్లా: యాదాద్రి భువనగిరి మండలం: బీబీనగర్ గ్రామం: బ్రాహ్మణపల్లి

సర్వే నెం./భూ స్వభావం విస్తీర్ణము	పట్టాదారు పేరు మరియు తండ్రి/భర్త పేరు	అనుభవదారు పేరు మరియు తండ్రి/భర్త పేరు	విస్తీర్ణం(ఎ గుంటలు)	బావి/ వృక్షాలు
35 ఇంస్కీ/ పట్టా 0.12	కిడింబి కృష్ణ తండ్రి కె.ఎస్.రామానన్	నివాస గృహాలు/ఇళ్ళస్థలాలు	0.12	–
	కందడి ధర్మారెడ్డి తండ్రి పెంటారెడ్డి	నివాస గృహాలు/ఇళ్ళస్థలాలు		–
	తుపెళ్ళి రవికుమార్ రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి	తుపెళ్ళి రవికుమార్ రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి		–
	తుపెళ్ళి రవికుమార్ రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి	తుపెళ్ళి రవికుమార్ రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి		–
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
	బలిజే హరీష్‌కుమార్ తండ్రి పెంటయ్య	బలిజే హరీష్‌కుమార్ తండ్రి పెంటయ్య		–
	కానసగొట్టు నాగరాజు తండ్రి వైకుంఠం	కానసగొట్టు నాగరాజు తండ్రి వైకుంఠం		–
	పొద్దటూరి రాఘవేందర్ తండ్రి పెంటయ్య	పొద్దటూరి రాఘవేందర్ తండ్రి పెంటయ్య		–
	ఎస్. శ్రీకాంత్ రెడ్డి తండ్రి భూపాల్‌రెడ్డి	ఎస్. శ్రీకాంత్ రెడ్డి తండ్రి భూపాల్‌రెడ్డి		–
49 ఇంస్కీ/ పట్టా 1.02 1/2	[illegible]	[illegible]	1.02 1/2	[illegible]
	SANDSTONE INFRA	SANDSTONE INFRA		
50 ఇంస్కీ/ పట్టా 0.07	[illegible]	[illegible]	0.07	[illegible]
51 ఇంస్కీ/ పట్టా 0.27	[illegible]	[illegible]	0.27	[illegible]
53 ఇంస్కీ/ పట్టా 0.17	[illegible]	[illegible]	0.17	[illegible]
37 ఇంస్కీ/ పట్టా 0.12	[illegible]	[illegible]	0.12	[illegible]
54 ఇంస్కీ/ పట్టా	[illegible]	[illegible]	0.39	[illegible]
43 ఇంస్కీ/ పట్టా 1.39	[illegible]	[illegible]	1.39	[illegible]
55 ఇంస్కీ/ పట్టా 1.06 1/2	[illegible]	[illegible]	1.06 1/2	[illegible]
44 ఇంస్కీ/ పట్టా 0.06 1/2	[illegible]	[illegible]	0.06 1/2	[illegible]
72 ఇంస్కీ/ పట్టా 0.28	[illegible]	[illegible]	0.28	[illegible]
76 ఇంస్కీ/ పట్టా 1.05	[illegible]	[illegible]	1.05	[illegible]
47 ఇంస్కీ/ పట్టా 1.01	[illegible]	[illegible]	1.01	[illegible]
77 ఇంస్కీ/ పట్టా 0.01	[illegible]	[illegible]	0.01	[illegible]
48 ఇంస్కీ/ పట్టా 0.02	[illegible]	[illegible]	0.02	[illegible]
78 ఇంస్కీ/ పట్టా 1.28 1/2	కొంతం మాధవి భర్త సత్తిరెడ్డి	కొంతం మాధవి భర్త సత్తిరెడ్డి	1.28 1/2	–
	కొంతం సత్తిరెడ్డి తండ్రి యాదిరెడ్డి	కొంతం సత్తిరెడ్డి తండ్రి యాదిరెడ్డి		–
79 పట్టా/ ఇంస్కీ 2.36 1/2	[illegible]	[illegible]	2.36 1/2	[illegible]
81 ఇంస్కీ/ పట్టా 0.29	[illegible]	[illegible]	0.29	[illegible]
84 ఇంస్కీ/ పట్టా	[illegible]	[illegible]	[illegible]	[illegible]
85 ఇంస్కీ/ పట్టా	[illegible]	[illegible]	0.14	[illegible]
182 ఇంస్కీ/ పట్టా 0.03	[illegible]	[illegible]	0.03	[illegible]
184 ఇంస్కీ/ పట్టా 1.29	[illegible]	[illegible]	[illegible]	[illegible]
185 ఇంస్కీ/ పట్టా 1.18	[illegible]	[illegible]	1.18	[illegible]
186 ఇంస్కీ/ పట్టా 1.25	[illegible]	[illegible]	1.25	[illegible]
	డొంతిరి వినోద్ సాగర్ రెడ్డి తండ్రి నర్సింహా రెడ్డి	డొంతిరి వినోద్ సాగర్ రెడ్డి తండ్రి నర్సింహా రెడ్డి		–
188 ఇంస్కీ/ పట్టా 1.07	[illegible]	[illegible]	1.07	[illegible]
189 ఇంస్కీ/ పట్టా 1.07	[illegible]	[illegible]	1.07	[illegible]
200 ఇంస్కీ/ పట్టా 0.12	[illegible]	[illegible]	0.12	[illegible]
	తండ్రి జగదీశ్వర్	తండ్రి జగదీశ్వర్		–
	మురకంటి బాల్ రెడ్డి తండ్రి ముత్యం రెడ్డి	మురకంటి బాల్ రెడ్డి తండ్రి ముత్యం రెడ్డి		–
	నెదునూరి నర్సిరెడ్డి తండ్రి ఎల్లారెడ్డి	నెదునూరి నర్సిరెడ్డి తండ్రి ఎల్లారెడ్డి		–
	ఐవస్ వెనుప ప్రైవేట్ లిమిటెడ్ కిడారి కృష్ణవేణి	నివాసగృహాలు/ఇళ్ళ స్థలాలు		–
	ఐవస్ వెనుప ప్రైవేట్ లిమిటెడ్ కిడారి కృష్ణవేణి	ఇండస్ట్రీస్		–
		మొత్తం:	23.17	

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) యొక్క నిబంధనలను అనుసరించి సంబంధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టుటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి నోటిఫికేషన్‌లో ప్రకటించిన భూములను సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు/తాకట్లు మొదలగు చర్యలు చేపట్ట రాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేది నుండి 60 (అరవై) దినములలోపు జిల్లా కలెక్టరు/అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియచేయవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా

సం/- అదనపు కలెక్టర్ యాదాద్రి భువనగిరి

సం/- జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి

DIPR RO.NO:172/LA-PP/ADVT/PUBLICATION/2025-26

ఎన్కెపల్లిలో గోశాల ఏర్పాటుకు ప్రణాళిక

» 99.12 ఎకరాల్లో నిర్మాణానికి అధికారుల ప్రతిపాదనలు

మొయినాబాద్, మే, 31 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని ఎన్కెపల్లిలో గోశాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఎన్కెపల్లిలోని సర్వే నెంబర్ 180లో ఉన్న 99.12 ఎకరాల ప్రభుత్వ భూమిలో దానిని ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అయితే, ఆ భూమిలో యాభై ఏళ్లుగా గ్రామానికి చెందిన సుమారు 60 మందికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన రైతులు సాగు చేసుకుంటున్నారు. ఆ భూమికి సంబంధించి తమకు పట్టాలు ఇవ్వాలని గతంలో ప్రభుత్వానికి అర్జీలు కూడా పెట్టుకున్నారు. ఆ స్థలంలో గోశాల ఏర్పాటు చేస్తున్నారని తెలియడంతో రెవెన్యూ అధికారులను, స్థానిక ఎమ్మెల్యేను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. సాగులో ఉన్న తమకు హక్కులు కల్పించాలని కోరారు. కాగా, నగరానికి చేరువలో ఎన్కెపల్లిలో గోశాల ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గుచూపుతోంది. రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగానే ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

రాజన్న గోశాలకు వంద ఎకరాలు కేటాయించాలి

» విశ్వహిందూపరిషత్ డిమాండ్

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న గోశాలకు వంద ఎకరాలు కేటాయించాలని వీహెచ్‌పీ డిమాండ్ చేసింది. హిందువుల మనోభావాలను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి కోరారు. గోశాలలో ఒక్కరోజే 12 కోడెదూడలు చనిపోవడం అత్యంత విషాదకరమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో రాజరాజేశ్వరుడికి కోడెదూడలను సమర్పిస్తున్న భక్తుల మనోభావాలను గాయపరిచేలా అధికారులు వ్యవహరిస్తున్నారని బాలస్వామి ఆరోపించారు.

ఎనిమిది మంది మావోయిస్టుల లొంగుబాటు

ములుగు, మే 31 (ఆంధ్రజ్యోతి): ములుగులో 8 మంది మావోయిస్టు సభ్యులు జిల్లా ఎస్పీ శబరిష్ ఎదుట శనివారం లొంగిపోయారు. వారికి ప్రభుత్వం తరఫున రూ.25 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శబరిష్ మాట్లాడుతూ.. లొంగిపోయిన వారిలో మావోయిస్టు డివిజనల్ కమిటీ సభ్యుడు ఒకరు, ఏరియా కమిటీ సభ్యులు ఇద్దరు, పార్టీ సభ్యులు ముగ్గురు, మిలీషియా సభ్యులు ఇద్దరు ఉన్నారని తెలిపారు.

మేం లేవనెత్తిన అంశాలను చేర్చలేదు

» గోదావరి బోర్డు సమావేశ మినిట్స్‌పై తెలంగాణ తీవ్ర ఆక్షేపణ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశంలో తాము లేవనెత్తిన అంశాలను మినిట్స్‌లో చేర్చకపోవడాన్ని తెలంగాణ తీవ్రంగా ఆక్షేపించింది. తాము ప్రస్తావించిన అంశాలు యథాతథంగా మినిట్స్‌లో రికార్డు కాలేదంటూ గోదావరి బోర్డు చైర్మన్ ఏకే ప్రధాన్‌కు తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ శుక్రవారం (ఈ నెల 30న) లేఖ రాశారు. బోర్డు అనేది తెలుగు రాష్ట్రాల అధికారులతో కూడిన విభాగమని, ఛైర్మన్‌కు ప్రత్యేకంగా, ఏకపక్షంగా ఎలాంటి అధికారాలు ఉండవని స్పష్టం చేశారు. బోర్డు సభ్యకార్యదర్శిపై ఆరోపణలపై విచారణ కోసం ప్రత్యేకంగా కమిటీ వేయాలని తెలుగు రాష్ట్రాలు డిమాండ్ చేయగా సమావేశంలో అంగీకారం తెలిపి.. తర్వాత బోర్డు సభ్యకార్యదర్శి వ్యవహారశైలిపై చర్చించే అధికారం తెలుగు రాష్ట్రాలకులేదని ఎలా మినిట్స్‌లో చేర్చుతారని ప్రశ్నించారు.

జైలు శిక్షను సస్పెండ్ చేయొద్దు

» గాలి జనార్దన్‌రెడ్డి పిటిషన్‌పై సీబీఐ కౌంటర్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో దోషిగా తేలిన మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డికి ఎలాంటి ఊరట కల్పించరాదని సీబీఐ హైకోర్టును కోరింది. ఆయనకు ప్రజాసేవ చేయడం కంటే వ్యక్తిగతంగా లబ్ధిపొందడంపైనే ఎక్కువ దృష్టి ఉందని అభిప్రాయపడింది. ఓఎంసీ కేసులో సీబీఐ కోర్టు విధించిన ఏడేళ్ల జైలుశిక్ష తీర్పును సస్పెండ్ చేయడంతోపాటు, బెయిల్ మంజూరు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని గాలి జనార్దన్‌రెడ్డి సహా ఇతర ముద్దాయిలు హైకోర్టును ఆశ్రయించారు. వీటిని వెకేషన్ కోర్టు జడ్జీలు ఎవరూ ఇంకా విచారణకు స్వీకరించలేదు. అయినప్పటికీ సీబీఐ ఆ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ కౌంటర్ దాఖలు చేసింది. ఒక ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవచేయడం కంటే వ్యక్తిగతంగా లబ్ధిపొందడంపైనే ఆయన దృష్టి ఉన్నట్టు కనిపిస్తోందని పేర్కొంది. ఆయనకు ఎలాంటి ఊరట కల్పించరాదని హైకోర్టుకు సీబీఐ విజ్ఞప్తి చేసింది.

జూన్ నెలాఖరుదాకా ఎల్ఆర్ఎస్ రాయితీ!

» అధికారుల ప్రాథమిక నిర్ణయం.. ఇదే చివరి అవకాశం!

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) ఫీజుపై ఇస్తున్న 25శాతం రాయితీ పథకాన్ని జూన్ చివరి వరకు కొనసాగించాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. పురపాలక శాఖ ఉన్నతాధికారులు సెలవుల్లో ఉన్నందున ఇందుకు సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉన్నట్టు తెలిసింది. మార్చి నుంచి మూడు నెలల పాటు రాయితీ ఇచ్చారు. అయితే మే నెల ఆదాయంలో ఆశించిన పురోగతి కనిపించలేదని క్షేత్రస్థాయి అధికారులు చెబుతున్నారు. దీంతో జూన్ నెలాఖరు వరకు రాయితీ పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

15 వేలు లంచం తీసుకుంటూచిక్కిన సర్వేయర్

» సర్వేయర్ల శిక్షణ శిబిరంలోనే పట్టుకున్న అధికారులు

సిరిసిల్ల, మే 31(ఆంధ్రజ్యోతి): భూ సర్వే పంచనామా ధ్రువీకరణ పత్రం జారీకి ఓ రైతు నుంచి రూ.15 వేలు లంచం తీసుకున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ల్యాండ్ సర్వేయర్ మల్లోజు నాగరాజును ఏసీబీ అధికారులు శనివారం అరెస్టు చేశారు. సిరిసిల్లలోని చంద్రంపేట రైతు వేదిక వద్ద నిర్వహించిన సర్వేయర్ల శిక్షణ శిబిరం వద్దే నాగరాజును పట్టుకోవడం గమనార్హం. ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయంలో ల్యాండ్ సర్వేయర్‌గా ఉన్న మల్లోజు నాగరాజును.. అదే మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన జక్కపురం మల్లేశం అనే రైతు తనకు చెందిన 6 గుంటల స్థలం హద్దులు నిర్ణయించి ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని కోరాడు. ఇందుకు నాగరాజు రూ.లక్ష లంచం డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో సర్వేయర్ల శిక్షణ తరగతుల వద్ద మల్లేశం నుంచి నాగరాజు రూ.15వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

క్రిమినల్ కేసుల దర్యాప్తునకు బృందాలు ఉండాలి

» శిక్షణ లేక కొరవడిన నాణ్యత.. హైకోర్టు వ్యాఖ్యలు

» లైంగికదాడి కేసులో డీఆర్‌డీఏ అధికారికి విముక్తి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): క్రిమినల్ కేసుల దర్యాప్తునకు ప్రత్యేక విభాగం, ప్రత్యేక శిక్షణ పొందిన నిపుణులతో కూడిన బృందాలు ఉండాలని హైకోర్టు అభిప్రాయపడింది. క్రిమినల్ కేసుల దర్యాప్తు చేపడుతున్న పోలీసు అధికారులకు శాంతిభద్రతలు సహా అనేక బాధ్యతలు ఉంటున్నాయని, అందువల్ల దర్యాప్తులో నాణ్యత దిగజారిపోతోందని వ్యాఖ్యానించింది. కేసును కేటాయించిన దర్యాప్తు అధికారికి తన బాధ్యతలు ఏమిటో నిర్దిష్టంగా ముందే చెప్పాలని, అందుకు ఆ అధికారి జవాబుదారీగా ఉండాలని సూచించింది. లైంగికదాడి కేసులో డీఆర్‌డీఓ అధికారికి విముక్తి కలిగిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. స్నేహితురాలి కుమార్తెపై లైంగికదాడికి పాల్పడినట్లు శామీర్‌పేట్ డీఆర్‌డీవోలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న కల్నల్ రిషి శర్మపై కేసు నమోదైంది. ఈ కేసులో శర్మను దోషిగా తేల్చిన రంగారెడ్డి జిల్లా సెషన్స్ కోర్టు కం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జీవితఖైదు విధించింది. దీనిపై ఆయన హైకోర్టులో అప్పీల్ చేయగా జస్టిస్ పి. శ్యాంకోషీ, జస్టిస్ తుకారాంజీల ధర్మాసనం విచారణ చేపట్టింది. అభియోగాలను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమయిందని తెలిపింది. కనీస ఆధారాలు లేకపోవడంతో కేసును కొట్టివేస్తున్నట్టు పేర్కొంది. ఆయనను వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశించింది.


మిస్ వరల్డ్‌గా థాయ్‌భామను ప్రకటించిన తర్వాత కరతాళ ధ్వనులతో శుభాకాంక్షలు తెలుపుతున్న సుందరీమణులు

ప్రపంచ సుందరి

థాయ్ సిరి


ప్రపంచ సుందరి సుచాత షుంగ్‌సిరి

(మొదటిపేజీ తరువాయి)

సమాధానం ఆకట్టుకుంది. 'మిస్ వరల్డ్ ప్రయాణంలో వాస్తవాలు, వ్యక్తిగత బాధ్యత గురించి మీరు నేర్చుకున్నదేమిటి?' అన్న ప్రశ్నకు బదులిస్తూ.. "మన వెన్నంటి ఒకరున్నారన్న ధైర్యమే నిజమైన విజయం. బాల్యంలో తల్లిదండ్రులు మన వెన్నంటి ఉన్నట్టుగానే.. సమస్యల్లో ఉన్నవారికి అండగా నిలబడటం నా బాధ్యతగా భావిస్తా. మన చుట్టుపక్కల ఉన్నవారితో దయాగుణంతో వ్యవహరించడమే ఈ ప్రపంచంలో అత్యుత్తమైన పనిగా విశ్వసిస్తా.." అని సుచాత సమాధానం ఇచ్చారు. ఈ సమాధానం న్యాయనిర్ణేతలను ఆకట్టుకుంది. ఆమెకు 72వ ప్రపంచ సుందరి కిరీటాన్ని అందించింది. థాయిలాండ్‌లోని ఫుకెట్‌లో 2003లో సుచాత జన్మించారు. ఆమె 16 ఏళ్ల వయస్సులోనే రొమ్ము క్యాన్సర్ బారినపడి చికిత్స తీసుకున్నారు. అప్పటి నుంచే ఆమె 'ఓపల్ ఫర్ హర్' పేరుతో మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇది ఆమెను ప్రపంచ సుందరి పోటీల్లో ఇతరులకు భిన్నంగా నిలిపింది.

టాప్-20లో నిలిచిన నందినీ గుప్తా..

ఈసారి భారత సుందరి నందినీ గుప్తాకు మిస్ వరల్డ్ కిరీటం దక్కుతుందని ఎదురుచూసిన అభిమానులకు ఆమె మధ్యలోనే వెనుదిరగడం నిరాశ మిగిలింది. ఆసియా-ఓషియానా ఖండం విభాగంలో తొలుత టాప్-10లో, తర్వాత టాప్-5లోనూ నిలిచిన నందినీ గుప్తా.. ఆ తర్వాత విభాగాల వారీగా టాప్-2ను ఎంపిక చేసిన సమయంలో.. చోటు దక్కించుకోలేకపోయారు. ఆసియా-ఓషియానా విభాగంలో ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ భామలు



టాప్-2లో నిలిచారు. చివరగా ఒక్కో విభాగం నుంచి ఒక్కొక్కరి చొప్పున ఎంపిక చేసిన ఫైనల్ పోటీలో ఆసియా-ఓషియానా విభాగం నుంచి ఓపల్ సుచాత చోటు దక్కించుకున్నారు. చివరి రౌండ్‌లో ఆకట్టుకునే సమాధానం చెప్పి మిస్‌వరల్డ్‌గా నిలిచారు. ఆమెకు రూ.8.5 కోట్ల (మిలియన్ డాలర్లు) నగదు పురస్కారంతోపాటు వజ్రాల కిరీటాన్ని నజరానాగా ఇచ్చారు.

ఫైనల్స్.. అదుర్స్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీల ముగింపు కార్యక్రమం అదుర్స్ అనిపించింది. దాదాపు నెల రోజులుగా వివిధ రకాల పోటీలు, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అందాలభామల పర్యటనలతో అలరించిన 72వ ప్రపంచ సుందరి పోటీల ముగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో తుది పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాల వెలుగులో.. అందాల తారల ర్యాంప్‌వాక్‌తో పోటీలు మొదలయ్యాయి. ఈ పోటీల్లో తెలంగాణ ప్రత్యేకమైన గుస్సాడి నృత్యం, గిరిజన జాతరలు, బోనాల సందడి, ఆదిలాబాద్ అడవులు, జోడేఘాట్‌లోని కొమురం భీమ్ మ్యూజియం, జలపాతాలు, చార్మినార్, బుద్ధవనం, చౌమహల్లా ప్యాలెస్, యాదాద్రి, రామప్ప ఆలయాలు, గోల్కొండ, పలు హస్తకళలు, చేనేత వస్త్రాల తయారీతోపాటు మరికొన్నింటిని వీడియో రూపంలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. 'తెలంగాణ జరూర్ ఆనా' లోగో అందరినీ ఆకర్షించింది. పోటీల మధ్యలో బాలీవుడ్ నటులు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ కట్టర్ చేసిన డ్యాన్స్ అందరినీ ఆకట్టుకుంది. పోటీల్లో చివరి రౌండ్ ముగిసిన అనంతరం ప్రపంచ సుందరిగా ఎంపికైన థాయ్‌లాండ్ భామ ఓపల్ సుచాతకు మిస్‌వరల్డ్ కిరీటాన్ని అలంకరించడంతో పోటీలు ముగిశాయి. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సరిగ్గా ముందుగా నిర్దేశించుకున్న 9.30 గంటలకే ముగిసింది. కాగా, కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సతీమణి గీతారెడ్డి, కుమార్తె నైమిషతో కలిసి హాజరవగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా కుటుంబ సమేతంగా హాజరయ్యారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, టాలీవుడ్ సినీపరిశ్రమ నుంచి ప్రముఖ నటులు చిరంజీవి, విజయ్ దేవరకొండ, నిర్మాత, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు.


సోనూసూద్‌కు పురస్కారం అందజేస్తున్న రానా దగ్గుబాటి

సోనుసూద్‌కు ప్రపంచ మానవతావాది పురస్కారం..

ప్రముఖ నటుడు సోనుసూద్‌కు మిస్‌వరల్డ్ ఆర్గనైజేషన్ ప్రపంచ మానవతావాది పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రముఖ నటుడు రానా అందించారు. కరోనా సమయంలో సోనుసూద్ చేసిన పలు మానవతా చర్యలకు గుర్తింపుగా ఈ అవార్డును అందించినట్టు మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు ప్రకటించారు. కాగా తెలుగు సినిమా తనకు చాలా గుర్తింపునిచ్చిందని సోనుసూద్ చెప్పారు. తనకు అవార్డును అందించిన మిస్‌వరల్డ్ ఆర్గనైజేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం "వదల బొమ్మాళీ" అంటూ అరుంధతి సినిమాలో తాను చెప్పిన డైలాగ్‌ను స్టేజీపై చెప్పడంతో ప్రేక్షకులు కేకలు వేశారు.

పాసుల ప్రహసనం..

ప్రపంచ సుందరి ముగింపు పోటీలకు పర్యాటక శాఖ చాలా తక్కువ మందికే పాసులు అందించింది. మొత్తం మూడు రకాల పాసులు జారీ చేసింది. అయితే పోటీలకు ఒక్కరోజు ముందుగానైనా ఇవ్వకుండా పోటీలు ప్రారంభమయ్యే శనివారం ఉదయం నుంచే పాసులు ఇవ్వడంతో కొంత గందరగోళం నెలకొంది. మరోవైపు సమయానికి పాసులు అందకపోవడంతో.. చాలామంది కార్యక్రమానికి ఆలస్యంగా వచ్చారు. ఇచ్చిన పాసుల కంటే ప్రేక్షకులు ఎక్కువగా రావడంతో స్టేజీకి ముందున్న ప్రముఖుల గ్యాలరీతోపాటు వెనుకవైపున్న మరో గ్యాలరీ వద్ద చాలా మంది నిలబడేపోటీలను చూడాల్సివచ్చింది. పాసులకు సరిపడా సీట్లు లేకుండా పాసులు ఎలా జారీ చేశారంటూ నిలబడిన వారంతా చర్చించుకున్నారు. కాగా, సోమవారం మిస్ వరల్డ్ విజేత.. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీ కానున్నారు. అదే రోజు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మిస్ వరల్డ్ విజేతతోపాటు ముగ్గురు ఫైనలిస్టు రాష్ట్ర ప్రభుత్వం తేనీటి విందు ఇవ్వనుంది. ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు హాజరు కానున్నారు.

జడ్జిల ప్రశ్నలకు సుందరీమణులు చెప్పినదేమంటే..

మానుషి చిల్లర్ (మిస్ వరల్డ్ 2017): తప్పుడు సమాచారంతో నిండిన ప్రపంచంలో, మీలాంటి యువ నాయకులు సత్యం, గౌరవం, కృతజ్ఞతతో ఎలా వ్యవహరించగలరు?

మిస్ మార్టినిక్: భవిష్యత్ నాయకులుగా మన దగ్గర ఉన్న సమాచారాన్ని అర్థం చేసుకోవడానికి మనం ప్రత్యేకంగా కొంత సమయాన్ని వెచ్చించాలని భావిస్తున్నాను. ప్రస్తుతం సోషల్ మీడియాలో, ఇతర సమాచారంలో వాస్తవాలేవో మనకు తెలియదు. ఏఐ యుగంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. కాబట్టి మనం కాస్త సమయాన్ని వెచ్చించి, ప్రతి సమాచారాన్ని అర్థం చేసుకోవాలి. మన హృదయం చెప్పేది నమ్మాలి.

రానా దగ్గుబాటి (నటుడు): మిస్ వరల్డ్‌పై మీ ఆలోచన ఏమిటి? ఈ పోటీలను తప్పుగా పేర్కొనే విమర్శలపై మీరు ఎలా స్పందిస్తారు?

మిస్ ఇథియోపియా: మిస్ వరల్డ్ ఇథియోపియాగా నా దేశం నుంచి చాలా విమర్శలు ఎదుర్కొన్నాను. చాలా మంది కేవలం అందాల పోటీగానే భావిస్తారు. కానీ అంతకంటే ఎక్కువ. నా వెనుక చాలా మంది పిల్లలు, తల్లులున్నారు. నేను ఇక్కడ నిలబడటం నుంచి వారు ఎంతో స్ఫూర్తి పొందుతారు. ఇంత దూరం వచ్చిన మొదటి ఇథియోపియన్ నేనే. ఇక్కడికి వచ్చినందుకు చాలా గర్వపడుతున్నాను. నేను ఇక్కడ ఉండటం కేవలం నాకోసమే కాదు. నా దేశంలోని పిల్లలు, తల్లుల కోసం అని నమ్ముతున్నాను. సేవ అంతర్లీనంగా ఉన్న ఈ పోటీల ఉద్దేశం గురించి నా దేశానికి చెప్పడమే నాలక్ష్యం.

నమ్రతా శిరోద్కర్ (నటి): తెలంగాణలో మీ అనుభవం, ఇక్కడ మీకు నచ్చిన ఒక ప్రధాన అంశం ఏమిటి?

మిస్ పోలాండ్: నా మితిమీరిన బిడియాన్ని ఈ పోటీల్లో పాల్గొని అధిగమించడమే ఇప్పటివరకు నా గొప్ప విజయంగా భావిస్తున్నాను. నేను ఇకనుంచి మరింత ఎక్కువమంది గొప్ప వ్యక్తులను నిర్భయంగా కలుస్తాను.. వారి నుంచి ప్రేరణ పొందుతాను. తెలంగాణలో నాకు ఇష్టమైన అనుభవం.. ఇక్కడి ఆతిథ్యం. ఈ దేశం, ఈ రాష్ట్రం అందించిన ఆతిథ్యం నన్ను ఎంతో ప్రభావితం చేసింది. పోలాండ్ నా మొదటి ఇల్లు, తెలంగాణ నా రెండో ఇల్లుగా అనిపిస్తోంది. ఇక్కడి ప్రజలు చిరునవ్వుతో పలకరిస్తారు.. సంతోషంగా ఆతిథ్యమిస్తారు. ఈ అనుభవాలు చిరస్మరణీయమైనవి.

సోనూ సూద్ (నటుడు): మిస్ వరల్డ్ ప్రయాణం మీకు వ్యక్తిగత బాధ్యత గురించి ఏం నేర్పింది?

మిస్ థాయిలాండ్: మిస్ వరల్డ్ వేదికపై నిలవడం నాకు జీవితంలో లభించిన గొప్ప అవకాశం. పర్యాటకులకు ఎలా ఆతిథ్యమిస్తారో అన్న విషయాన్ని నేను ఇక్కడ ప్రత్యేకంగా నేర్చుకున్నా. మన వెన్నంటి ఒకరున్నారన్న ధైర్యం ఎంతో సంతోషాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంది. బాల్యంలో తల్లిదండ్రులు తోడున్నట్టుగా జీవితంలోని ప్రతిదశలో ఎవరో ఒకరు మనకు తోడుగా నిలుస్తారు. ప్రతి ఒక్కరికీ ఈ తోడు చాలా ముఖ్యం. సమస్యల్లో ఉన్నవారికి తోడుగా నిలబడటానికి నేను ప్రాధాన్యత ఇస్తా. దయాగుణమే ప్రపంచంలో అత్యుత్తమమైనదని విశ్వసిస్తా. చుట్టుపక్కల వారితో దయతో వ్యవహరించడం కంటే గొప్పది ప్రపంచంలో మరొకటి ఉండదు.



'రైజింగ్ తెలంగాణ' సత్తా చాటాం

మిస్ వరల్డ్‌గా నిలిచిన ఓపల్ సుచాత, రన్నరప్‌లు, ఇతర పోటీదారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ప్రపంచం నలుమూలల నుంచి అందాల పోటీల కోసం వచ్చినవారంతా కూడా విజేతలేనని.. వారు అందంతోపాటు తెలివితేటలు, సమాజం కోసం చేస్తున్న మానవీయ కృషిని ప్రపంచ వేదికపై ఘనంగా చాటారని ప్రశంసించారు. ప్రపంచ సుందరి పోటీలు అద్భుతంగా సాగాయని, ప్రపంచానికి తెలంగాణ సంస్కృతి, వారసత్వం, చరిత్రను, మన విలువలను, 'తెలంగాణ రైజింగ్' సత్తాను ఘనంగా చాటిచెప్పామన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు, వేడుకలకు హాజరైన వారంతా మన రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్‌లేనని, వారు 'తెలంగాణ జరూర్ ఆనా' నినాదాన్ని ప్రపంచం నలుమూలలకూ తీసుకెళ్తారని పేర్కొన్నారు.




సీఎం రేవంత్, చిరంజీవి పక్కపక్కనే..

పోటీల కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిరంజీవి.. ఇద్దరూ వారి కుటుంబాలతో కలిసి ఒకేచోట కూర్చున్నారు. వారిద్దరు పక్కపక్కన ఉన్న వీడియో అక్కడి స్క్రీన్‌లపై కనిపించగానే చాలా మంది ఫొటోలు తీసుకున్నారు. పోటీల సందర్భంగా గతేడాది మిస్‌వరల్డ్ క్రిస్టినా ప్రిజ్కోవా ర్యాంప్‌పైకి వస్తున్న సమయంలో చిరంజీవి తన ఫోన్‌లో ఆమె ఫొటో తీసుకున్నారు.



నాటు నాటుతో.. హోరెత్తిన ప్రాంగణం

మిస్ వరల్డ్ ముగింపు పోటీల సందర్భంగా బాలీవుడ్ నటులు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ కట్టర్ పలు పాటలకు డ్యాన్స్‌లు చేశారు. జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ నటించిన ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు పాటకు' కట్టర్ స్టెప్పులు వేశారు. ఆ సమయంలో పోటీల ప్రాంగణమంతా ప్రేక్షకుల కేరింతలతో హోరెత్తింది. మిస్ వరల్డ్ పోటీదారులు కూడా వారి కుర్చీల్లో నుంచి లేచి మరీ ఆ పాటకు అనుగుణంగా డ్యాన్స్ వేయడం మరింత సందడి చేసింది. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసింది. హైటెక్స్ ప్రాంగణం ప్రధాన ద్వారం నుంచి మొదలుకుని వేదిక వరకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఎక్కడా చిన్న లోపం లేకుండా పర్యవేక్షించారు. సీఎం సహా పలు రంగాల ప్రముఖులు హాజరవడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. అయితే పోటీలు ముగిసి సీఎం, సహా ప్రముఖులు వెళ్లిపోయిన తరువాత మిస్ వరల్డ్ పోటీదారుల దగ్గరకు వెళ్లేందుకు ప్రేక్షకులు ఎగబడ్డారు. ఆ సమయంలో పోలీసులు కొద్దిసేపు అక్కడ లేకపోవడంతో పరిస్థితి ఇబ్బందిగా మారింది. స్టేజీ దగ్గరకు పోలీసులు రావాలంటూ నిర్వాహకులు మైకులో ప్రకటించిన తరువాత అక్కడికి చేరుకున్నారు. అయితే అప్పటికే చాలామంది స్టేజీ పైకి వెళ్లడంతో వారిని పంపించే క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు.


ప్రస్తుత పోటీల్లో సందడి చేసిన గత ఏడాది మిస్ వరల్డ్ క్రిస్టినా


మిస్ వరల్డ్ ఫైనల్ పోటీలకు హాజరైన ఆహ్వానితులు


ఓ పాటకు నృత్యం చేస్తున్న ఇషాన్ కట్టర్ బృందం


మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్న వివిధ దేశాల సుందరీమణులు

ర్యాంప్‌పై తూలి పడబోయిన అర్మేనియా భామ

» ఈవినింగ్ గౌన్ రౌండ్‌లో సుందరీమణుల పాట్లు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ 2025 గ్రాండ్ ఫినాలేలో భాగంగా నిర్వహించిన 'ఈవినింగ్ గౌన్' రౌండ్ అందాల భామలకు పరీక్ష పెట్టింది. వివిధ దేశాల నుంచి వచ్చిన పోటీదారులను పరిచయం చేస్తూ సాగిన ఈ రౌండ్‌లో పోటీదారులు భారీ డిజైనర్ గౌన్లు ధరించి ర్యాంప్ వాక్ చేశారు. ఈ క్రమంలో వారంతా అవస్థలు పడ్డారు. ర్యాంప్‌పై నడిచేందుకు మిస్ వరల్డ్ స్కాట్లాండ్ తీవ్రంగా ఇబ్బంది పడితే, మిస్ వరల్డ్ అర్మేనియా ఏకంగా ర్యాంప్‌పై తూలి పడిపోబోయారు. తాము ధరించిన గౌన్లు కాళ్లకు అడ్డం పడుతుంటే కాంబోడియా, చైనా తదితర దేశాల వనితలు కూడా ర్యాంప్ వాక్‌కు కష్టపడ్డారు. ఇక, ఈ రౌండ్‌లో మిస్ వరల్డ్ ఇండియా నందినీ గుప్తా ర్యాంప్ మీదికి రాగానే ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు. ఫిలిప్పైన్స్, థాయ్‌లాండ్, శ్రీలంక పోటీదారులకు కూడా ప్రేక్షకుల నుంచి స్పందన లభించింది.

మిస్ వరల్డ్ వేదికపై మెరిసిన తెలంగాణా చేనేత

వేదికపై తెలంగాణ చేనేత వైభవం మెరిసింది. నేషనల్ కాస్ట్యూమ్ రౌండ్‌లో భాగంగా ఆతిథ్య దేశం, రాష్ట్రం సంప్రదాయ వస్త్రధారణను ప్రపంచానికి చాటి చెప్పేలా పోటీదారులు వస్త్రాలు ధరించారు. భారతీయ సంప్రదాయ ప్రకారం అభివందనం చేస్తూ ర్యాంప్ వాక్ చేశారు. పోటీదారుల్లో ఎక్కువ మంది లంగా, వోణీలలో మెరిసిపోయారు. ప్రముఖ డిజైనర్ అర్చనా కొచ్చర్ రూపొందించిన వస్త్రాలు, డిజైన్లు పోటీదారులకు కొత్త అందాన్ని తీసుకొచ్చాయి. తెలంగాణ ఇక్కత్‌తోపాటు తెలంగాణ సంప్రదాయ వస్త్రాలతో ఈ డిజైన్లు రూపొందించానని, అసలైన బంగారు జరీతో వస్త్రాలను తీర్చిదిద్దానని అర్చనా కొచ్చర్ తెలిపారు.

'బ్యూటీ విత్ పర్పస్' విజేత ఇండోనేషియా భామ

మిస్ వరల్డ్ ఇండోనేషియా మోనికా కీజియా సెమ్బిరింగ్.. పోటీలో భాగంగా బ్యూటీ విత్ పర్పస్ అవార్డు విజేతగా నిలిచారు. 'పైప్‌లైన్ ఫర్ లైఫ్‌లైన్' పేరిట చేపట్టిన ప్రాజెక్టు ఆమెకు అవార్డు తెచ్చిపెట్టింది. మెకానికల్ ఇంజనీరింగ్ చదివి ఓ బ్యాంకులో పని చేస్తోన్న మోనికా.. పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారిణిగా కూడా సేవలందిస్తున్నారు.



మోడల్ కాకుంటే.. రాజకీయాల్లో ఉండేదాన్ని

రొమ్ము క్యాన్సర్ రావడంతో భయపడ్డా.. ఆ భయమే ధైర్యాన్నిచ్చి, ముందుకు నడిపించింది

» క్యాన్సర్‌పై అవగాహనకు 'ఓపల్ ఫర్ హర్' ప్రాజెక్టును ప్రారంభించా

» అందాల పోటీలతోనే ప్రపంచానికి.. నా గొంతును వినిపించగలననే నమ్మకం

» 'ఆంధ్రజ్యోతి'తో మిస్‌వరల్డ్ ఓపల్



హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): మోడల్ కాకుండా ఉండిఉంటే.. తాను కచ్చితంగా రాజకీయాల్లో ఉండేదాన్నని, థాయ్‌లాండ్‌కు అంబాసిడర్‌గా సేవలందించడమే తన కర్తవ్యమని మిస్ వరల్డ్-2025 టైటిల్ విజేత ఓపల్ ఉద్ఘాటించారు. తనకు 16వ ఏట రొమ్ము క్యాన్సర్ రావడంతో భవిష్యత్‌పై ఆశలన్నీ ఛిద్రమైపోయినట్లు భావించానని, ఆ భయమే తనలో ధైర్యాన్ని నింపాయని చెప్పారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకే 'ఓపల్ ఫర్ హర్' ప్రాజెక్టును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అందాల పోటీల్లో పాల్గొంటే.. తన గొంతును ప్రపంచానికి వినిపించవచ్చనే ఉద్దేశంతో మోడల్‌గా మారారు. మిస్ వరల్డ్ థాయ్‌లాండ్‌గా నిలిచి.. మెక్సికోలో జరిగిన మిస్ యూనివర్స్-2024లో మూడోస్థానాన్ని సాధించారు. ఇప్పుడు.. 'మిస్ వరల్డ్-2025' టైటిల్‌ని సాధించారు. మిగతా పోటీదారుల కంటే ముందే హైదరాబాద్ చేరుకున్న ఓపల్.. వేడుకలకు ముందు 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. వివరాలు ఆమె మాటల్లోనే..

15 రోజుల్లో సిద్ధమయ్యా

కేవలం 15 రోజుల్లో ఈ పోటీలకు ఎంపికై.. ఇక్కడకు రావడం ఓ అద్భుతమనే చెప్పాలి. నా 18వ ఏట తొలిసారిగా అందాల పోటీల్లో పాల్గొన్నాను. అప్పటి నుంచి పోటీపడుతూనే ఉన్నా.

భయమే.. ధైర్యంగా నడిపింది

వైద్యులు నా 16 ఏళ్ల వయసులో రొమ్ములో పెద్ద కణితిని కనుగొన్నారు. అది నా జీవితంలో అత్యంత క్లిష్టమైన దశ. ఈ దశను విజయవంతంగా అధిగమించాలని, నాకు నేను వాగ్దానం చేసుకున్నా. దాని కోసమే ప్రయత్నించా. 'ఓపల్ ఫర్ హర్' ప్రాజెక్టును ప్రారంభించా. ఈ ప్రాజెక్ట్ ఎంతో మందికి స్ఫూర్తిని కలిగించింది. కొందరు ధైర్యంగా క్యాన్సర్‌తో పోరాడి, విజయం సాధించారు. సమస్యను ముందుగానే గుర్తిస్తే.. అధిగమించవచ్చని.. ఆ దిశగా కృషిచేస్తున్నా.

హైదరాబాద్‌తో సంబంధం

హైదరాబాద్‌కు రావడం ఇదే తొలిసారి. ఈ అనుభూతిని ఎన్నటికీ మరిచిపోలేను. నాకు జన్మనిచ్చిన ఫుకెట్‌కు, హైదరాబాద్‌కు సంబంధం ఉంది. హైదరాబాద్ మాదిరిగానే మాది 'ముత్యాల నగరి'. అందుకే.. హైదరాబాద్ నా మనసుకు నచ్చిన నగరంగా మారింది.

మిస్ వరల్డ్‌గా టైటిల్‌పై..

ఒకవేళ నేను మిస్ వరల్డ్ టైటిల్ గెలిస్తే.. థాయ్‌లాండ్ ఈ కిరీటాన్ని అందుకోవడం తొలిసారి అవుతుంది. మిస్ వరల్డ్‌గా.. ఆరోగ్య పరంగా మహిళల జీవన స్థితిగతులను మార్చాలనుకుంటున్నాను. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ బారిన పడిన వారి జీవితాలను మార్చాలన్నదే నా ఆశయం. మగవారికి కూడా రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయి. దాని పట్ల కూడా అవగాహన కల్పించాలనుకుంటున్నాను. యువతరం కూడా ఈ వ్యాధి బారిన పడుతోంది. అందుకే.. యువతరం ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి. ఆరోగ్యానికి మించిదేమీలేదు. యువతరం ఆరోగ్యంగా ఉంటే.. ఈ ప్రపంచాన్నే మార్చగలరు.

మోడల్ కాకపోయి ఉంటే..

ఒకవేళ నేను మోడలింగ్ రంగంలోకి రాకపోతే.. రాజకీయాల్లో ఉండేదాన్ని. ముఖ్యంగా అంతర్జాతీయ సంబంధాలకు సంబంధించిన విభాగంలో పనిచేసేదాన్ని. భవిష్యత్‌లో థాయ్‌లాండ్ అంబాసిడర్‌గా సేవలందించాలన్నదే నా కోరిక.

జంతువులపై సోదరి ప్రేమ

నాకు జంతువులంటే చాలా ఇష్టం. మా ఇంట్లో 18 పిల్లులు, 5 శునకాలు ఉన్నాయి. వాటిని నా తోబుట్టువుల్లానే చూస్తాను. వాటిపై సోదరి ప్రేమను చూపుతాను.

తెలంగాణ ఆతిథ్యం అపూర్వం

తెలంగాణ ప్రభుత్వ సహకారం, మద్దతు.. అన్నింటికీ మించి ఆతిథ్యం అపూర్వం. తెల్లవారుజామున 2 గంటలకు విమానాశ్రయంలో దిగగానే.. నన్ను ఆహ్వానించడం సంతోషాన్నిచ్చింది. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు నన్ను ఆకట్టుకున్నాయి. ఇక్కడివంటలు చాలా బాగున్నాయి. ఇక్కడి ప్రజల మోముల్లో చిరునవ్వు నాకు చాలా నచ్చింది. నా ఇంట్లో ఉన్నట్లే ఫీల్ అయ్యాను. ఆభరణాలకు నేను పెద్ద అభిమానిని. హైదరాబాద్ పాతనగరంలో ముత్యాలను అన్వేషించాలనుకుంటున్నాను.

ఆలయాలకెళ్తే ప్రశాంతత

నేను థాయ్‌లాండ్‌లో ఓ దేవాలయాన్ని సందర్శించినప్పుడు.. అక్కడ పొందిన అనుభూతి అద్భుతమనిపించింది. మరో ప్రపంచంలా ఫీలయ్యాను. దేవాలయాల్లోని ప్రశాంతతను ప్రత్యక్షంగా అనుభవించాల్సిందే..! హైదరాబాద్ తోపాటు.. భారత్‌లోని దేవాలయాలను సందర్శించాలనుకుంటున్నాను. దేవాలయాల్లో ఏదో తెలియని శక్తి మనకు లభిస్తున్నట్లు అనిపిస్తుంది.



మిస్ వరల్డ్ పోటీదారులతో సుధారెడ్డి

మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్ గౌరవాన్ని బాధ్యతగా భావిస్తా

» మేఘా ఇంజనీరింగ్ సంస్థ డైరెక్టర్ సుధా రెడ్డి

బంజారాహిల్స్, మే 31(ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్‌గా తన నియామకం పట్ల మేఘా ఇంజనీరింగ్ సంస్థ డైరెక్టర్ సుధా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. బ్యూటీ విత్ పర్పస్ దాతృత్వ సంస్థకు ప్రతినిధిగా వ్యవహరించడంతో పాటు గ్లోబల్ అంబాసిడర్‌గా తనకు దక్కిన గౌరవాన్ని బాధ్యతగా భావిస్తానని ఆమె పేర్కొన్నారు. అలాగే, మిస్ వరల్డ్ 2025 గ్రాండ్ ఫినాలే అంతర్జాతీయ న్యాయ నిర్ణేతల కమిటీలో తనని సభ్యురాలిగా చేర్చడం గర్వంగా ఉందని తెలిపారు. తనను గ్లోబల్ అంబాసిడర్‌గా ప్రకటించినందుకు మిస్ వరల్డ్ సంస్థ చైర్‌పర్సన్, వ్యవస్థాపకురాలు జూలియో మోర్లీకి కృతజ్ఞతలు తెలియజేశారు.





మిస్ వరల్డ్ విజేతకు జూపల్లి శుభాకాంక్షలు

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్-2025 విజేత ఓపల్ సుచాతా చువాంగ్ శ్రీకి పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ పర్యాటకంపై ప్రచారం, సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించడమే లక్ష్యంగా నిర్వహించిన మిస్ వరల్డ్ పోటీలు విజయవంతం కావడంపై ఆయన హర్షంవ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ, దిశానిర్దేశంతో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మిస్‌వరల్డ్ వేడుకలను తెలంగాణలో నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ ఈవెంట్‌ను ఎంతో గొప్పగా నిర్వహించిన ప్రతి ఒక్కరికీ జూపల్లి కృతజ్ఞతలు తెలియజేశారు.

సుందరి నీ వంటి..

టాప్-4లోని అందగత్తెలు నలుగురూ నలుగురే

బాలల విద్య, మహిళల సాధికారతకు సుచాత కృషి.. బాలికల జీవితాల్లో మార్పే ఇథియోపియా సుందరి కల

సౌందర్యమంటే ఆలోచనలు, ఆచరణ అనే మాజా క్లాజ్డా.. చిన్న ద్వీపాల గొప్పతనం చాటాలనే తపనతో ఆర్లీ



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్‌కు చెందిన సుచాత షుంగ్‌సిరి మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని సొంతం చేసుకోగా.. ఆఫ్రికాలోని ఇథియోపియాకు చెందిన హస్సెట్ డెరెజ్ రన్నరప్‌గా నిలిచారు. ఐరోపాలోని పోలాండ్‌కు చెందిన మాజా క్లాజ్డా రెండో రన్నరప్‌గా, ఉత్తర అమెరికా ఖండానికి చెందిన ఆర్లీ జోకిమ్ మూడో రన్నరప్‌గా నిలిచారు. ఈ విజేతల నేపథ్యాలివి..

5 అడుగుల 11 అంగుళాల అందం ఓపల్

మిస్ వరల్డ్ సుచాత షుంగ్‌సిరి ముద్దు పేరు 'ఓపల్'. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో 2003లో జన్మించిన సుచాత.. ఎత్తు 5 అడుగుల 11 అంగుళాలు. తనే ఎత్తే తన ప్రత్యేకత అని ఓపల్ అంటుంటారు. చిన్నతనం నుంచే డ్యాన్స్, మ్యూజిక్, మోడలింగ్‌పై ఆమెకు ఆసక్తి ఎక్కువ. ఓపల్‌కు థాయ్‌తోపాటు ఆంగ్లంలో మంచి ప్రావీణ్యం ఉంది. అద్భుతమైన కమ్యూనికేషన్ స్కిల్స్ ఆమె సొంతం. ప్రతిభ, పట్టుదల, సమాజానికి సేవ చేయాలనే తపన ఉంటే ఏదైనా సాధ్యమని చెప్పే సుచాతకు సామాజిక సేవపై ఆసక్తి ఎక్కువ. బాలల విద్య, మహిళల సాధికారత కోసం ప్రధానంగా కృషి చేస్తుంటారు. మోడలింగ్ రంగంలోకి ప్రవేశించి, అంతర్జాతీయ సంబంధాలపై అధ్యయనం చేస్తున్నారు. వాయిస్ ఫర్ చేంజ్ సిల్వర్ అవార్డును గెలుచుకుని ప్రపంచానికి తన సామాజిక స్పృహ చాటారు. 2024లో మిస్ యూనివర్స్ థాయ్‌లాండ్ టైటిల్ గెలిచిన సుచాత.. ఆ తర్వాత మిస్ వరల్డ్ థాయ్‌లాండ్ 2025గా ఎంపికయ్యారు. ఓపల్ మిస్ వరల్డ్ థాయ్‌లాండ్‌గా గెలిచి, మల్టీమీడియా ఛాలెంజ్‌లో విజయం సాధించి టాప్ 40లో స్థానం పొందారు. మిస్ వరల్డ్ వేదికపై థాయ్ సంప్రదాయాన్ని ఆత్మవిశ్వాసంతో ప్రదర్శించారు. పోటీలోని టాలెంట్ సెగ్మెంట్, బ్యూటీ విత్ పర్పస్ ప్రాజెక్టు ద్వారా ఆమె న్యాయ నిర్ణేతల మనసు గెలుచుకున్నారు.

హస్సెట్ డెరెజ్ - ఇథియోపియా

మిస్ వరల్డ్ 2025లో రన్నరప్‌గా నిలిచిన హస్సెట్ డెరెజ్ ఇథియోపియాకు చెందిన మోడల్, సామాజిక కార్యకర్త. తమ దేశ సంప్రదాయాలను గర్వంగా ప్రపంచానికి చూపించడంలో ఆమె అదరగొట్టారు. బాల్యంలో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ, చదువుపై ఆసక్తి, సేవ మార్గంలో నిబద్ధతతో ఎదిగారు. మహిళల హక్కులు, బాలికల విద్య, వాతావరణ పరిరక్షణ వంటి అంశాల్లో సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. మిస్ వరల్డ్ వేదికపై ఆమె చేసిన ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది. తన బ్లూ హోప్- క్లీనింగ్ వాటర్ ప్రాజెక్ట్ ఆమె విజయంలో కీలకపాత్ర పోషించింది. ఆమెకు టాప్-4లో స్థానం దక్కేలా చేసింది.

మాజా క్లాజ్డా - పోలాండ్

పోలాండ్‌లోని లెంచ్నా అనే చిన్న పట్టణానికి చెందిన మాజా క్లాజ్డా.. మిస్ వరల్డ్ పోలాండ్ 2025 టైటిల్‌ను గెలుచుకొని అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించారు. చిన్నతనం నుంచే మోడలింగ్, డ్యాన్స్, సామాజిక సేవపై ఆమెకు ఆసక్తి. కమ్యూనికేషన్ అండ్ మీడియా స్టడీస్‌లో డిగ్రీ పొందిన మాజా.. వృద్ధుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వహించే సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. 'మిస్ పొలోనియా' పోటీ ద్వారా మిస్ వరల్డ్ 2025కు ఎంపికయ్యారు. తన అందం, మేధస్సు, తమ సంస్కృతిని మిస్ వరల్డ్ వేదికపై చూపడం ద్వారా ఆమె టాప్-4లో చోటు దక్కించుకున్నారు.సౌందర్యమనేది ఒక రూపం కాదని, అది మన ఆలోచనలు, మన ఆచరణ అనే భావనతో ఆమె ఈ పోటీల్లో పాల్గొన్నారు.

ఆర్లీ జోకిమ్- మార్టినిక్ (ఉత్తర అమెరికా)

ఉత్తర అమెరికాలోని మార్టినిక్ అనే చిన్న ద్వీపదేశానికి చెందిన ఆర్లీ జోకిమ్‌కు చిన్నతనం నుంచే డ్యాన్స్, సంగీతం, సమాజ సేవ అంటే ఇష్టం. తమ దేశంలోని విశ్వవిద్యాలయంలో పబ్లిక్ హెల్త్ విభాగంలో చదువుతున్న ఆర్లీ.. మిస్ వరల్డ్ పోటీకి ఎంపికయ్యాక తన బ్యూటీ విత్ పర్పస్ ప్రాజెక్ట్ (దీవులోని గ్రామాల్లో యువతకు వృత్తిపరమైన శిక్షణ) ద్వారా ఎంతోమందికి ప్రేరణగా మారారు. తన దేశ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయడం, చిన్నద్వీపాల గొప్పతనాన్ని ప్రపంచానికి చూపాలన్న తపనతోనే ఆమె మిస్ వరల్డ్ పోటీలకు వచ్చారు.

ప్రతిపక్ష నేత పేరిట మండలం

» ములుగు జిల్లా మల్లంపల్లి పేరు జేడీ మల్లంపల్లిగా మార్పు

» హామీ నెరవేర్చిన మంత్రి సీతక్క

హైదరాబాద్, ములుగు, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఓ మండలానికి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీకి చెందిన నేత పేరు పెట్టింది. ములుగు జిల్లాలో కొత్తగా ఏర్పడిన మల్లంపల్లి మండలం పేరును జేడీ మల్లంపల్లిగా రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేసింది. ఇందుకు సంబంధించిన గెజిట్ శనివారం విడుదలైంది. బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు, మాజీ జడ్పీ చైర్మన్, దివంగత కుసుమ జగదీష్ పేరును చేర్చుతూ మల్లంపల్లిని జేడీ మల్లంపల్లిగా మార్పు చేశారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు మల్లంపల్లిని మండలంగా ప్రకటించాలంటూ కుసుమ జగదీష్ తీవ్రంగా ప్రయత్నించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత మల్లంపల్లిని మండలంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, కుసుమ జగదీష్ ఇటీవల మరణించగా.. పరామర్శకు వెళ్లిన మంత్రి సీతక్క.. మల్లంపల్లి మండలానికి ఆయన పేరు పెట్టిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు పేరు మార్పుపై గెజిట్ విడుదల కావడంతో సీతక్క ఇచ్చిన హామీ నెరవేరింది. కాగా, రాజకీయాలకు అతీతంగా ప్రతిపక్ష పార్టీకి చెందిన నేత పేరిట మండలాన్ని ఏర్పాటు చేయించినందుకు మంత్రి సీతక్కకు మల్లంపల్లి మండల సాధన సమితి సభ్యులు, ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.

అంగన్‌వాడీల పదవీ విరమణ వయస్సు పెంపు

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వ కార్యదర్శి అనితా రామచంద్రన్ శనివారం ఉత్తర్వులిచ్చారు. దీంతోపాటు అంగన్‌వాడీ ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాలను రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు, సహాయకులకు రూ.50వేల నుంచి రూ.లక్ష పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 60ఏళ్లు దాటి స్వచ్ఛంద పదవీ విరమణ చేసే ఉద్యోగులకు కూడా ఈ ప్రయోజనాలు వర్తిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్

» అధ్యయనం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్ సిటీ, మే31 (ఆంధ్రజ్యోతి): లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్(ఎల్‌ఏడీపీ)కు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. హైదరాబాద్ మహానగర విస్తరణలో పక్కాగా ఎల్‌ఏడీపీని అమలు చేయడానికి అధ్యయనం చేస్తోంది. 11 జిల్లాలు, 104 మండలాలు, 1355 గ్రామాలతో 10,472చదరపు కిలోమీటర్ల మేర హెచ్‌ఎండీఏ పరిధి విస్తరించగా ఆ మేరకు త్వరలో సిద్ధమవ్వనున్న మెగా మాస్టర్‌ప్లాన్-2025లో కూడా ఎల్‌ఏడీపీని భాగం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ పూలింగ్ స్కీమ్-2017ను హెచ్‌ఎండీఏ పకడ్బందీగా అమలు చేసేందుకు లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు. ఎల్‌ఏడీపీ విధానాన్ని ఇప్పటికే గుజరాత్‌లో అమలు చేస్తుండగా ఏపీలో అమరావతి రాష్ట్ర రాజధాని నిర్మాణంలో కీలకమైన సీఆర్‌డీఏ తరహాలో కసరత్తు చేస్తున్నారు. కాగా.. ఒక ప్రదేశంలో భవిష్యత్తులో ఎలా అభివృద్ధి చేయాలి? ఎక్కడ ఎలాంటి సదుపాయాలు అవసరం? భూమిని ఎలా వినియోగించాలి? అనే అంశాలపై రూపొందించే పూర్తిస్థాయి ప్రణాళికనే ఎల్‌ఏడీపీ. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి, వనరులను సమర్థంగా వినియోగించడానికి ప్రజల భవిష్యత్తు అవసరాల కోసం ఎల్‌ఏడీపీ దోహదపడనుంది. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య టౌన్‌షిప్‌ల విస్తరణలో ఎల్‌ఏడీపీ కీలకం కానుంది. ల్యాండ్‌పూలింగ్ స్కీమ్‌లో ప్రస్తుతం 50ఎకరాలకు పైగా భూములను అందించేందుకు యజమానులు ముందుకు వస్తేనే అక్కడ హెచ్‌ఎండీఏ లేఅవుట్ అభివృద్ధి చేస్తోంది. అందులో యజమానులవాటా 60%, హెచ్‌ఎండీఏ వాటా 40% ఉంటుంది. అయితే హెచ్‌ఎండీఏ వాటాగా వచ్చే 40% విక్రయిస్తున్నారు. కానీ ఎల్‌ఏడీపీలో మాత్రం ప్రభుత్వ, అసైన్డ్, పట్టా భూములను సేకరించనున్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా కొంత పరిధిని ఎల్‌ఏడీపీగా నిర్ణయించనున్నారు. అందులో అసైన్డ్, పట్టా భూములకు అవసరమైన అభివృద్ధి చేసిన స్థలాలను కేటాయించనున్నారు. మిగిలిన స్థలాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా వినియోగించనున్నారు. స్థానికసంస్థలకు ల్యాండ్ బ్యాంకుగా ఉపయోగపడనుంది. ఆస్పత్రులు, స్కూళ్లను వివిధ ప్రజా అవసరాలకు వినియోగించనున్నారు. ఏపీలో సీఆర్‌డీఏ సేకరిస్తున్న భూములను ప్రజా అవసరాలకు ఏవిధంగా వినియోగిస్తున్నారో.. అదే తరహాలో ఎల్‌ఏడీపీలో నిర్ణయించే ప్రాంతాల్లో వచ్చే ల్యాండ్ బ్యాంకుతో స్థానిక సంస్థల, ప్రజల అవసరాలను తీర్చనున్నారు. హెచ్‌ఎండీఏ సరికొత్త మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేస్తుండగా.. అదే సందర్భంలో ఎల్‌ఏడీపీపై అధ్యయనం చేయాలని హెచ్‌ఎండీఏ అధికారులకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సూచనలు చేసినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌ఏడీపీ అమలుకు హెచ్‌ఎండీఏ ప్రణాళికలు దోహదపడనున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.